అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
మంగళవారం 17-12-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 298
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

## రైతుల ట్రాక్టర్ మార్చ్



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

18న రైల్‌రోకో

వివరాలు 11లో

## అలా మొదలై..

### పదే పది నిమిషాలు సాగిన అసెంబ్లీ

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా విమర్శలు

- సభ లోపలా బయటా గులాబీదళం నిరసనలు
- నేటికి వాయిదా



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ 'ఢీ అంటే ఢీ' అంటూ తలబడ్డాయి. ఇరు పార్టీలు ప్రతిష్టకుపోయాయి. పర్యాటక విధానంపై సర్కారు చర్చను ప్రారంభించగా, లగచర్ల రైతుకు బేడీలపై చర్చకు అనుమతించాలని ప్రతిపక్షం పట్టుబట్టింది. బీఆర్ఎస్ నిరసనలు, నినాదాల మధ్య ప్రశ్నోత్తరాల అనంతరం పదే పది నిమిషాలు సభ నడిచింది. మధ్యాహ్నం 2.:30 గంటలకు ప్రారంభమైన సభ, 2:40కే వాయిదా పడింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పర్యాటక రంగంపై స్వల్పకాలిక చర్చకు అనుమతించగా ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత పదేండ్లల్లో పర్యాటక రంగ అభివృద్ధికి సరైన విధానం రూపొందించలేదన్నారు. ఆదాయమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా కొత్త విధానాన్ని అమలుచేయనున్నామని ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పుల కుప్పను, చిప్పను తెలంగాణ ప్రజల చేతికిచ్చిందని వ్యాఖ్యానించారు. వినోదంతోపాటు ఆదాయాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ పర్యాటక విధానంపై చర్చించాలని సభకు సూచించారు. సభ్యులు సభ సజావుగా నడవటానికి సహకరించాలని కోరారు. అనంతరం జూపల్లి మరింత వివరణ ఇచ్చే ప్రయత్నం చేయగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు అడుగడుగునా అడ్డు తగిలారు. లగచర్లపై చర్చకు పట్టుబడుతూ నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ సభా మర్యాదను కాపాడాలని బీఆర్ఎస్ నేతలు కె.తారకరామారావు, టి. హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డిని కోరారు. రూల్‌బుక్ అందరమూ కలిసే తయారుచేసుకున్న సంగతిని గుర్తు చేశారు.

**ప్లకార్డులు తేవడం సరికాదు :స్పీకర్ గడ్డం ప్రసాద్**

సభకు ప్లకార్డులు తేవడం సరికాదనీ, నినాదాలు చేయడాన్ని తప్పుబట్టారు. అందరూ కూర్చోవాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. కాగా బీఆర్ఎస్ సభ్యులు సీట్ల దగ్గర ఉండే నిరసన తెలుపుతుండగా, స్పీకర్ మార్షల్స్‌ను పిలిచారు. సభ్యుల దగ్గర ఉన్న ప్లకార్డులు తీసుకోవాలని ఆదేశించారు. మార్షల్స్ ఆ ప్రయత్నం చేస్తుండగానే బీఆర్ఎస్ సభ్యులు మార్షల్స్‌ను నెట్టుకుంటూ స్పీకర్ పోడియం దగ్గరకు చేరుకుని మళ్లీ నిరసనకు పూనుకున్నారు. స్పీకర్ పోడియంకు కుడివైపు హరీశ్‌రావు ప్లకార్డుతో వెళ్లగా, ఎడమవైపు కేటీఆర్ మిగతా సభ్యులతో ఆందోళనకు దిగారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడం షేమ్ షేమ్ అన్నారు. రైతులకు కరెంటు షాకులు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం..దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది జరుగుతుండగానే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 2:40 గంటలకు సభలోకి అడుగుపెట్టారు. సభా పరిణామాలను గమనిస్తూ కూర్చున్నారు. ఒకవైపు నిరసన, మరోవైపు మంత్రి జూపల్లి ప్రసంగం నడుస్తుండగానే మధ్యలో స్పీకర్ జోక్యం చేసుకుని సభను మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

**మీడియా పాయింట్ వద్ద నిరసన**

అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం బీఆర్ఎస్ సభ్యులంతా నినాదాలు చేసుకుంటూ మీడియా పాయింట్ వద్దకు వచ్చారు. అప్పటికే కాంగ్రెస్ సభ్యులు మీడియాతో మాట్లాడుతుండటంతో కొద్దిసేపు ఆగాల్సి వచ్చింది. కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు నినాదాలు చేస్తూ దాదాపు అరగంటపాటు నిరసన తెలిపారు. లాఠీ రాజ్యం, లూటీ రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం, రైతులకు బేడీలు.. మంత్రులకు జల్సాలు అంటూ నినాదాలు చేశారు. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లగచర్లలో భూములు ఇవ్వకపోతే జైల్లో పెడతారా ? అని ప్రశ్నించారు. ఈ ఘటనపై అసెంబ్లీలో చర్చ పెట్టకుండా రేవంత్‌రెడ్డి పారిపోయారని విమర్శించారు. అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం సభనూ, ప్రజలనూ తప్పుదోవ పట్టిస్తున్నదని ఆరోపించారు. రైతులు ఇబ్బంది పడుతుంటే టూరిజంపై చర్చ అవసరమా ? అని అడిగారు. సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు...ఎక్కే విమానం, దిగే విమానం తప్ప ఒక్క పైసా తేలేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే సభాహక్కుల కింద నోటీసు ఇచ్చినట్టు చెప్పారు. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డికి నోటీసులిస్తే అప్పటి స్పీకర్ చర్చకు అనుమతి ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు ఆర్‌బీఐ నివేదికలో తేటతెల్లమైందని' అని స్పష్టం చేశారు.

## 21వరకే అసెంబ్లీ!

### బీఏసీ నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్

### 15 రోజులు నిర్వహించాలంటూ పట్టు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈనెల 9న ప్రారంభమై వాయిదా పడిన అసెంబ్లీ సమావేశాలు...తిరిగి సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 21 వరకు కొనసాగనున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ...10లో

## ఉద్దేశపూర్వక దాడి

### రాజ్యాంగ విలువలకు ప్రధాని మోడీ తూట్లు

### మహిళలకు ఓటు హక్కు కల్పించడాన్ని ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించింది : సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య



**న్యూఢిల్లీ :** దేశంలో రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూరిత దాడి జరుగుతోందని సీపీఐ(ఎం) రాజ్యసభ నేత బికాష్ రంజన్ భట్టాచార్య విమర్శించారు. రాజ్యాంగానికి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు.దేశ ప్రధాని ఆలయానికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లి రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడి చేశారని అన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని ఎప్పుడూ వెళ్లి గుడి శంకుస్థాపన చేయలేరని చెప్పారు. 2014 నుంచి రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూర్వక దాడి జరుగుతోందని వివరించారు. గతంలో 1975 ఎమర్జెన్సీ సమయంలో దాడి జరిగిందనీ, ఎమర్జెన్సీ విధించిన వ్యక్తే ఆ తర్వాత తన తప్పును ఒప్పుకున్నారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఎమర్జెన్సీ విధించకుండానే దాడి చేస్తున్నారనీ, పైగా దాన్నే ...10లో



## అమిత్ షా పెద్ద వాషింగ్ మెషిన్ కొన్నారు


### అందులోకి ఎవరు వెళ్లినా పరిశుద్ధులైపోతారు : ఖర్గే

11లో..

## ఫార్ములా వన్ కేసుపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్

### సీఎస్ ఆ దస్త్రాన్ని త్వరలోనే ఏసీబీకి పంపిస్తారు

### చట్ట ప్రకారం దర్యాప్తు :మంత్రి పొంగులేటి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'ఫార్ములా వన్'కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు ప్రభుత్వానికి గవర్నర్ నుంచి అనుమతి లభించిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ మేరకు గవర్నర్ జారీ చేసిన దస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతి త్వరలోనే, ఇంకా చెప్పాలంటే మంగళవారమే ఏసీబీకి పంపిస్తారని ఆయన వివరించారు. ఈ కేసుకు సంబంధించి చట్ట ప్రకారమే ఏసీబీ తన దర్యాప్తును కొనసాగిస్తుందని వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ వాయిదా అనంతరం పొంగులేటి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఫార్ములా వన్ కేసుకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గంలో ...11లో

## సంక్రాంతి నుంచి రైతు భరోసా?

### రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

ఐదు ఆర్డినెన్సులకు ఆమోదం 10లో..

## పరస్పర సహకారంతో ముందడుగు

### ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధికి కొలంబో వేదిక

### శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే

### త్వరలో ఇరు దేశాల మధ్య రక్షణ ఒప్పందం : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ :** భారత్ -శ్రీలంకల మధ్య త్వరలో రక్షణ సహకార ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించినట్టు సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భూ జల అధ్యయనంపై ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధికి కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్ ఓ ముఖ్యమైన వేదికగా ఇరుదేశాలు భావిస్తున్నాయని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకెతో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు మన నాగరికతతో ముడిపడి ఉన్నాయని అన్నారు. భారత్‌లో పాలీ భాషకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా ఇచ్చినపుడు, శ్రీలంకలో కూడా వేడుకలు జరుపుకున్నారని అన్నారు. శ్రీలంక అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తన తొలి విదేశీ పర్యటన కోసం భారత్‌ను ఎంచుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. రెండు దేశాలు భవిష్యత్ దృక్పథాన్ని అనుసరించాయని ప్రధాని ప్రకటించారు.

ఆర్థిక సహకారంలో భాగంగా పెట్టుబడి ఆధారితవృద్ధి, కనెక్టివిటీకి ప్రాధాన్యతనిచ్చామని అన్నారు. డిజిటల్, భౌతిక మరియు ఇంధన కనెక్టివిటీ తమ భాగస్వామ్యానికి ముఖ్యమైన మూలస్తంభాలుగా ఉంటాయని తాము నిర్ణయించుకున్నామని అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న సంగతి తెలిసిందే. సోమవారం ఆయన ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురితో సమావేశమయ్యారు.

## కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు ?

### ఫార్ములా-ఈ కార్‌రేసింగ్‌పై కేసు నమోదుకు ఏసీబీ రంగం సిద్ధం



**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రంలో మరో సంచలన కేసుకు ఏసీబీ రంగం సిద్ధం చేస్తున్నది. ఫార్ములా-ఈ కార్‌రేసింగ్‌కు సంబంధించి కోట్ల రూపాయల నిధుల గోల్‌మాల్ జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై దృష్టిని సారించిన రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ).. దీనికి సంబంధించి అప్పటి పట్టణ మునిసిపల్ శాఖ మంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉచ్చు బిగిస్తున్నట్టు తెలిసింది. 2023లో ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌ను హైదరాబాద్‌లో నిర్వహించటానికి గానూ విదేశీ కంపెనీకి రూ.50 కోట్లకు పైన కేటీఆర్ నిధులు మళ్లించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందుకు క్యాబినెట్ నుంచి ఎలాంటి ఆమోదం పొందకుండా సొంతంగానే కేటీఆర్ నిర్ణయం తీసుకొని పెద్ద మొత్తంలో నిధులను మళ్లించినట్టు విమర్శలున్నాయి. దీని వెనక పెద్ద మొత్తంలోనే ముడుపులు చేతులు మారినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, మునిసిపల్ శాఖకు చెందిన ఈ నిధులను మళ్లించారంటూ ఆ శాఖకు చెందిన అధికారులు ఏసీబీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఒకపక్క అంతర్గతంగా విచారణ జరిపిన ఏసీబీ అధికారులు.. ఒక నివేదికను సమర్పించటంతో స్పందించిన ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారం వెనక కేటీఆర్ పాత్ర ఉన్నట్టు తేల్చి ఆయనపై విచారణకు ఏసీబీని సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, ఈ వ్యవహారంపై కేసును నమోదు చేసి సమగ్రంగా విచారణ జరపటానికి గానూ అవసరమైన ప్రభుత్వ అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురు చూస్తున్నట్టు తెలిసింది.




## మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

25 వరకు నిర్వహణ

జనవరి 31, ఫిబ్రవరి 1న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్

ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్

జనవరి 29న నైతికత, మానవ విలువలు, 30న పర్యావరణ విద్య పరీక్ష

టైంటేబుల్ విడుదల

2లో..

# ఫెడరల్ వ్యవస్థకు జమిలీ వ్యతిరేకం

### ఆర్థికభారం తగ్గదు.. మరింత పెరిగే అవకాశం

### కుంభకోణం బయటపడినా అదానీని మోడీ వెనకేసుకొస్తారా ?

### రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

### ఇచ్చిన హామీలపై రేవంత్ ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలి


### ప్రజాస్వామ్యం అంటూనే ఏకపక్ష నిర్ణయాలు : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




**నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానాన్ని సీపీఐ(ఎం)గా వ్యతిరేకిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. 'బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని చెబుతున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే చర్య. ఫెడరల్ వ్యవస్థను బలహీన పరుస్తుంది. రాష్ట్రాల శక్తిని మరింత హరిస్తుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి ఎన్నికల వల్ల ఆర్థికభారం తగ్గుతుందని కారణంగా చూపెడుతున్నారు.. ఇది అబద్ధం. నిజానికి ఖర్చు భారీగా పెరుగుతుందన్నారు. ఐదేండ్ల కోసం అని ఒక రాష్ట్రంలో ఎన్నుకున్న ప్రభుత్వం అనుకోని కారణాలతో పడిపోతే, ఐదేండ్ల కోసంగాకుండా మిగిలి ఉన్న సమయానికే ఎన్నికలు జరుగుతాయని అన్నారు. మూడుసార్లు ఎన్నికలు జరిగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఇది ఏ విధంగానూ దేశానికి క్షేమదాయకం కాదన్నారు. చౌటుప్పల్‌లో జరుగుతన్న సీపీఐ(ఎం) యాదాద్రిభువనగిరి జిల్లా మూడో మహాసభలో తమ్మినేని వీరభద్రం ప్రారంభ ఉపన్యాసం చేశారు. అంతకుముందు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ప్రతినిధుల సభ అనంతరం విలేకరుల సమావేశంలోనూ తమ్మినేని మాట్లాడారు. దేశంలో అదానీ, అంబానీలతో ప్రధాని మోడీ స్నేహం వికృత రూపం దాలుస్తోందన్నారు. ముఖ్యంగా విదేశాల్లో లిస్టు చేసిన అదానీ కంపెనీలు రూ.70, 80 వేల కోట్ల సంపదను పోగేసి మన దేశంలో కొన్ని రాష్ట్రాలకు లంచాలు కూడా ఇచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సీఎంకు రూ.1750 కోట్ల ముడుపులు ఇచ్చాయని, అదేవిధంగా గోవా, జమ్ము కాశ్మీర్‌లో కూడా ఇచ్చినట్టు చెప్తున్నారని అన్నారు. ఈ కుంభకోణం బయటికి వచ్చిన తర్వాత వెంటనే చర్యలు తీసుకోవాలి, లేకపోతే అదానీని అరెస్టు చేయాలి కానీ అలాంటిదేమీ చేయకపోగా ప్రధాని మోడీ సహా మంత్రివర్గం సమర్థించడం దారుణమని విమర్శించారు. ప్రధానిని విమర్శిస్తే దేశాన్ని విమర్శించినట్టు బీజేపీ నాయకులు అంటున్నారని, కానీ పార్లమెంట్ డిమాండ్ చేస్తున్నట్టుగా పార్లమెంటరీ వ్యవహారాల కమిటీతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ కోసం అదానీ ఇచ్చిన రూ. 100 కోట్ల విరాళాన్ని వెనక్కు ఇచ్చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమని, అలాగే దావోస్‌లో చేసుకున్న ఒప్పందం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న నేపథ్యంలో సంబరాలు చేసుకోవడంలో తప్పు లేదుగానీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. లోపాలను ...10లో




## నేలకొరిగిన వీరపుత్రుడు

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దర్గా నాయక్ మృతి

**నవతెలంగాణ-జనగామ**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సీనియర్ కమ్యూనిస్టు కామ్రేడ్ దర్గా నాయక్ (107) జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామంలో మృతిచెందారు. దర్గానాయక్ విసునూరు దొరతో పాటు రజాకార్ల వెన్నులో వణుకుపుట్టించిన పోరాట యోధుడు. ఆయన అంత్యక్రియలు అతని స్వగ్రామంలో నిర్వహించనున్నామని, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. ఎర్ర జెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ దర్గా నాయక్.. కామ్రేడ్ జాటోత్ రాను ...11లో

## గురుకుల హాస్టల్లో ఎలుకల బెడద

ఐదుగురు విద్యార్థినులను కరిచిన ఎలుకలు 11లో..

## నేడు జమిలీపై బిల్లు..!


బీజేపీ ఎంపీలకు విప్ జారీ

గతంలో మాదిరిగా మూజువాణి ఓటింగా..లేక జేపీసీకి సిఫారసా..? 11లో..

## మెజారిటీ వ్యాఖ్యపై చర్చ

వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వండి : అలహాబాద్ జడ్జికి సుప్రీం కొలీజియం సమన్లు 11లో..

# పుస్తకమంటే జ్ఞానం..సర్వజన నేస్తం



సమాజ మార్పులో దాని పాత్ర కీలకం

- యువత రచనల వైపు రావడం మంచి పరిణామం
- పుస్తకాలకు పెరుగుతున్న ఆదరణ
- పుస్తక ప్రదర్శనను సందర్శించండి..స్ఫూర్తి పొందండి : హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పుస్తకమంటే జ్ఞానం. సర్వజన నేస్తం. అధ్యయనం పట్ల నేటి యువత ఆసక్తి చూపుతున్నది. సమాజ మార్పులో పుస్తకం పాత్ర కీలకం. ఇంటర్నెట్ యుగంలో పుస్తకం ప్రాధాన్యత తగ్గుతున్నదనేది ఒట్టిమాటే. ఉన్నత చదువుల్లో బిజీగా ఉండి కూడా యువత రచనలు చేయడం మంచి పరిణామం. ఆహ్వానించదగినది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగానూ పుస్తక ప్రదర్శనలకు ఆదరణ పెరుగుతున్నది. ఆ దిశలోనే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ జాతీయ పుస్తక ప్రదర్శనగా ఎదిగింది. లక్షలాది మంది పుస్తక ప్రియులను ఒక్కచోటకి చేర్చి జాతరను తలపిస్తున్నది. సమాజాన్ని మేల్కొపే అక్షర ఆయుధంగా బుక్‌ఫెయిర్ మారింది. ఎంత బిజీగానైనా ఉండండి. పదిరోజుల పాటు జరిగే బుక్‌ఫెయిర్‌ను మిస్ కాకండి. ఒక్కసారైనా కుటుంబంతో సందర్శించండి. కొత్త అనుభూతి, స్ఫూర్తిని పిల్లల్లో నింపగలిగే అవకాశాన్ని వినియోగించుకోండి' అని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్ అన్నారు. ఈ నెల 19 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గల దాశరథి కృష్ణమాచార్యుల ప్రాంగణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన జరుగనున్నది. ఈ క్రమంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి అచ్చిన ప్రశాంత్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

### హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాశస్త్యం ఇలా..

ఇంతింతై..వటుడింతైనట్టుగా చిక్కడపల్లిలో సిటీ సెంట్రల్ లైబ్రరీలో నాలుగైదు పబ్లిష్ సంస్థలు, సెల్లర్స్‌తో ప్రారంభమైన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ నేడు 354 స్టాళ్లకు చేరుకున్నది. మనదేశంలో కలకత్తా, బెంగుళూరు, ముంబై, ఢిల్లీ, జైపూర్ లాంటి బుక్‌ఫెయిర్‌లతో పాటు జాతీయస్థాయికి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఎదిగిందని గర్వంగా చెబుతున్నాను. మున్ముందు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. పబ్లిషర్స్ విస్తరించాలి. ఇంగ్లీష్ పబ్లిషర్స్ సంఖ్య పెరగాలి.

### మనుషులను విభజించని సాహిత్యం మరింత రావాలి

జీవితంలో ఎవరైనా కోరుకునేది సుహృద్భావ వాతావరణంలో బతకాలన్నదే. భిన్నమైన ఆచారాలు, సాంప్రదాయాలు పుట్టుకతో రావచ్చుగాక వారందరినీ కలిపి ఉంచేది మానవీయతనే. భిన్నత్వంలో ఏకత్వం అనే భావన చెడకుండా రావాలంటే దానికి అనుగుణమైన రచనలను సమాజంలోకి వెదజల్లాల్సిన అవసరముంది. అంతిమంగా మనుషులను విభజించని సాహిత్యం రావాల్సిన అత్యావశ్యకత ఉంది. దానిని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాల్సిన బాధ్యత యువరచయితలపై ఉందని నేను భావిస్తున్నాను.

### మానవజాతిని కదిలించే శక్తి పుస్తకానికి ఉంది

అధ్యయనం చేయకపోతే ఎదుటివారు చెప్పేదే నిజమనే భావనలోకి కూరుకుపోతాం. డాక్టర్‌గా..సాఫ్ట్‌వేర్‌గా..మరే ఉన్నత ఉద్యోగంలో రాణించాలన్నా సామాజిక స్పృహ తప్పనిసరి. మానవజాతిని కదిలించే శక్తి పుస్తకానికుంది. పుస్తకజ్ఞానం ఉన్నవారే జీవితంలో రాణిస్తారు. ఉన్నతస్థాయిలో ఉన్నవారినెవరిని పరిశీలించినా అది మనకు కనిపిస్తున్నది. మంచి సమాజం కావాలంటే పుస్తకాలు చదవాలి. బాలసాహిత్యం కొనుగోలు పెరగటం మంచి పరిణామం. చిన్నపిల్లలతో విరివిగా కథల పుస్తకాలు చదివించాలి. ఇది పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుంది. ఏఐ టెక్నాలజీ, సోషల్‌మీడియా ఇంకేం వచ్చినా పుస్తకాలకు శాశ్వత విలువ ఉంటుంది. పుస్తకం చదివితే వచ్చే మానసికానందం వెలకట్టలేనిది.

### మెరుగైన సమాజం దిశగా అడుగులు వేసేలా..

బుక్‌ఫెయిర్ లక్ష్యం పుస్తకాలు అమ్మడం, కొనడం అనే ప్రక్రియ కానేకాదు. పుస్తకాలను ప్రజల దగ్గరకు విస్తృతంగా చేర్చడం, మెరుగైన సమాజం దిశగా అడుగులు వేసేలా పౌరులను తీర్చిదిద్దడం మా లక్ష్యం. పది రోజుల్లో కూడా పుస్తకాల మీద అనేక చర్చా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్కూల్, కాలేజీ పిల్లలు బుక్‌ఫెయిర్‌ను సందర్శించేలా చేస్తున్నాం. పుస్తకాలు చదివే సంస్కృతి వైపు వారిని నడిపించే బాధ్యతను బుక్‌ఫెయిర్ తలకెత్తుకున్నది. అందులో భాగంగానే జిల్లా కేంద్రాల్లోనూ ప్రదర్శనలు చేపడుతున్నది. మంచి పిల్లలను తయారు చేయడమంటే మెరుగైన సమాజాన్ని తయారు చేయడమే.

### ప్రభుత్వ తోడ్పాటు మరింత పెరగాలి

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న జాతీయ పుస్తక ప్రదర్శన నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిది. కొన్నేండ్లుగా బుక్ ఫెయిర్ నిర్వహణకు ఎన్టీఆర్ స్టేడియాన్ని ఉచితంగానే ఇస్తున్నది. దీనికి కృతజ్ఞతలు. పుస్తకాల ప్రదర్శనలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రచారానికి కొన్ని స్టాళ్లను కేటాయిస్తున్నాం. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు సొంత భవనమంటూ లేదు. సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు జరుపుకునేందుకు ఒక కాన్ఫరెన్స్‌హాల్ ఉండాలి. సాహితీ ప్రముఖులు, పుస్తకాల పబ్లిషర్స్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఉండటానికి కొన్ని రూములతో కూడిన భవనం ఉండాలి. అలాచేస్తే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ విశిష్టత పెరుగుతుంది. ఆ వైపుగా ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నాను.

### పాఠశాలలు, కళాశాలల్లో సామాజిక, సాహిత్య శాస్త్రాల అధ్యయనం పెరగాలి

పాఠశాలలు, కళాశాలల్లో సామాజిక, సాహిత్య శాస్త్రాలు చదువుకునే అవకాశాలను పెంచాలి. ఆవైపు పిల్లలను తీర్చిదిద్దాలి. నిజమైన చరిత్రలు నమోదు కావాల్సిన అవసరముంది.

### మరుగునపడిన పుస్తకాల ప్రస్తావన తెరపైకి

ఈసారి బుక్‌ఫెయిర్‌లో నచ్చిన పుస్తకం..మార్చిన పుస్తకం..ప్రభావితం చేసిన పుస్తకం అనే థీమ్‌తో ప్రముఖ రచయితలు, కవులతో చర్చావేదికను నిర్వహించబోతున్నాం. మరుగునపడిన అనేక పుస్తకాల ప్రస్తావన మళ్లీ తెరమీదికి తీసుకురాబోతున్నాం. కొత్త తరంలో ఆసక్తిని రేకెత్తించి వాటిని చదవడానికి పురిగొల్పే వాతావరణాన్ని తీసుకురావడం దీని ముఖ్య ఉద్దేశం.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నైజాంను ధిక్కరించి తెలంగాణను శ్లాఘించిన మహాకవి దాశరథి శతజయంతి కాలమిది. అందుకే ఈసారి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి ఆ మహనీయుని పేరు పెట్టాం. బోయి విజయభారతి, తోపుడుబండి సాధిక్ పేరుతో రెండు వేదికలను నిర్మిస్తున్నాం. తెలంగాణ వైతాళికులందరినీ గుర్తుచేసుకునే విధంగా వారి చిత్రపటాలను బుక్‌ఫెయిర్‌లో ప్రదర్శించబోతున్నాం. ప్రతిఒక్కరూ సందర్శించండి.

### చదువు జ్ఞానానికి సింబల్

ప్రస్తుతం చదువుకోవడం జ్ఞానానికి సింబల్ అనే భావన నుంచి ఉద్యోగం కోసం చదువు అనే దుస్థితి వచ్చింది. విద్యాలయాల్లో చదువు నిర్వచనం మారి మార్కులతో విద్యను కొలిచే పద్ధతి వచ్చింది. దీంతో జనరల్ బుక్స్ చదవడం మానేసి సబ్జెక్ట్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి.

ఉద్యోగాల సాధనకు పనికొచ్చే చదువు ముందుకొస్తున్నది. అందుకే, సాహిత్య, సామాజిక శాస్త్రాలను చదివే వారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ఇది నాణానికి ఓవైపు మాత్రమే. మరోవైపు పరికించి చూస్తే రాయడం, చదవడం, అచ్చువేయడం వైపు యువత ఎక్కువ దృష్టి సాధించడం శుభపరిణామం. కొందరు ఇండ్లనే గ్రంథాలయాలుగా మార్చుతున్నారు. గ్రామాల్లో వాటిని నిర్వహిస్తున్నారు. ఇది మంచి పరిణామం. రాబోయే కాలంలో సాంస్కృతిక రంగాల్లో ఒక పునర్జీవనం, కొత్త చైతన్యం రాబోతున్నది. యువతను అధ్యయనం, రాయడం వైపు మళ్లించే బాధ్యత సామాజిక సంఘాలపైనా, ప్రభుత్వాలపైనా ఉంది.

## ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- రెండోరోజు పేపర్-3కి 45.62 శాతం, పేపర్-4కు 45.57 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2 రాతపరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ పరీక్షలు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 4,13,671 (74.96 శాతం) మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. రెండోరోజు సోమవారం ఎకానమి, డెవలప్‌మెంట్ పేపర్-3కి 2,51,738 (45.62 శాతం) మంది, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం పేపర్-4కు 2,51,486 (45.57 శాతం) అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఆదివారం పేపర్-1కు 2,57,981 (46.75 శాతం) మంది, పేపర్-2కు 2,55,490 (46.30 శాతం) మంది పరీక్ష రాసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే.



## నిండు గర్భిణి పట్టుదల


- పురిటి నొప్పులతోనే గ్రూప్-2 పరీక్ష పూర్తి
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యోగం సాధించాలన్న తపనతో ఓ నిండు గర్భిణి గ్రూప్-2 పరీక్షకు హాజరైంది. ఆ సమయంలో పురిటి నొప్పులు రాగా, అధికారులు అప్రమత్తమయ్యారు. అంబులెన్స్, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి అత్యవసరమైతే అక్కడే ప్రసవం కోసం ఏర్పాట్లు చేశారు. సోమవారం గ్రూప్-2 మొదటి పేపర్ పూర్తవగా, రెండో పేపర్ కూడా రాస్తానంటూ గర్భిణి పట్టుబడట్టడంతో అధికారులు సహకరించారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద జరిగింది. బాల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి(25) నిండు గర్భవతి. వైద్యాధికారులు ఆమెకు డెలివరీ డేట్ సోమవారమే ఫిక్స్ చేశారు. కానీ ఆమె ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చాలా కష్టపడి చదివి గ్రూప్-2 పరీక్షల కోసం సన్నద్ధమైంది. మొదటి రోజు ఆదివారం పరీక్ష రాసింది. సోమవారం ఉదయం పరీక్ష రాస్తుండగా పురిటి నొప్పులు రావడంతో అది గమనించిన అధికారులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్తామంటే.. పరీక్ష రాస్తానంటూ పట్టుబట్టింది. దాంతో వారు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లడంతో తనకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో ప్రత్యేక అంబులెన్స్, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఆమెకు ధైర్యం చెప్పారు. పరీక్ష పూర్తయ్యాక అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

## సీపీఎస్‌టీఈఏ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి మధుబాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి సీపీఎస్‌టీఈఏటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పంతులు మధుబాబు బరిలో నిలుస్తున్నారు. సీపీఎస్‌టీఈఏటీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్న ఆకాంక్షను ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వినిపించేందుకే ఆయన పోటీ చేస్తున్నారని తెలిపారు. గత దశాబ్ద కాలంగా సీపీఎస్ రద్దు కోసం ఉద్యమ నిర్మాణం చేస్తున్నా ఇప్పటి వరకు ఆ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు అంశాన్ని శాసనమండలిలో బలంగా వినిపించేందుకే బరిలోకి దిగుతున్నామని వివరించారు. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న మధుబాబును గెలిపించాలని కోరారు.

# మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షలు మార్చి ఐదు నుంచి ప్రారంభమవుతాయి. ఈ పరీక్షలు అదేనెల 25 వరకు జరుగుతాయి. జనరల్‌తోపాటు ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తించనుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మార్చి ఐదు నుంచి 24 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి ఆరు నుంచి 25 వరకు జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం పరీక్షల షెడ్యూల్ (టైంటేబుల్)ను విడుదల చేశారు. మార్చి ఐదు నుంచి 25 వరకు జరిగే పరీక్షలను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

వచ్చేఏడాది ఫిబ్రవరి మూడు నుంచి 22 వరకు ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలుంటాయని వివరించారు. ప్రతి రోజూ రెండువిడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలుంటాయని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వారు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.

జనవరి 31న ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి ఒకటిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జనవరి 29న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతికత, మానవ విలువలు రాతపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 30న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్యావరణ విద్య పరీక్షను నిర్వహిస్తామని వివరించారు.

### ఇంటర్ వార్షిక పరీక్షల టైంటేబుల్
(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు)

| తేదీ | మొదటి సంవత్సరం | తేదీ | ద్వితీయ సంవత్సరం |
|---|---|---|---|
| 5.03.2025 (బుధవారం) | సెకండ్ లాంగ్వేజ్ పేపర్- | 16.03.2025 (గురువారం) | సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 |
| 7.03.2025 (శుక్రవారం) | ఇంగ్లీష్ పేపర్-1 | 10.03.2025 (సోమవారం) | ఇంగ్లీష్ పేపర్-2 |
| 11.03.2025 (మంగళవారం) | మ్యాథమెటిక్స్ పేపర్-1ఎ, బాటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1, | 12.03.2025 (బుధవారం) | మ్యాథమెటిక్స్ పేపర్-2ఎ, బాటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2, |
| 13.03.2025 (గురువారం) | మ్యాథమెటిక్స్ పేపర్-1బి జువాలజీ పేపర్-1 హిస్టరీ పేపర్-1 | 15.03.2025 (శనివారం) | మ్యాథమెటిక్స్ పేపర్-2బి జువాలజీ పేపర్-2 హిస్టరీ పేపర్-2 |
| 17.03.2025 (సోమవారం) | ఫిజిక్స్ పేపర్-1 ఎకనామిక్స్ పేపర్-1 | 18.03.2025 (మంగళవారం) | ఫిజిక్స్ పేపర్-2 ఎకనామిక్స్ పేపర్-2 |
| 19.03.2025 (బుధవారం) | కెమిస్ట్రీ పేపర్-1 కామర్స్ పేపర్-1 | 20.03.2025 (గురువారం) | కెమిస్ట్రీ పేపర్-2 కామర్స్ పేపర్-2 |
| 21.03.2025 (శుక్రవారం) | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1 బ్రిడ్జీ కోర్స్ మ్యాథ్స్ పేపర్-1 (బైపీసీ విద్యార్థులకు మాత్రమే) | 22.03.2025 (శనివారం) | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2 బ్రిడ్జీ కోర్స్ మ్యాథ్స్ పేపర్-2 (బైపీసీ విద్యార్థులకు మాత్రమే) |
| 24.03.2025 (సోమవారం) | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1 జాగ్రఫీ పేపర్-1 | 25.03.2025 (మంగళవారం) | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2 జాగ్రఫీ పేపర్-2 |

## యుద్ధప్రాతిపదికన గ్రామీణ రోడ్లు

- రూ.12 వేల కోట్లతో కొత్తరోడ్లకు ప్రతిపాదనలు
- సీఆర్ఆర్ కింద రూ.2311 కోట్లు మంజూరు : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన గ్రామీణ రోడ్ల నిర్మాణానికి పూనుకున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు వంశీకృష్ణ, బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. వంశీకృష్ణ మాట్లాడుతూ..తమ నియోజకవర్గంలో 39 చెంచుపెంటలుంటే 22 పెంటలకు అసలు రోడ్లే లేవని వాపోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణను కలిపేలా కృష్ణానదిపై మద్దిమడుగు వద్ద బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. పులుల అభయారణ్యం పేరిట శ్రీశైలంకు రాత్రి పూట వాహనాలు వెళ్లనీయటం లేదని చెప్పారు. ఈ నేపత్యంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పదిర నుంచి మద్దిమడుగు వరకు సింగిల్ రోడ్డు ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయనీ, దాన్ని డబుల్ రోడ్డుగా విస్తరించాలని విన్నవించారు. మండల కేంద్రాల్లో నాలుగు వరుసల రహదారులను వేయాలనీ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ..మానవ వికాసానికి, అభివృద్ధికి రోడ్లే కీలకమని చెప్పారు. కానీ, పదేండ్ల కాలంలో గత ప్రభుత్వం గ్రామీణ రోడ్లను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఊర్లకు రోడ్లు లేకపోతే ఎంత గోస, ఎంత వెనుకబాటు ఉంటుంది అనే దాన్ని తాను ప్రత్యక్షంగా అనుభవించానని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం నాలుగేండ్లలో రూ.12 వేల కోట్లతో రోడ్లను వేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ ఏడాది రూ.2311 కోట్లు మంజూరు చేశామనీ, పలు రోడ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ నడుస్తున్నదని వివరించారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రానికి రోడ్లు వేస్తామన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ రోడ్ల కోసం పదేండ్ల కాలంలో రూ.2200 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. అభయారణ్యాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతులు సాధించేందుకు ప్రత్యేక అధికారి నియమించి ముందుకెళ్తామన్నారు.

### పరిశ్రమలతో ముదిరెడ్డిపల్లి చెరువు, భూముల కాలుష్యంపై వ్యవసాయ శాఖ నివేదిక కోరుతాం : మంత్రి శ్రీధర్‌బాబు

పోలేపల్లి సెజ్‌లోని పలు పరిశ్రమలు విడుదల చేస్తున్న కలుషిత నీటితో ముదిరెడ్డి పల్లి చెరువు, భూముల కాలుష్యంపై వ్యవసాయ శాఖ, పీసీబీ నివేదికలను కోరుతామనీ, కాలుష్యం జరుగుతుందని తేలితే నివారణ చర్యలు తీసుకుంటామని మంత్రి శాసనసభా వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అసెంబ్లీలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ముదిరెడ్డి పల్లి చెరువులో నీటి కాలుష్యంపై సభ్యులు జె.అనిరుధ్‌రెడ్డి, రాష్ట్రంలో నూతన టీజీఐఐసీ పార్కుల ఏర్పాటుపై మరో సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అడిగిన ప్రశ్నలకు, అభ్యంతరాలకు మంత్రి సమాధానం ఇచ్చారు. పోలేపల్లి సెజ్‌లో అరబిందో ఫార్మా, ఏపీ పార్మాసూటికల్ కంపెనీల వ్యర్థ జలాలతో ముదిరెడ్డిపల్లి చెరువు, అక్కడ భూములు కాలుష్యం కావడం లేదని పీసీబీ రిపోర్టు ఇచ్చిందని తెలిపారు. దీనికి అనిరుధ్ రెడ్డి అభ్యంతరం తెలుపుతూ.. వ్యర్థజలాలు వదిలారని రైతులు ఫిర్యాదు చేసిన 15, 20 రోజులకు పీసీబీ వాళ్లు వచ్చి చూస్తే వాళ్లకు ఏం కనిపిస్తుందని ప్రశ్నించారు. దీనికి మంత్రి సమాధానం చెబుతూ..అవసరమైన లోతుగా మరోమారు వ్యవసాయ శాఖ, పీసీబీ నుంచి నివేదికలు తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తామనీ, కలుషితం కాకుండా చూస్తామని చెప్పారు.

### ఈసారి డిటెన్షన్ విధానాన్ని నిలిపివేస్తున్నాం : మంత్రి దామోదర రాజనర్సింహ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈసారి బీఈ విద్యార్థుల డిటెన్షన్ విధానాన్ని నిలిపివేస్తున్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహ్మ ప్రకటించారు. ఈ అంశంపై ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జేఎన్‌టీయూలో 25 శాతం క్రెడిట్లు, అదే ఓయూలో 50 శాతం క్రెడిట్లు లోపు వస్తే విద్యార్థులను డిటెన్షన్ చేస్తున్న తీరు సరిగాదన్నారు.

జేఎన్‌టీయూలో, ఓయూలో, అటానమస్ కాలేజీల్లో ఒకే సిలబస్ ఉన్నప్పుడు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఏంటని ప్రశ్నించారు. ఈ డిటెన్షన్ విధానం వల్ల ఓయూ వర్సిటీ పరిధిలో చదివే విద్యార్థులు నష్టపోతున్నారనీ, అదే సమయంలో అటానమస్ కాలేజీల్లో విద్యార్థులు ఫుల్ మార్కులతో పాసైపోతున్నారని చెప్పారు. ఇలా కాకుండా ఒకే సిలబస్ కాబట్టి ఒకే కామన్ పరీక్షాపత్రం, ఒకే పద్ధతిలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చూడాలనీ, విద్యార్థులకు నష్టం జరుగకుండా చూడాలని కోరారు.

### పలువురు మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం

ఇటీవలి కాలంలో మరణించిన పూర్వ మెట్‌పల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవి, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, దొమ్మాట మాజీ ఎమ్మెల్యే డి.రామచంద్రారెడ్డి మృతికి సోమవారం శాసనసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఆ ముగ్గురికి సంతాపం తెలుపుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతాప ప్రతిపాదనను సభ ముందు పెట్టారు. వారి మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేల రాజకీయ ప్రస్థానం, వారి వ్యక్తిగతం గురించి స్పీకర్ చదివి వినిపించారు. అనంతరం సభలో సభ్యులంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

### రెండు ప్రభుత్వ బిల్లుల ప్రతిపాదనలు

తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య, క్రీడ విశ్వవిద్యాలయం బిల్లును సోమవారం శాసనసభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. తెలంగాణ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లును వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ప్రతిపాదించారు. మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు.

## జూలపల్లికి వెంటనే రోడ్డు వేయలి

### లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం

- గ్రామస్తుల పాదయాత్ర
- తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ- మహ్మదాబాద్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, జూలపల్లికి వెంటనే రోడ్డు వేయాలని, లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. సీపీఐ(ఎం), గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం జూలపల్లి గ్రామం నుంచి నంచర్ల గేట్ వరకు ప్రజాపాదయాత్ర నిర్వహించారు. ప్రజాపాదయాత్రకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రాములు మద్దతు తెలిపి పాల్గొన్నారు. జూలపల్లి గ్రామానికి బీటీ రోడ్డు 15 సంవత్సరాల కిందట వేశారని, అది గుంతలమయంగా మారిందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నంచర్ల నుంచి జూలపల్లి మీదుగా కిష్టంపల్లి, గొండ్యల, వేపూర్ గ్రామాలకు వెళ్లడానికి ఇదే రోడ్డని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీ రోడ్డు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, కానీ సంవత్సరమవుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డు వేయాలని, లేదంటే ఎమ్మెల్యే ఇంటిని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుండుమల్ల నర్సింలు, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, గ్రంథాలయం మాజీ చైర్మెన్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, బాల్ రెడ్డి, బోయిని రాజు, జూలపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

## జై శ్రీరామ్ నినాదం నేరమెలా అవుతుంది ?

న్యూఢిల్లీ : జై శ్రీరామ్ అన్న నినాదం క్రిమినల్ నేరమెలా అవుతుందని సుప్రీం కోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల జై శ్రీరామ్ అని నినాదాలు చేశారని ఆరోపిస్తూ ఇద్దరు వ్యక్తులపై వేసిన కేసును కర్నాటక హైకోర్టు కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'వారు ఒక మతానికి సంబంధించిన పదాలను లేదా పేర్లను గట్టిగా అరిచారు. అది నేరమెలా అవుతుంది?' అని జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ ప్రశ్నించింది. ఫిర్యాదీదారుడు హైదర్ అలీ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారణ జరిపింది. ఈ నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తు పట్టారని ఫిర్యాదీదారుని కోర్టు ప్రశ్నించింది. వారందరూ సిసిటివి నిఘాలో వున్నారని మీరు చెబుతున్నారు. లోపలకు వచ్చిన ఆ వ్యక్తులను ఎవరు గుర్తు పట్టారని ప్రశ్నించింది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ సెప్టెంబరు 13న హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. వాటిని సవాలు చేస్తూ హైదర్ అలీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తి కాకుండానే హైకోర్టు కేసు కొట్టివేసిందని అలీ తరపున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ తెలిపారు. ఫిర్యాదును ప్రస్తావిస్తూ కామత్, ఎఫ్ఐఆర్ అనేది నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని వ్యాఖ్యానించారు. మసీదులోకి ప్రవేశించిన వ్యక్తులను ఎలా గుర్తు పట్టారని బెంచ్ ప్రశ్నించగా రాష్ట్ర పోలీసులు దాన్ని వివరిస్తారని కామత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పిటిషన్ కాపీని అందచేయాలని బెంచ్ పిటిషనర్‌ను కోరింది. జనవరికి ఈ విషయాన్ని వాయిదా వేసింది. ఎవరైనా జై శ్రీరామ్ అని కేకలు వేస్తే అది ఏ వర్గానికి చెందినవారి మత భావాలనైనా ఎలా ప్రేరేపిస్తుందో అర్థం కావడం లేదని హైకోర్టు తన ఉత్తర్వుల్లో వ్యాఖ్యలు చేసింది. ఈ సంఘటన వల్ల ప్రజల్లో అపోహలు గానీ, ఘర్షణలు గానీ తలెత్తలేదని పేర్కొంది. ఫిర్యాదు చేసిన వ్యక్తికి కూడా ఆ కేకలు వేసింది ఎవరో తెలియలేదని పేర్కొంది.

# హిమాలయాల్లో అడుగంటుతోన్న నీరు

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలే ప్రధాన కారణం



**న్యూఢిల్లీ :** హిమాలయాల్లోని సుమారు 45 శాతం నీటి బుగ్గలు పూర్తిగా అడుగంటిపోయాయి. గత నాలుగు దశాబ్దాల కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షపాతం, మంచు తగ్గడం దీనికి కారణమని ఇటీవల జరిపిన ఓ అధ్యయనం తేల్చింది. నీటి ప్రవాహం తగ్గిపోతుండడంతో గ్రామీణ ప్రాంతాల తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఏర్పడుతోంది. వ్యవసాయం, రోజువారీ కుటుంబ అవసరాలు కూడా తీరడం లేదు. పశ్చిమ హిమాలయాలలో...ప్రధానంగా హిమాచల్ ప్రదేశ్‌లోని 276 నీటి ప్రాంతాలను అధ్యయనం సర్వే చేసింది. బుగ్గల నుండి విడుదలయ్యే నీటి ప్రవాహంలో మూడో వంతు ఆగిపోయిందని సర్వేలో గమనించారు. బుగ్గలు 45 శాతం వరకూ పూర్తిగా అడుగంటి పోగా 26 శాతం వనరుల నుండి కొంత నీరు వస్తోంది. అవి కూడా రుతుపవనాలపై ఆధారపడుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా, లాహాల్-స్పితి, కుల్లు, కిన్నౌర్ జిల్లాలపై అధ్యయనం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ నివేదిక టేలర్ అండ్ ఫ్రాన్సిస్ జర్నల్‌లో ప్రచురితమైంది.

# సంరక్షణ కేంద్రాల్లో 60 వేలమంది అనాథ పిల్లలు



**న్యూఢిల్లీ :** దేశంలో 60 వేల మంది చిన్నారులు సంరక్షణ కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. వీరిలో అత్యధికంగా 10 వేల మందికి తమిళనాడులోని కేంద్రాలు ఆశ్రయం కల్పిస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకం కింద సంస్థాగత కేర్ హోమ్స్‌లో ఉంటున్న పిల్లల సంఖ్య ఈ ఏడాది తగ్గినప్పటికీ దేశవ్యాప్తంగా చైల్డ్‌కేర్ సంస్థల నెట్‌వర్క్ మరింత విస్తరించింది. తమిళ నాడు వరుసగా మూడో ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అనాథ పిల్లలకు కేర్ హోమ్స్‌లో ఆశ్రయం కల్పించిందని మహిళ, శిశుసంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లోక్‌సభకు తెలియజేశారు.

గత సంవ త్సరం తమిళనాడు సంరక్షణ కేంద్రాల్లో 10,118 మంది అనాథ పిల్లలు ఆశ్రయం పొందారని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో 2021-22లో 13,877 మంది పిల్లలు కేర్ హోమ్స్‌లో తలదాచుకోగా 2022-23లో ఆ సంఖ్య 7,785కు తగ్గింది. గత సంవత్సరం తెలంగాణ కేర్ హోమ్స్‌లో 2,243 మంది, ఆంధ్రప్రదేశ్ కేర్ హోమ్స్‌లో 1,546 మంది అనాథ పిల్లలు ఉన్నారని మంత్రి తెలిపారు.

# ఆ పట్టభద్రులకు ఉద్యోగాలేవి?

- ఆవిరవుతున్న ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థుల ఆశలు
- డిమాండ్ లేక సీట్లు తగ్గించుకుంటున్న కాలేజీలు



**న్యూఢిల్లీ :** ఉద్యోగాల్లో చేరుతున్న విద్యావంతులైన యువతకు నాణ్యమైన, వారి స్థాయికి తగిన ఉద్యోగాలు లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అత్యంత ఖరీదైన, పేరొందిన విద్యా సంస్థల్లో చదువు ముగించుకొని బయటికి వచ్చిన ఇంజినీర్లు, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు సైతం నాణ్యమైన పని దొరకడం కష్టంగా మారింది. మంచి ర్యాంక్ ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో లక్ష సీట్లు, మేనేజ్‌మెంట్ స్కూల్స్‌లో పది వేల సీట్లు ఉన్నాయి. ఈ సంస్థల్లో చదివిన వారే కాదు... ఇతర కోర్సులు చదివిన వారికి కూడా జీతాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే రీతిలో ఉంటున్నాయి. చాలా కాలంగా వీరి జీతాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నియామకాలు సరిగా జరగకపోవడంతో అనేక కళాశాలలు వివిధ కోర్సులకు (యూజీ, పీజీ, డిప్లొమా) సంబంధించి సీట్ల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఇంజినీరింగ్ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతించిన సీట్ల సంఖ్య 2014-15లో 31.83 లక్షలు ఉండగా అది 2022-23లో 23.69 లక్షలకు తగ్గింది. అయితే ఇటీవల కొన్ని కళాశాలలు తమ సామర్థ్యాన్ని (ఇన్‌టేక్) పెంచుకోవడం ప్రారంభించాయి. అయితే అది కూడా స్వల్పంగానే ఉంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల కాలేజీల్లో మాత్రం సీట్లు బాగానే పెరిగాయి. ఇక మేనేజ్‌మెంట్ స్కూల్స్ విషయానికి వస్తే వాటిలో కూడా సీట్లు తగ్గిపోయాయి. 2014-15లో ఆ కాలేజీల్లో 4.56 లక్షల సీట్లు ఉంటే 2022-23లో 4.21 లక్షలు మాత్రమే ఉన్నాయి. సగటు ప్రవేశ స్థాయిలు కూడా వాటి గరిష్ట స్థాయితో పోలిస్తే బాగా తక్కువగానే ఉన్నాయి. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ ఉద్యోగాలు చేస్తున్న వారి జీతాలు పెరగడం మాట అటుంచి తగ్గుతుండడం గమనార్హం. అందరూ అనుకుంటున్నట్లు అవి స్థిరంగా కూడా లేవు. ఎన్నో ఆశలతో అమెరికాను వీడి స్వదేశానికి ఉపాధి కోసం వచ్చిన వారు ఇక్కడి పరిస్థితులను గమనించి హతాశులవుతున్నారు. కొందరు అమెరికా ప్రాజెక్టులు చేసుకుంటూ డబ్బు సంపాదిస్తుంటే మరికొందరు తిరిగి అగ్రరాజ్యం బాట పడుతున్నారు. ఉత్పాదక రంగంలో వృద్ధి లేకపోవడం ఈ పరిస్థితికి కారణమని చెప్పవచ్చు. ఈ రంగం కంటే సేవల రంగం బాగా విస్తరిస్తోంది. సేవల రంగానికి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెద్దగా అవసరం లేదు. తగిన డిమాండ్ లేకపోవడంతో ఉత్పత్తి రంగం పుంజుకోవడం లేదు. చైనా తదితర దేశాల నుండి దిగుమతుల పైనే అది ఆధారపడుతోంది. ఐటీ, కన్సల్టింగ్ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం పెరగడంతో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ పట్టభద్రులకు డిమాండ్ మరింత తగ్గవచ్చు.

## వచ్చే ఏడాది చివరిలో లేదా ...

### బంగ్లాదేశ్ ఎన్నికలపై తాత్కాలిక నేత యూనస్ కీలక ప్రకటన

**ఢాకా :** బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ సోమవారం కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివరలో గాని, 2026 ప్రారంభంలో గాని సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పారు. జాతినుద్దేశించి సోమవారం ఆయన టెలివిజన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 చివరినాటికి లేదా 2026 ప్రథమార్థంలో ఎన్నికల తేదీలను నిర్ణయించవచ్చన్నారు. అయితే ఈ ఎన్నికల్లోగా పలు ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సి వుందని అన్నారు.

# ఖాళీగా పీఎంఏవై ఇండ్లు

## మౌలిక సదుపాయాల లేమితో లబ్దిదారుల అయిష్టత

- 46 శాతం గృహాలది ఇదే పరిస్థితి
- మొత్తం 17.5 లక్షల ఇండ్లు మంజూరు
- పూర్తయినవి 9.69 లక్షలు.. ఇందులో ఖాళీగా ఉన్నవి 4.59 లక్షలు
- కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి

**దేశంలోని పేదలకు ఇండ్లు అందించటంలో మోడీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద పట్టణ పేదలకు 2022 వరకు ఇండ్లు అందిస్తానన్న కేంద్రం.. ఆ లక్ష్యాన్ని సాధించలేక చతికలపడిపోయింది. ఇప్పుడు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్మించిన ఇండ్లలోనూ దాదాపు సగం వరకు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. మౌలికసదుపాయాల లేమి, లబ్దిదారులు ఉండటానికి ఇష్టపడకపోవటం, కేటాయింపులు జరగకపోవటం వంటి కారణాలతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి. సదరు మంత్రిత్వ శాఖ ఈ సమాచారాన్ని వెల్లడించింది.**

మూడు ప్రధాన కారణాలతో ఖాళీగా ఇండ్లు



**న్యూఢిల్లీ :** పట్టణ పేదల కోసం నిర్మించిన 9.69 లక్షల ఇండ్లలో దాదాపు 46 శాతం ఖాళీగానే ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీకి తెలిపింది. అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాలు, గృహాలను కేటాయించకపోవటం, కేటాయించబడినవారు వాటిని ఇష్టపడకపోవటం వంటి ప్రధాన కారణాలతో పూర్తి చేసిన ఈ ఇండ్లు ఖాళీగా ఉన్నాయని కేంద్రం వివరించింది. పూర్తి చేసిన ఇండ్లు ఖాళీగా ఉంటే మిషన్ లక్ష్యం దెబ్బ తింటుందని టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ తెలిపింది.

**'పథకం పేలవ పని తీరుకు నిదర్శనం'**

2022 నాటికి దేశంలోని పట్టణ ప్రాంతాల్లో గూడు లేని పేదలందరికీ ఇండ్లను అందించాలనే లక్ష్యంతో 2015లో ఈ హౌసింగ్ స్కీమ్‌ను మోడీ సర్కారు ప్రారంభించింది. 1.22 కోట్ల ఇండ్లను పూర్తి చేసేందుకు వీలుగా ఈ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించారు.

వాస్తవానికి 2022 నాటికి అందరికీ ఇండ్లను కల్పిస్తామన్న మోడీ ఆ లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయింది. ఇప్పుడు, ఈ పథకం కింద నిర్మించిన 46 శాతం ఇండ్లలో లబ్దిదారలెవరూ లేకపోవటానికి కేంద్రం చెప్పిన కారణాలూ పథకం పేలవ పని తీరుకు అద్దం పడుతున్నదని విశ్లేషకులు అంటున్నారు. మౌలిక సదుపాయాలు లేని ఈ ఇండ్లలో లబ్దిదారులూ ఉండటాకి ఇష్టపడటం లేదనీ, కేంద్రం సమాధానమే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు.

**పూర్తి చేయాల్సిన ఇండ్లు 44 శాతం**

2015 నుంచి దేశవ్యాప్తంగా మొత్తం 1.18 కోట్ల ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన 17.5 లక్షల ఇండ్లు కూడా ఉన్నాయి. ఇందులో 9.69 లక్షల ఇండ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. ఇందులోనూ 4.59 లక్షల ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. ఈ మంత్రిత్వ శాఖ 55.37 శాతం ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. ఇంకా 44.68 శాతం ఇండ్లను నిర్మించాల్సి ఉన్నది. నిర్మాణం, భూమి ఖర్చులు పెరుగుతున్నందున ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అందించే ఆర్థిక సహాయం పెంపును పరిగణలోకి తీసుకోవాలని స్టాండింగ్ కమిటీ కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖకు తెలిపింది.

# సీపీఐ(ఎం) నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

## జిల్లా కార్యదర్శిగా వర్ధం పర్వతాలు

**నవతెలంగాణ - అచ్చంపేట**



సీపీఐ(ఎం) నాగర్ కర్నూల్ జిల్లా మూడో మహాసభలో జిల్లా నూతన కమిటీ 22 మంది ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా మూడోసారి వర్ధం పర్వతాలు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లుగా ఆర్.శ్రీనివాసులు, ఎల్.దేశ్యా నాయక్, గీత, బి.ఆంజనేయులు, అంజనే యులు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మల్లేష్, ఎం.శంకర్ నాయక్, ఏ.నిర్మల, సి.నాగరాజు, బాలస్వామి, లక్ష్మణ్, అశోక్, పొదిలి రామయ్య, దశరథం, నరసింహ, శివవర్మ, ఈశ్వర్, తారాసింగ్, పరశురాములు, ఏపి.మల్లయ్య, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

# సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

## కార్యదర్శిగా గాదె ప్రభాకర్‌రెడ్డి



**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శిగా గాదె ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా రెండో మహాసభల్లో 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా నూతన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డితోపాటు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, గుమ్మడిరాజుల రాములు, దొగ్గెల తిరుపతి, ఎల్.దీప, కాడబోయిన లింగయ్య, ధరావత్ భానూనాయక్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రభాకర్‌రెడ్డి.. 1985లో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 1987 నుంచి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యునిగా, కార్యదర్శివర్గ సభ్యునిగా, 1998లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులుగా వివిధ స్థాయిల్లో పనిచేశారు. వరంగల్ నగరంలో ఏసీరెడ్డినగర్, సుందరయ్య నగర్, సమ్మయ్యనగర్, బీరన్నకుంట తదితర ప్రాంతాల్లో పేద ప్రజల ఇండ్ల స్థలాల పోరాటంలో కీలకపాత్ర పోషించారు. దాంతోపాటు ప్రజాసమస్యలు, కార్మిక సమస్యల మీద నిరంతరం ఆందోళన పోరాటాలు చేశారు.

# కార్మికోద్యమ నేత నండూరి ప్రసాదరావు సతీమణి కామ్రేడ్ సుమిత్ర మృతి

## సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకుల సంతాపం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



కార్మికోద్యమ నిర్మాత కామ్రేడ్ నండూరి ప్రసాదరావు సతీమణి సుమిత్ర (92) సోమవారం ఉదయం వనస్థలిపురంలో మరణించారు. ఆమె మరణం పట్ల సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. సుమిత్ర మరణం బాధాకరమని అన్నారు. సుమిత్ర భౌతికకాయాన్ని సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు, ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

వనస్థలిపురం శ్మశానవాటికలో మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి. 6 నెలలుగా సుమిత్ర అనారోగ్యంతో బాధపడుతున్నారనీ, కరోనా కాలంలో కరోనా సోకినప్పటి నుంచి అస్వస్థతగానే ఉంటున్నారు. సుమిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారు. పోరాటం విరమణ తర్వాత ఆమె చదువుకుని హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. సుమిత్ర భర్త ప్రసాదరావు 2001లో మరణించగా, ఆమె అప్పటి నుంచి సీఐటీయూను ఎప్పుడూ విస్మరించలేదు. ఆమెకు ఓపిక ఉన్న అన్ని సందర్భాల్లోనూ సీఐటీయూ సభలు, సమావేశాల్లో పాల్గొనేవారు.

## సీపీఐ(ఎం) నివాళి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సీపీఐ(ఎం) ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యులు, కార్మిక నాయకులు నండూరి ప్రసాదరావు సతీమణి సుమిత్ర మరణం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఆమె మృతి బాధాకరమనీ, కుటుంబ సభ్యులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆమె మరణవార్త తెలియగానే హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న వారి నివాసానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందారని వివరించారు. సుదీర్ఘకాలంగా పార్టీ, ప్రజాతంత్ర ఉద్యమాలతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. వారి వంతు ఆర్థిక సహాయం అందించారని గుర్తు చేశారు. వారి ఇంటికి వచ్చే అనేక మంది కార్యకర్తలను ఆదరించే వారని పేర్కొన్నారు.

## నవతెలంగాణ ఎడిటర్ సంతాపం

తనకు వ్యక్తిగతంగా బాగా పరిచయమున్న సుమిత్రమ్మ మరణించడం బాధాకరమంటూ నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ సంతాపం తెలిపారు. సుమిత్రమ్మ తనకొచ్చే పెన్షన్‌లో నుంచి ప్రతిఏటా సీఐటీయూ రాష్ట్ర కమిటీకి రూ5,000 చొప్పున విరాళం ఇచ్చేవారని, నండూరి ప్రసాద్‌రావు వర్ధంతి సభకు ఎన్ని అనారోగ్య సమస్యలున్నా హాజరయ్యే వారన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

## రెండు స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ | అభ్యర్థుల ఎంపిక

**న్యూఢిల్లీ :** రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలు (కరావాల్ నగర్, బాదర్‌పూర్) నుంచి సీపీఐ(ఎం) పోటీ చేయనుంది. ఈ మేరకు ఢిల్లీ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను కూడా ఎంపిక చేసింది. కరావాల్ నగర్ నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది, గుర్తింపు పొందిన సామాజిక కార్యకర్త అశోక్ అగర్వాల్ పోటీ చేయనున్నారు. అశోక్ అగర్వాల్ తాను వేసిన వివిధ పిటిషన్ల ద్వారా ప్రభుత్వ పాఠశాల ప్రవేశాల్లో అవకతవకలు, కనీస సౌకర్యాల లేమిని నివారించగలిగారు. అలాగే అశోక్ అగర్వాల్ పిటీషన్ల కారణంగానే ప్రయివేట్ పాఠశాలల్లో 20 శాతం సీట్లు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు లభించాయి. అలాగే గుర్తించిన 47 ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఈడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం ఇన్‌పేషంట్లను, 25 శాతం అవుట్ పేషంట్లకు చికిత్స అందిస్తున్నారు.కాగా, బాదర్‌పూర్ నుంచి జగదీష్ చాంద్ శర్మను సీపీఐ(ఎం) పోటీకి నిలిపింది. మీఠాపూర్‌కు చెందిన జగదీష్ ఈ ప్రాంతంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాల్లోనూ ముందుండేవారు. ఈ ప్రాంతంలో ఒక ప్రధాన భాగాన్ని 'ఓ' జోన్‌లో ఉంచడానికి ఢిల్లీ డెవలెప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి నిర్ణయంతో నిర్మాణ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, మొత్తంగా ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అక్రమంగా ఏర్పాటు చేసిన జీన్స్ డైయింగ్ యూనిట్లు, ల్యాండ్ మాఫియాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటలకు నాయకత్వం వహించారు. అలాగే, ప్రజానుకూల, వామపక్ష ప్రత్యామ్నాయ విధానాల ఆధారంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం)ప్రచారం నిర్వహించనుంది. ఢిల్లీలో పదేళ్లకు పైగా సాగుతున్న ఆప్ ప్రభుత్వ పనితీరును శ్రామిక ప్రజానీకం పరిశీలించాల్సిన సమయమని, మరోవైపు ఎన్నికల్లో లబ్ది కోసం ఆర్ఎస్ఎస్-బీజేపీ అనుసరించే మతరాజకీయాలను ఎదుర్కొనే సమయమని పార్టీ పేర్కొంది. 19న ప్రెస్‌క్లబ్‌లో జరిగే విలేకరుల సమావేశంలో ఢిల్లీ ఎన్నికలకు సంబంధించిన వామపక్ష పార్టీల మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని పార్టీ ఆహ్వానించింది.

# నెలాఖరులో బీజింగ్‌లో అజిత్ దోవల్ పర్యటన

## సరిహద్దు అంశంపై చర్చలు



**న్యూఢిల్లీ :** మరో రెండు వారాల్లో జాతీయభద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో పర్యటించే అవకాశం వుంది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత విస్తృత సరిహద్దు అంశంపై జరిగే 23వ ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) చర్చలకు హాజరయ్యే భారత బృందానికి నాయకత్వం వహించనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2019 డిసెంబరులో చివరిసారిగా ఈ చర్చలు న్యూఢిల్లీలో జరిగాయి. తూర్పు లడఖ్ సరిహద్దు వివాదాన్ని దృష్టిలో వుంచుకుని ఐదేళ్లపాటు ఈ చర్చలు జరగలేదు. అక్టోబరు 23న కజన్‌లో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిపిన సమావేశంలో తిరిగి ఈ చర్చల యంత్రాంగాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఎస్ఆర్ చర్చలు జరగనున్నాయి. డిసెంబరు చివరిలో లేదా జనవరి ప్రారంభంలో ఈ చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు.

చర్చల వేదిక ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు. అక్టోబరు 21న డెమ్‌చాక్, డెప్సాంగ్‌లపై ఇరు పక్షాల మధ్య ఒక అంగీకారం కుదిరిన నేపథ్యంలో అక్టోబరు 23న ఇరు దేశాల నేతలు సమావేశమై చర్చల యంత్రాంగాలను పునరుద్ధరించే నిర్ణయం తీసుకున్నారు.

# జార్జియా రెస్టారెంట్‌లో 12 మంది భారతీయులు మృతి



**గుడౌరి :** జార్జియాలోని గుడౌరిలో ఒక రెస్టారెంట్‌లో 12 మంది భారతీయుల మృతదేహాలను కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేదా హింస జరిగిన ఆనవాళ్లు గుర్తించలేదని తెలిపింది. వీరంతా కార్బన్ మోనాక్సైడ్ పీల్చిన కారణంగా మృతి చెందినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపింది. రెస్టారెంట్‌లోని రెండో అంతస్తులో ఉన్న బెడ్‌రూమ్‌ల్లో మృతదేహాలు ఉన్నాయని వెల్లడించింది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తరువాత బెడ్‌రూమ్‌లకు సమీపంలో ఉన్న పవర్ జెనరేటర్‌ను ఆన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్టు తెలిపింది. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపింది. కాగా, మృతి చెందిన 12 మంది భారతీయులేనని భారత రాయబార కార్యాలయం చెబుతుండగా, జార్జియా ప్రభుత్వం మాత్రం 11 మంది భారతీయులు, మరొకరు తమ దేశస్థుడని తెలిపింది.

# విషమించిన దల్లేవాల్ ఆరోగ్యం

- ఆస్పత్రిలో చేరాలంటున్న వైద్యులు
- నిరాకరిస్తున్న రైతు నాయకుడు



**చండీగఢ్ :** డిమాండ్ల సాధన కోసం 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం మరింతగా క్షీణించింది. తక్షణమే ఆస్పత్రిలో చేరాలని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దల్లేవాల్ మాత్రం ఎలాంటి వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ), రైతు రుణాల మాఫీ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ వంటి 13 డిమాండ్లతో నవంబర్ 26 నుంచి పంజాబ్-హర్యానా సరిహద్దు ఖనౌరీ వద్ద 70 ఏండ్లు, క్యాన్సర్‌తో బాధపడుతున్న దల్లేవాల్ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం నాటికి ఈ దీక్ష 21వ రోజుకు చేరుకుంది. దల్లేవాల్‌ను పరీక్షించిన డాక్టర్ అవతార్ సింగ్ మాట్లాడుతూ 'ప్రస్తుత పరీక్షల ప్రకారం దల్లేవాల్ క్రియేటినిన్ స్థాయి పెరుగుతోంది. అలాగే గ్లోమెరులర్ ఫిల్ట్రేషన్ రేట్ (జీఎఫ్ఆర్) దిగజారింది. ఒక పక్క కీటోన్లు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితి చాలా తీవ్రమైనది' అని చెప్పారు. దల్లేవాల్ ఎటువంటి ఆహారం తీసుకోవడం లేదని, కేవలం నీళ్లు మాత్రమే తాగుతున్నారని డాక్టర్ తెలిపారు. దల్లేవాల్ చాలా బలహీనంగా ఉన్నారని, తనంతట తానుగా నిలబడలేకపోతున్నారని, బిపి కూడా చాలా తక్కువగా ఉందని చెప్పారు.అయితే దల్లేవాల్ మాత్రం వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారని, ఆయనతో చాలాకాలం నుంచి అనుబంధం ఉన్న మరో రైతు నాయకులు అభిమన్యు కోహార్ తెలిపారు. ప్రభుత్వాల తప్పుడు విధానాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏడు లక్షల మంది రైతుల జీవితాల కంటే తన ప్రాణం ముఖ్యం కాదని దల్లేవాల్ చెప్పినట్టు అభిమన్యు కోహార్ తెలిపారు. రైతుల డిమాండ్లను ఆమోదిస్తేనే నిరాహార దీక్ష విరమిస్తానని, లేకపోతే ప్రాణత్యాగానికైనా దల్లేవాల్ మానసికంగా సిద్ధంగా ఉన్నారని కోహార్ తెలిపారు.

సంపాదకీయం

# 'ఆశ'లెప్పుడు తీరేను!

'ది ఎయిటీన్త్ బ్రూమేర్ లూయిస్ బోనపార్టే' అనే తన గ్రంథం ప్రారంభ వాక్యాలే హెగెల్‌పై వ్యంగ్య బాణాలు సంధిస్తాడు కారల్ మార్క్స్. చరిత్రలో బ్రహ్మాండమైన నిజాలు, వ్యక్తులు రెండుసార్లు పునరావృతమైతా యంటాడు హెగెల్ ఒకానొకచోట. కాని ఆయన రెండు విషయాలు చెప్పటం మరిచిపోయాడంటాడు మార్క్స్. మొదటిసారి ట్రాజెడీగానూ, రెండవసారి ఫార్స్ (ప్రహసనం)గానూ పునరావృతమైతా యంటాడు ఆయన. రాష్ట్రంలో బీఆర్ఎస్ తీరు చూసి, మరీ ముఖ్యంగా ఆశా వర్కర్ల విషయంలో.. కాదు.. కాదు.. "ఆడబిడ్డల" విషయంలో, రైతులు, వారికేసిన సంకెళ్ల విషయంలోనూ బీఆర్ఎస్ వారి మొసలి కన్నీరు చూసి సముద్రాలు చిన్నబుచ్చుకుంటున్నాయి.

కల్వకుంట్ల కుటుంబానికి దృగ్గోచరమయ్యే విషయాలన్నీ ఉల్టాగానే ఉన్నట్టున్నాయి. తమ ఏలుబడిలో ఆశాలు (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్స్) 106 రోజుల సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణిచివేసింది కేసీఆర్ అహంకారం. చివరికి వాళ్ళే ఒకడుగు వెనక్కి తగ్గారు. సింగరేణిని బంద్ పెట్టింది నాటి రాష్ట్ర సాధనోద్యమం. ఆర్టీసీ 'ప్రగతి' చక్రాలు నిలిచి పోయాయి. సకల జనుల సమ్మె రాష్ట్ర సాధనను నిజం చేసింది. ఇది వ్యక్తుల కాపాదిస్తే కుదరదు. ఆ తర్వాత కేసీఆర్ అహంకారం రాష్ట్రంలో శ్మశాన శాంతి నెలకొల్పే ప్రయత్నం చేసింది.



2013లో జరగాల్సిన వేతన ఒప్పందం కోసం 2015లో సమ్మె కట్టిన పాపానికి అంతవరకు చంకనెత్తుకున్న సంఘంతో సహా ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలనూ ఈడ్చి నేలకేసి కొట్టడమేగాక ఆర్టీసీలో యూనియన్లనే నిషేధించాడాయన. సింగరేణిలో ప్రధాన యూనియన్లను నియంత్రించగలగడం, కాంట్రాక్టు కార్మికులు హక్కులడగకుండా అణిచివేయడంతో కణకణమండే బొగ్గు బావులపై కుండపోతవాన కురిపించాడు. దీనికితోడు ఎర్రజెండాలు పట్టుకుంటే కేసీఆర్ కానడనే మానసిక యుద్ధం నడిపారు సర్పంచ్ మొదలు మంత్రుల స్థాయి వరకు. కింద అసంతృప్తి రాజుకుంది. కార్మికులు నష్టపోతూనే ఉన్నారు. ఏదో ఒక మేర ఇతర వర్గాల ప్రజలూ, ముఖ్యంగా కష్టజీవులు నష్టపోయారు.

ఫలితమే 2023 డిసెంబరు 7న కనబడింది. జనం ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో కాంగ్రెస్ పాలనను తెచ్చుకున్నారు. ప్రజల్ని ఏమార్చడంలో ధక్కామక్కీలు తినున్న ఈ పాలకులు ప్రజలు అప్రమత్తంగా లేకుంటే మతోన్మాద శక్తులు పెరగడానికి సాగుభూమిగా ఉన్న తెలంగాణలో పాగా వేసే ప్రమాదం లేకపోలేదు. యాసంగి దాటిపోతున్నా రుణమాఫీ ఒక కొలిక్కి రాలేదు. పంచపాండవులంటే నాకు తెలీదా అని నాలుగు వేళ్లు చూపి.. చివరికి గుండు సున్నా చుట్టాడట వెనకటికెవరో! 'రైతు భరోసా' బీఆర్ఎస్ కంటే ఎక్కువిస్తామంటే రైతులు ఆశపడ్డారు. బీఆర్ఎస్ కాలంలో అమెరికాలో ఉండే వారికి కూడా అకౌంట్లలో జమ అయ్యింది అన్యాయంగా. వాస్తవ సాగుదారులకే ఇస్తామనడం కూడా న్యాయమేకాని, ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ అసలు ప్రారంభం చేసేదెపుడని రైతాంగం ప్రశ్నిస్తూంది. అవసరమైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లన్నారు, ఇళ్ల స్థలాలన్నారు. నిర్దిష్టంగా ఎన్నిచోట్ల ఎంత మందికిచ్చారో చెప్పగలరా? కేసులన్నీ రద్దుచేస్తున్నామన్నారు. ఇంకా రెండున్నర వేలమందిపై కేసులు అలాగే ఉన్నాయి. ఉపాధి హామీ పనిదినాలు కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తూంటే దానిపై తలుపు చెక్కలెత్తాల్సిందిపోయి తమలపాకులతో, సరసపుమాటలతో కితకితలు పెడితే పనులు కావని 2018 వరకు కేసీఆర్ సర్కారే ఉదాహరణనున్నా పట్టించుకోదలుచుకోలేదో ఏమో!

కోటి మంది కార్మికుల వేతనాల పునరుద్ధరణ 2012 నుండి జరగలేదు. కంచెలను ధ్వంసం చేశామనే వారికి ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలనే సోయి లేదనుకోవాలా? లేదా కటకటాల్లో నుండి వాటిని బయటికి ఎందుకు వదలాలనుకుంటున్నారా?

2015 నుండే మోడీ త్రైపాక్షిక ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌కు చెల్లు చీటీ ఇచ్చేసింది. కార్మికులతో, వారి సంఘాలతో చర్చలే లేవు. చూశాము కదా ఢిల్లీ చుట్టూ అంత పెద్ద ఉద్యమం జరిగితే, వెనక్కి తగ్గినట్టే తగ్గి దొడ్డిదోవన ముందుకుపోయే ప్రయత్నం చేస్తోంది మోడీ ప్రభుత్వం. వీటన్నింటిని గమనించి, పోరాటాలను చూసయినా ఏలిన వారు తీరు మార్చుకోవాలి. చచ్చేంత చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం, కార్మికులుగా గుర్తింపు మొదలైన సమస్యలేవీ పరిష్కరించడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు జరుపుతున్న బస్సు జాతాకు ప్రభుత్వం స్పందించాలి. లేదంటే, నిరసనలు, ఆందోళనలు అవిశ్వాసాలై వెల్లువెత్తుతాయి. డిసెంబరు 15న ప్రారంభమైన ఈ బస్సు యాత్ర ఆశాలనే కాక నిరాశలో మగ్గుతున్న "కూడు లేని, గూడు లేని" జనాన్ని ప్రోది చేస్తుందని, చేయాలని ఆశిద్దాం.

> **అవసరమైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లన్నారు, ఇళ్ల స్థలాలన్నారు. నిర్దిష్టంగా ఎన్నిచోట్ల ఎంత మందికిచ్చారో చెప్పగలరా? కేసులన్నీ రద్దుచేస్తున్నామన్నారు. ఇంకా రెండున్నర వేలమందిపై కేసులు అలాగే ఉన్నాయి. ఉపాధి హామీ పనిదినాలు కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తూంటే దానిపై తలుపు చెక్కలెత్తాల్సిందిపోయి తమలపాకులతో, సరసపుమాటలతో కితకితలు పెడితే పనులు కావని 2018 వరకు కేసీఆర్ సర్కారే ఉదాహరణనున్నా పట్టించుకోదలుచుకోలేదో ఏమో!**

## సంగీత రసధునులు ఆ చేతులు!

ప్రపంచానికి భారతీయ శాస్త్రీయ తబలా సంగీతాన్ని పరిచయం చేసిన ఘనుడు ఉస్తాద్ జాకీర్ హుసేన్. ఆయన ప్రఖ్యాత హిందూస్థానీ తబలా విద్వాంసకుడే కాదు, సంగీత నిర్మాత, కంపోజర్, సినీ నటుడు, పర్క్యూషనిస్ట్. తన 73వ యేటా తీవ్ర అనారోగ్యంతో అమెరికాలో కన్నుమూసారనే వార్త ప్రపంచ సంగీత విద్వాంసులు, సంగీతాభిమానులను, ముఖ్యంగా భారతీయులను నివ్వెరపరిచింది. 09 మార్చి 1951న ముంబాయిలో జన్మించిన జాకీర్ హుసేన్ తండ్రి ప్రఖ్యాత తబలా విద్వాంసుడు "ఉస్తాద్ అల్లా" రాఖా కావడంతో తన ఏడవ ఏటి నుంచే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తబలాపై అసమాన్య పట్టు సాధిస్తూ, పన్నెండవయేటనే ప్రదర్శనలిస్తూ సంగీతకారుల మన్ననలు పొందడం, ప్రపంచానికి తన తబలా సంగీతాన్ని పరిచయం చేయడం జరిగింది. ముంబాయిలోని సెయింట్ మైఖేల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, సెయింట్ గ్జేవియర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. వెల్లింగ్టన్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రముఖ కథక్ నర్తకి, తన మేనేజర్, గురువైన 'ఆంటోనియా



మిన్నెకోలా'ను వివాహమాడారు. వారికి ఇద్దరు కూతుళ్లు. 1970లో అమెరికా పర్యటించి ఏడాదికి 150కి పైగా సంగీత ప్రదర్శనలిస్తూ, వివిధ రకాల సంగీత విద్వాంసులతో కలిసి అబ్బురపరిచే తబలా సంగీత విన్యాసాలను, అనేక రకాల స్టైల్స్‌ను, జాజ్, వరల్డ్ మ్యూజిక్‌లను మేళవించి సంగీతాభిమానుల మనసులు దోచుకున్నారు. 1991లో డ్రమ్మర్ మైఖేల్ హార్ట్‌తో కలిసి ప్లానెట్ డ్రమ్ ఆల్బమ్ తీసి "గ్రామీ అవార్డు"తో పాటు అనేక ఇతర అవార్డులు పొందారు. 1996 అట్లాంటా ఒలంపిక్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో తన తబలా సంగీత కళలో చూపరుల మన్ననలు పొందారు. ఆరు దశాబ్దాలకు పైగా తబలా సంగీతానికి పట్టాభిషేకం చేసిన జాకీర్ హుసేన్ మన భరతమాత ముద్దుబిడ్డ కావడం మనకు గర్వకారణం.

ఉస్తాద్ జాకీర్ హుసేన్ సంగీత కృషి, ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 1988లో 'పద్మశ్రీ', 2002లో 'పద్మ భూషణ్', 2023లో 'పద్మ విభూషణ్' పురస్కారాలతో సత్కరించింది.1999లో 'యూఎస్ నేషనల్ హెరిటేజ్ ఫెల్లోషిప్' పొందారు. 2024లో నిర్వహించిన 66వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఐదు కేటగిరీల్లో ప్రపంచ ప్రఖ్యాత 'గ్రామీ మ్యూజిక్ అవార్డులు' స్వీకరించిన తొలి భారతీయ సంగీత విద్వాంసుడిగా పేరు పొందారు. పలు ప్రపంచ ప్రఖ్యాత సమకాలీన సంగీత విద్వాంసులతో కలిసి సంగీత సృజనకు ఊపిరి పోశారు. 2006లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ "కాళిదాసు సమ్మాన్", 1990లో 'భారత సంగీత నాటక అకాడమీ అవార్డు', 2018లో 'రత్న సదస్య పురస్కారం, 2019లో సంగీత నాటక అకాడమీ ఫెల్లో'గా గుర్తింపు పొందారు. అనేక సినిమాలకు తన సంగీత సహకారం అందిస్తూనే, 2015లో 'సింఫొనీ ఆర్కెస్ట్రా ఆఫ్ ఇండియా'తో మరిచిపోలేని సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పలు అమెరికన్ యూనివర్సిటీల్లో సంగీత పాఠ్యాంశాలు బోధిస్తూ, రేపటి తరానికి సంగీత సామర్థ్యాలను అవగాహన పరిచారు. 2017లో ఎస్ఎఫ్‌జజ్ వేదికలో 'జీవన సాఫల్య పురస్కారం', 2022లో ప్రఖ్యాత 'క్యోటో ప్రైజ్'ను స్వీకరించారు. 2016లో నాటి అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా పిలుపుతో వైట్ హౌజ్‌లో తన ప్రతిభను ప్రదర్శించారు. అసంఖ్యాక మ్యూజిక్ అల్బమ్స్ సృష్టికర్తగా పేరు తెచ్చుకున్న జాకీర్ హుసేన్ జీవిత విశేషాలను పొందుపరుస్తూ "జకీర్ హుసేన్ : ఏ లైఫ్ఇన్ మ్యూజిక్" అనే పుస్తకాన్ని నసీర్ మున్నీ కబీర్ అనబడే రచయిత రచించారు. ముంబాయి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన జాకీర్ హుసేన్ సంగీత జీవితం నేటి సంగీతాభిమానులు, యువ సంగీత కళాకారులకు దారిదీపం కావాలని కోరుకుందాం. ఉస్తాద్ తబలా వాయిద్య కళను సాధన చేసి శ్రోతలకు వీనుల విందుచేద్దాం.

- డా: బి.మధుసూదన్ రెడ్డి,
9949700037

# డాలర్ పెత్తనం


ప్రభాత్ పట్నాయక్

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చునని ఉదారవాద ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి దన్నుగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసుగా అమెరికన్ డాలర్ ఉంది. అంటే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో డాలర్ పెత్తనం చెలాయించడం వెనుక పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల దన్ను ఉంది. అదే డాలర్ ఆధిపత్యం తిరిగి ఆ పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యానికి దన్నుగా ఉంటోంది.అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది.

దీనిని ఒక ఉదాహరణతో వివరిస్తాను: 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అనుకోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాలవద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చు కోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది.

ఈ విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాలనుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు.

ఇలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన




దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది.

ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొం టున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది.

తమ పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ యెల్లెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ "అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుం టాయి." అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యెల్లెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు.

ఇలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయించేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది.

డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్లలనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది. ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తప్పుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది.

అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ యెల్లెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని వందశాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్నమాట.

ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు. ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకు పోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడి పోయింది!

అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బయటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాలర్-రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అమెరికా దృష్టిలో బుద్ధిమంతులని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయోగపడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదురవుతోందన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరిస్తున్నాయి.

సామ్రాజ్యవాదానికి ఎదురౌతున్న సవాలులో డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం అనే డిమాండ్ కూడా ఒక భాగమే. అయితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న విషయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్‌కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని కట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు.

అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోందో ఆ సూత్రాలే, ఆ నియమాలే మారిపోవాలి. అంతే కాదు. అంతర్జాతీయ వాణిజ్యంలో వాణిజ్యలోటు పెరుగుతున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి. బ్రెట్టన్‌వుడ్ వ్యవస్థ పర్యవసానం ఇది. నిజానికి సర్దుబాటు జరగాలంటే అది మిగులు ఉన్న దేశాల వైపు నుంచి మొదలు కావాలి.

(స్వేచ్ఛానుసరణ)

> **నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది.**

> **తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడి పోయింది!**

# సైనిక యోధులపై సర్కారు యుద్ధం


సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545



రక్షణ మంత్రిత్వ శాఖ సైనిక వికలాంగ ప్రయోజనాల మంజూరుకు కఠినతర చట్టాలు చేసింది. సైనిక దళాల న్యాయసభ ఆదేశాలను ఉన్నత న్యాయస్థానాల్లో సవాలు చేస్తోంది.విశ్రాంత సైనికులు ఆగ్రహ నిరసనలతో ప్రభుత్వం నుండి ఊరట కోరుతున్నారు. సైన్యంలో విపత్తులు, వికలాంగతలు, మరణాలు ఎక్కువ.ప్రాణలొడ్డి పోరాడే సైనికులకు పరిహార చెల్లింపులకు గత ప్రభుత్వం ఉదార పద్ధతులను పాటించేది. సైనిక సేవల్లో, యుద్ధంలో గాయపడిన వారికి, జబ్బుపడినవారికి, వికలాంగుల యిన వారికి అధిక పింఛన్ ఈ విధానాల్లో ఒకటి. సైనిక వైద్యబృందం ధృవీకరించే వికలాంగత స్థాయిని బట్టి సైనికుల వికలాంగ ప్రయోజనాలను నిర్ణయిస్తారు. ఈ నిర్ణయం సరిగాలేని పుడు సైనికులు సైనిక దళాల న్యాయసభలో పరిహారం కోరవచ్చు. న్యాయసభ సైనికుల కష్టనష్టాలను లెక్కిస్తుంది. వికలాంగ సైనికులకు న్యాయసభ ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ రక్షణశాఖచట్ట యుద్ధం పెంచింది. వివిధ న్యాయస్థానాల్లో పదహారు వేల కేసులు అపరిష్కృ తంగా ఉన్నాయి. హైకోర్టులు, సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కమిషన్లు రక్షణశాఖ పద్ధతిని విమర్శించాయి. ఈ ధోరణి మానసమని ఆదేశించాయి. అయినా రక్షణశాఖ వ్యాజ్యాలు కొనసాగుతున్నాయి. వికలాంగతలు నకిలీవని ఆ శాఖ వాదిస్తోంది. 'సరిహద్దుల్లో మీరు లేకుంటే దేశంలో మేము బతకలేమని' మోడీ పొగిడే సైనికులను, సైనిక వైద్య నిపుణులను రక్షణశాఖ అవమానిస్తోంది.

21సెప్టెంబర్2023 నుండి పదవి విరమణ చెందే సైనికుల వికలాంగ ప్రయోజనాలను రక్షణశాఖ సవరించింది. వికలాంగుల ప్రయోజనాలను కాపాడటానికి, ఉదార నిబంధనల దోపిడీని ఆపడానికి ఈ సవరణలు చేశామని త్రివిధ దళాధికారి జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఈ సవరణలతో కిందిస్థాయి సైనికులు నష్టపోతున్నారు. సైనిక దళాల న్యాయసభ తీర్పులను సైన్యాధికారులు తిప్పికొడుతున్నారు. వికలాంగతలను సైనిక సేవలకు ఆపాదించలేమని, సేవల్లో అవి పెరగలేదని ప్రకటిస్తున్నారు. వికలాంగతను ఆమోదిస్తూనే దానికి సైనిక సేవలు కారణం కాదని బుకాయిస్తున్నారు. ఇటీవల ఒక అభ్యర్థనను తిరస్కరిస్తూ, గతేడాది 350 అభ్యర్థనలను తోసిపుచ్చామని, ఈ వ్యాజ్యాలు కొనసాగితే రక్షణశాఖకు జరిమానా విధిస్తామని ఢిల్లీ హైకోర్టు హెచ్చరించింది. ఇది ప్రజాప్రతినిధుల, న్యాయస్థానాల సమయ వ్యర్థ ప్రక్రియని వ్యాఖ్యానించింది. సైనిక సేవల్లో తగిలిన గాయాలతో పెనుగులాడుతున్న వృద సైనికుల నైతికతను ఈ అన్యాయాలు అవమానిస్తున్నాయి. "ఇది కేవలం పింఛన్ సమస్య కాదు. సైనికమర్యాద, స్వీయ గౌరవాలకు భంగం కలిగించే విషయం." అని ఏండ్ల తరబడి పింఛన్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్న సేనాని అన్నారు. భ్రమలు తొలిగాయని వరిష్ట సైన్యాధికారులు బాధపడ్డారు. "ఈ ధోరణి కలవరపరిచేది. దీన్ని వెంటనే సరిదిద్దాలి." అని పూర్వ ముఖ్య సైన్యాధికారి వేదమాలిక్ అన్నారు.

"సైనికుల వికలాంగ ప్రయోజనాలను కోర్టుల్లో సవాలు చేయడం రాజ్యానికి, సైనికులకు మధ్యనున్న బంధాన్ని బలహీనపరుస్తుంది. చిక్కులను తెస్తుంది. తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది." అని ఉత్తర భారత పూర్వసైనిక ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ డి.ఎస్. హుడా హెచ్చరించారు. సైనిక న్యాయసభ పరిష్కరించిన సైనిక వికలాంగ పింఛన్లను రక్షణశాఖ కోర్టుల్లో సవాలు చేయడాన్ని పరిశీలిస్తున్నానని ప్రభుత్వ ప్రధాన న్యాయవాది ఆర్. వెంకటరమణి నవంబర్‌లో అన్నారు.ఈ గొడవ 2010లో మొదలయింది. ఈ వ్యాజ్యాలను తగ్గించమని అనుభవజ్ఞులు, పౌరసంఘాలు 2014లో బీజేపీ ప్రభుత్వాన్ని కోరాయి. వికలాంగ సైనికులకు సైనిక న్యాయసభ ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ రక్షశాఖ దాఖలు చేసిన 900 అభ్యర్థనలను 2014 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తిప్పికొట్టింది.

2015 జులైలో రక్షణమంత్రి మనోహర్ పరికర్ ఈ వ్యాజ్యాలను తగ్గించడానికి కమిటీని వేశారు. ఇది రక్షణశాఖ అహంకార వ్యాజ్యాలను విమర్శించింది. సైనికులు అధిక శారీరక, మానసిక శ్రమలతో ఒత్తిడిని ఎదుర్కొంటారు. తరచూ బదిలీలకు గురవుతారు. 24 గంటల మానసిక విధి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం సైనికుల్లో మానసిక అనారోగ్యాలకు కారణం. వీటితో వికలాంగతలు పెరుగుతాయి. సైనికుల సమస్యలను రక్షణశాఖ సున్నితంగా పరిష్కరించాలి. ఏప్రిల్ 2018 లో సుప్రీంకోర్టు ఈ విషయంపై రక్షణశాఖను మందలించింది. తన నకారాత్మక ధోరణి కోర్టుల భారాన్ని పెంచిందని, ప్రభుత్వసొమ్ము వృధా చేసిందని విమర్శించింది. రక్షణశాఖకు రూ.లక్ష శిక్షవేసింది. 2018 సెప్టెంబర్‌లో రక్షణమంత్రి నిర్మల సీతారామన్ ప్రతిష్ట వ్యాజ్యాలను ఆపాలని రక్షణశాఖకు సలహా ఇచ్చారు. ఇన్ని జరిగినా సైనిక న్యాయసభ తీర్పులను రక్షణశాఖ అమలుచేయలేదు. దీంతో కోపగించిన న్యాయసభ వరుస ఆదేశాలను జారీచేసింది. వాటిలో రక్షణరంగ ఆర్థిక విభాగ అధికారుల అరెస్టులూ ఉన్నాయి. ఫలితంగా రక్షణరంగ ఆర్థిక విభాగం ఈ అంశాన్ని మాజీసైనికుల సంక్షేమ శాఖ దృష్టికి తెచ్చింది. సైనిక విభాగ న్యాయమూర్తుల, న్యాయాధికారుల అభిప్రాయాన్ని కోరింది. అక్టోబర్ 2023లో రక్షణశాఖ పూర్వ రక్షణమంత్రుల నిర్ణయాలను చెత్తబుట్టలో వేసింది. సైనిక న్యాయసభ ఇచ్చిన సైనికుల అనుకూల తీర్పులపై కోర్టుల్లో వ్యాజ్యాలు వేయమని సైన్యాధికారులను ఆదేశించింది. 2023 కొత్త చట్టాలు జీవనశైలితో వచ్చే రక్త, గుండెపోట్లు, హృదయ రోగాలు, మధుమేహం వగైరా జబ్బులను వికలాంగ పింఛన్ పరిధి నుండి తొలగించాయి. ఈ తొలగింపు వికలాంగ పింఛన్ల వార్షిక ఖర్చును రూ.10 వేల కోట్ల నుండి రూ.6 వేలకోట్లకు తగ్గిస్తుందని రక్షణశాఖ అంచనా. దేశ సరిహద్దుల్లో శీతోష్ణస్థితులు విపరీత స్థాయిల్లో ఉంటాయి. సైన్యం పనిచేసే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు వికలాంగతలకు దారితీస్తాయి. జీవనశైలి జబ్బులను వికలాంగత పరిధినుండి తొలగించడం విరోధాభాసం, అశాస్త్రీయం.

న్యాయసభ తీర్పులను రక్షణశాఖ చెల్లింపుల శాఖ సమీక్షిస్తుంది. అపసవ్యమనుకున్న కేసులను సైనిక న్యాయశాఖకు పంపుతుంది. న్యాయశాఖ న్యాయ మంత్రిత్వశాఖ అభిప్రాయాన్ని కోరుతుంది. అప్పుడు న్యాయసభ నిర్ణయాలను కోర్టులో సవాలుచేస్తారు. ఈ అంశంపై ఇంటర్నల్ ఆడిట్ ఉంటుంది. 2023లోని వికలాంగ పింఛన్లలో 36-40 శాతం అధికారులు, సైనిక వైద్యాధికారులు, 15-18 శాతం జవాన్లు తీసుకున్నారని ఈ నిఘా తెలిపింది. న్యాసభ నిర్ణయాలు పింఛన్ క్రమబద్ధీకరణకు వ్యతిరేకమని, వికలాంగ పింఛన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలో ఉందని, సైనిక మెడికల్ బోర్డులు తప్పుడు నివేదికలు ఇస్తున్నాయని రక్షణశాఖ అభియోగించింది. రక్షణశాఖ మాజీ సైనికుల సంక్షేమ విభాగం 11నవంబర్ 2024న ప్రభుత్వ ప్రధాన న్యాయవాదితో సమావేశమయింది. సైనిక త్రివిధ దళాధిపతుల సమాచారంతో న్యాయసభ తీర్పులను, పింఛన్ విధానాలను సమీక్షిస్తోంది. సైనిక వికలాంగ పింఛన్లను ఇన్ని విభాగాలు వ్యతిరేకించడం శోచనీయం.

విమర్శించకుండా విధులు నిర్వహిస్తూ, దేశ రక్షణకు ప్రాణాలొడ్డే జవాన్లకు మద్దతుగా నిలవవలసిన బాధ్యత రాజ్యానిది. రాజ్యమే విధులను విస్మరిస్తే సైనికులు ధైర్యం, నైతిక స్థైర్యం కోల్పోతారు. ప్రభుత్వం న్యాయసభల, న్యాయస్థానాల తీర్పులను గౌరవించాలి. సైన్యాన్ని ప్రతిష్ఠగా పరిగణించాలి. ఆదర్శ యజమానిగా మారాలి.రాజ్యానికి, సైనికులకు మధ్య సంఘర్షణ దేశ ప్రతిష్ఠకు, భద్రతకు అపాయకరం. గౌరవ మర్యాదల కోసం న్యాయ పోరాటం చేయవలసిన స్థితికి మాజీ సైనికులను నెట్టడం అవమానకరం.

(ఇండియాటుడే సమాచారం ఆధారంగా)

> **2023 కొత్త చట్టాలు జీవనశైలితో వచ్చే రక్త, గుండెపోట్లు, హృదయ రోగాలు, మధుమేహం వగైరా జబ్బులను వికలాంగ పింఛన్ పరిధి నుండి తొలగించాయి. ఈ తొలగింపు వికలాంగ పింఛన్ల వార్షిక ఖర్చును రూ.10 వేల కోట్ల నుండి రూ.6 వేలకోట్లకు తగ్గిస్తుందని రక్షణశాఖ అంచనా. దేశ సరిహద్దుల్లో శీతోష్ణస్థితులు విపరీత స్థాయిల్లో ఉంటాయి. సైన్యం పనిచేసే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు వికలాంగతలకు దారితీస్తాయి. జీవనశైలి జబ్బులను వికలాంగత పరిధినుండి తొలగించడం విరోధాభాసం, అశాస్త్రీయం.**



## ప్రభుత్వ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలి

- డాక్టర్ వైఆర్‌కె వైద్య శిబిర బాధ్యులు బండారు రమేష్, డాక్టర్ సుబ్బారావు

**నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్**

వైద్య రంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని వైఆర్‌కె నెల నెల వైద్య శిబిర బాధ్యులు బండారు రమేష్, డాక్టర్ సుబ్బారావు అన్నారు. డాక్టర్ వైఆర్‌కె నెల నెల వైద్య శిబిరం విజయవంతంగా 63వ నెల నిర్వహించడం జరిగిందని, దీనికి డాక్టర్లు, అందరు సహాయ సహకారాలతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్పొరేట్ వైద్యం సేవ కంటే లాభానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తుందని, భవిష్యత్తులో మధ్యతరగతి ధనిక వర్గాల ప్రజలు కూడా కార్పొరేట్ వైద్యం పొందడం భారం అవుతుందని అన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం నిధులు కేటాయింపులు పెంచి ఆధునిక వైద్యం ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ భాస్కర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు అందరూ కూడా వైద్య సేవలు అందించారని బండారు రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక నాగ సులోచన, పున్నయ్య, నాగేశ్వరరావు, శెట్టి రామారావు, పోతురాజు జార్జి, ఉపేంద్ర చారి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.2 లక్షల రుణమాఫీని రైతు ఖాతాలో వెంటనే జమ చేయాలి

**తెలంగాణ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు**

**నవతెలంగాణ-నేలకొండపల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగంగా వరంగల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన రెండు లక్షల రైతు రుణమాఫీని ఎటువంటి షరతులు లేకుండా రైతుల బ్యాంకు ఖాతాలో వెంటనే జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎంపీఓ శివకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు, ఏటుకూరి రామారావు, పి భాస్కరరావు, రావెళ్ల అజయ్ కుమార్, మండడకు మురళీకృష్ణ, ఎలమద్ది లెనిన్, దండా సూర్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల చెక్కులను మంగళవారం ఉదయం 11గంటలకు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులతో పాటు ఆయా మండలాల ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.

## ఎగ్జామినేషన్ సెంటర్ మార్పుపై ఆందోళన

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మంలోని సాంకేతిక విద్యాశాఖ గత 50 సంవత్సరాలు నుంచి ఉన్న టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఎగ్జామినేషన్ సెంటర్ మార్పుపై విద్యార్థుల, అధ్యాపకుల ఆందోళనలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు ఒకసారి జరిగే సాంకేతిక విద్య టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఎగ్జామినేషన్స్ సంబంధించి సుమారుగా 600 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యే పరీక్ష సెంటర్‌గా ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం కేంద్రంగా గత 50 సంవత్సరాల నుండి ఎగ్జామినేషన్స్ నిర్వహిస్తున్న స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఖమ్మంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లేదు అన్న సాకుతో అనేక ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్నప్పటికీ విద్యార్థులను ఇబ్బందికి గురి చేసే విధంగా జనవరి 2025లో జరిగే ఎగ్జామినేషన్‌కి సంబంధించి నోటిఫికేషన్‌లో ఖమ్మం నగరం నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మధిర పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జామినేషన్ సెంటర్‌గా మార్చుతూ తీసుకున్న ఏక నిర్ణయంతో అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు దిగ్భ్రాంతికి గురై ఆందోళన చెందుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి బీరువా వితరణ

**నవతెలంగాణ-ఖమ్మం**

నగరంలో 51వ డివిజన్ బుర్హాన్‌పురం 1 అంగన్వాడీ కేంద్రంలో నరసింహారావు, కవిత దంపతుల కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి బీరువా వితరణ చేశారు. అదే విధంగా పిల్లలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. విలాసాగర్ కృష్ణ, పద్మ దంపతులు వేయింగ్ మిషన్ అందజేశారు ఈ సందర్భంగా కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం మాట్లాడుతూ ఆరోగ్య లక్ష్మీ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపరింటెండెంట్ రాధిక, అంగన్వాడీ టీచర్ కే.శ్రీదేవి, సుస్మిత, సావిత్రి, నాగమణి, అంగన్వాడి ఆయా అరుణ, అంగన్వాడి పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**నవతెలంగాణ - బోనకల్**



మండల పరిధిలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీల విజేతలకు ఎస్ఐ కడగండ్ల మధుబాబు సోమవారం నగదు బహుమతులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, మండల స్థాయి పోటీలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పేరుతో ఈ పోటీలను నిర్వహించారు. ఆళ్లపాడులో క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కడగండ్ల మధుబాబు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ శ్రీలత కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కందుల కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోటకూర వెంకటేశ్వరరావు సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య గోవిందాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాగం పాపారావు పాల్గొన్నారు.

## రుణమాఫీ, రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలి

**నవతెలంగాణ-కొణిజర్ల**

రైతు రుణమాఫీ, రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ యర్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతు రుణమాఫీని తక్షణమే చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో కొణిజర్ల తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం నాయకులు పివి రావు, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతారాములు, తండు సోమయ్య, గడల శ్రీను, కొమ్మిన వెంకయ్య, సైదులు, కడప బాబు, ఎర్ర కేశవులు, బండారు పుల్లయ్య, తిప్పతి రామారావు, రజాక్, దొడిపిన్ని వెంకటేశ్వర్ల, కొమ్మిని నరసింహారావు పాల్గొన్నారు.

## డప్పు కళాకారునికి సీపీఐ(ఎం) ఆర్థిక సహాయం

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**



సీపీఐ(ఎం)కు చెందిన డప్పు కళాకారుడు లాల్ సింగ్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడటంతో కాలు విరిగింది. ఈ నిరుపేద కళాకారుడికి వైద్య చికిత్సల నిమిత్తం రూ.20 వేలను సీపీఐ (ఎం) విరాళంగా ఇచ్చింది. సంబంధిత నగదును పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాస్, కార్పొరేటర్ యర్ర గోపి, నాగసులోచన, భూక్యా వీరబాబు, శీలం వీరబాబు బాధితులు ఇంటికి సోమవారం వెళ్లి అందజేశారు.

# రేపు సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు

- 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహణ
- 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు
- హాజరుకానున్న బీవీ రాఘవులు, తమ్మినేని
- సీపీఐ (ఎం) అంటేనే నిత్యం పోరాటాలు
- పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**



సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు సత్తుపల్లి పట్టణంలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం ఈ మహాసభలకు 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని చెప్పారు. సీపీఐ (ఎం) అంటేనే నిత్యం పోరాటాలని తెలిపారు. భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించుకునేందుకు ప్రతి మూడేళ్లకోసారి గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు మహాసభలు నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే సంస్కృతి ఒక్క సీపీఐ (ఎం) పార్టీకే ఉందని స్పష్టం చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నున్నా మాట్లాడారు. ఈ మహాసభలకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సాయిబాబు హాజరవుతారని వివరించారు. మహాసభల ప్రారంభానికి ముందు సత్తుపల్లి డివిజన్ కార్యాలయం నుంచి మహాసభల ప్రాంగణం వరకు ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.

**శాఖ నుంచి జాతీయస్థాయి వరకు కార్యవర్గం**

సీపీఐ (ఎం) గ్రామ శాఖ నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతి మూడేళ్లకోసారి మహాసభలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకునే ఆనవాయితీ దేశంలో సీపీఐ (ఎం) పార్టీకి మాత్రమే ఉందన్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో 516 శాఖ మహాసభలు, 28 మండల, పట్టణ మహాసభలు, ఐదు డివిజన్ మహాసభలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు.

**నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు**

సీపీఐ (ఎం) అంటేనే పోరాటాలు.. ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే మహాసభల్లో ఉద్యమాల రూపకల్పనపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గడచిన మూడేళ్లలో సీపీఐ(ఎం) నిర్వహించిన ముఖ్యమైన పోరాటాల గురించి వివరించారు. 2022 అక్టోబర్‌లో అశ్వారావుపేట-అదిలాబాద్ వరకు రోడ్లు దిగ్బంధించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెడలు వంచి జిల్లాలో 8 వేల పోడు పట్టాలు సాధించుకున్నామని గుర్తు చేశారు. ల్యాండ్ ఫూలింగ్ లో భాగంగా ప్రజల నుంచి తీసుకున్న 820 ఎకరాల భూములను కాపాడగలిగామని చెప్పారు. 350 గ్రామాల్లో కూలి పోరాటాలు నిర్వహించామని తెలిపారు. నాగపూర్ టు అమరావతి, దేవరపల్లి - ఖమ్మం, సీతారామ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం జరిపిన భూసేకరణ ద్వారా నిర్వాసితులకు తగిన పరిహారం ఇప్పించడంలో సీపీఐ (ఎం) కృషి ఎనలేనిదని చెప్పారు. జిల్లాలో 3.78 లక్షల మంది రైతులకు గాను 1.20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేయడంపై పోరాటాలు నిర్వహించామని తెలిపారు. దేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా సీసీప, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ద్వారా 40పైగా సెమినార్లు నిర్వహించామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా 232 కేంద్రాల్లో సభలు నిర్వహించినట్లు చెప్పారు. 2022లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో నిర్వహించినట్లు చెప్పారు. సభలకు లక్ష మందిని సమీకరించి, ఖమ్మానికి 5 వైపుల నుంచి 30 వేల మందితో ఎరుపు ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ముఖ్యఅతిథిగా హాజరైనట్లు తెలిపారు. ఇవేకాక ధరల పెంపు, పన్నుల పెంపు, బడ్జెట్లో జిల్లాకు తగిన కేటాయింపులు లేకపోవడాన్ని నిరసిస్తూ ఉద్యమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇళ్ల, ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల సమస్యలపైనా సీపీఐ (ఎం) పోరాటాలు నిర్వహించిందన్నారు. 400 కేంద్రాల్లో సీతారాం ఏచూరి సంస్మరణ సభలు నిర్వహించామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నతనడకన సాగుతుండటం, రూ.2వేల కోట్ల అంచనా వ్యయంతో మొదలై నేడు రూ 20 వేల కోట్లకు చేరినా ప్రాజెక్టు అందుబాటులోకి రాకపోవడంపై ఉద్యమాలు నిర్వహించామన్నారు.

**అరుచోట్ల వైద్య శిబిరాలు**

ప్రజా పోరాటాలే కాదు ప్రజలకు సర్వీస్ అందించే విషయంలోనూ సీపీఐ (ఎం) ముందుంటుందని ప్రస్తావించారు. గత ఎనిమిది తొమ్మిది సంవత్సరాలుగా జిల్లాలో ఆరు చోట్ల పార్టీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వీటి ద్వారా ప్రతినెల 4వేల మంది వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు. వీరికి రూ.100కే రూ.2వేలకు పైగా విలువ చేసే మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ రూ.20 లక్షల విలువ చేసే మందులను పంపిణీ చేశామన్నారు. వరదల్లో చిక్కుకున్న జనాన్ని తన పార్టీ కార్యకర్తలు రక్షించారని, వరద బాధితులకు భోజనాలు, తాగునీరు, దుస్తులు సమకూర్చినట్లు చెప్పారు. 7000 మందికి పాత దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ఈ మహాసభల్లో భాగంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంపై, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన, ఖమ్మంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిమ్స్ తరహా వైద్య కళాశాల, ఆరు గ్యారంటీల అమలుపై తీర్మానం చేస్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

- లేనిపక్షంలో మరో పోరాటానికి సిద్ధం
- సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి

**కళ్యాణ వెంకటేశ్వరరావు**

**నవతెలంగాణ- ఖమ్మం**




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2003లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు సరుకులు మొత్తం స్కూళ్లకు ప్రభుత్వమే సరఫరా చేసి వేతనం నెలకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, హామీ వంద రోజులలో అమలు చేస్తామని చెప్పారని, అధికారం చేపట్టి ఒక సంవత్సరం కావస్తున్నా నేటి వరకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయలేదని, వెంటనే ప్రస్తుతం జరిగే అసెంబ్లీ సమావేశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు బడ్జెట్ కేటాయించి పదివేల వేతనాలు చేయాలని, లేని పక్షంలో మరో పోరాటానికి సన్నద్ధమవుతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 9, 10 తరగతి సంబంధించిన 14 నెలల వంట బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పది నెలల నుండి కోడిగుడ్డు బిల్లులు విడుదల చేయాలని, గత ప్రభుత్వం పెంచిన 2000 వేతనాన్ని పెండింగ్లో వేతనం వెంటనే వేయాలని, అట్లాగే గత మూడు నెలల పెండింగ్ వంట బిల్లులు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు. కాటన్ శారీస్ రెండు ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలను రెండు లక్షల వరకు ఇవ్వాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, తిరుమలాయపాలెం మండల కన్వీనర్ వసపొంగు వీరన్న, ఏన్కూర్ మండల కార్యదర్శి ఏర్పుల రాములు, కారేపల్లి మండల కన్వీనర్ కే.నరేంద్ర, మధ్యాహ్నం జిల్లా నాయకులు భద్రమ్మ, రాధమ్మ, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, గంగమ్మ, దుంపల లక్ష్మి, పద్మ, రాణి పాల్గొన్నారు.

## మహాసభల ఏర్పాట్లపై సమావేశం

**నవతెలంగాణ-సత్తుపల్లి**



సత్తుపల్లిలో సీపీఐ(ఎం) 22వ జిల్లా మహాసభలు రేపు (బుధవారం) ప్రారంభం కానున్నాయని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేశ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని రావి వీరవెంకయ్య (ప్రజా సంఘాల) భవన్‌లో మహాసభల ఏర్పాట్లపై పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సోమవారం రాత్రినుంచే పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి మహాసభలు జరిగే సభాస్థలి సిద్దారం రోడ్డులోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలు వరకు పార్టీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే పనిల్లో పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యేలా నాయకులతో రమేశ్ చర్చించారు. ప్రజలను ఆకర్షించేలా ప్రధాన కూడళ్ల జెండాలు, తోరణాలతో ఎరుపుమయంగా ఉండేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు జెండాలు రెపరెపలాడాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే సీపీఐ(ఎం) మహాసభల నేపథ్యంలో పట్టణమంతా పండగ వాతావరణాన్ని తలపించేలా, పట్టణమంతా ఎరుపుమయంగా ఉండేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, రైతుసంఘ జిల్లా నాయకులు రావుల రాజబాబు, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

### జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై

## కేంద్రం జీఎస్టీ భారం తగ్గిస్తుందా..?

- ప్రత్యేక ప్రణాళికను అనుసరిస్తారా..?
- పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ

**రామసహాయం రఘురాం రెడ్డి**

**నవతెలంగాణ-ఖమ్మం**




జీవిత, ఆరోగ్య బీమాల ప్రీమియంలపై వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) భారం తగ్గిస్తారా..? పన్నుల రూపంలో లాభాపేక్ష లేకుండా, వినియోగదారుల పక్షాన ప్రత్యేక ప్రణాళికను ఏమైనా రూపొందిస్తారా..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. సోమవారం కోరారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్రాలు, కేంద్రం నుంచి ప్రతినిధులతో కూడిన కౌన్సిల్ సిఫార్సుల ఆధారంగా జీఎస్టీ రేట్లు, మినహాయింపులు నిర్దేశించబడినట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 54వ సమావేశంలో జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్టీ సమస్యపై సవివరమైన చర్చల తర్వాత.. కౌన్సిల్ సిఫారసు మేరకు సమగ్ర పరిశీలనకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ జీఓఎం తమ నివేదికను జీఎస్టీ కౌన్సిల్ కు ఇంకా సమర్పించలేదని అన్నారు. పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత..ఆరోగ్య బీమా పాలసీలకు పన్ను ప్రయోజనాలపై స్పష్టత వస్తుందని ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డికి కేంద్ర సహాయ మంత్రి వివరించారు.

## మహిళలను బలహీనురాలుగా చిత్రీకరణ

- వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బొంతు సమత

**నవతెలంగాణ-వైరాటౌన్**




ఆది నుంచి మహిళలను బలహీనురాలుగా చిత్రీకరించారని పురాణాలు, ఇతిహాసాలు, సనాతన ధర్మం అన్నింటిలో శక్తి లేని వ్యక్తిగా ఇతరులపై ఆధారపడి జీవించే వారిగా మహిళలను ఒప్పించే ప్రయత్నం జరిగిందని వైరా మాజీ ఎంపీపీ, స్టడీ సర్కిల్ కన్వీనర్ బొంతు సమత అన్నారు. సోమవారం వైరా సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్ లో మహిళలు -హింసపై మాట్లాడుతూ శివ పార్వతుల కధలో కూడా పార్వతికి రక్షణగా పురుషుడు బొమ్మ తయారు చేసి పెట్టారని, అక్కడ నుండి మహిళలు రక్షణకు పురుషులుపై ఆధారపడి జీవించే విధంగా వ్యవస్థీకృతం అయి వేల సంవత్సరాలగా వర్ధిల్లుతుందని అన్నారు. యుద్ధం, మత ఘర్షణలకు మొదటి బాధితులు మహిళలని, మహిళ అభ్యున్నతికి అనేక సంఘసంస్కరణ ఉద్యమాలతోపాటు జాతీయోద్యమం,, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సాధారణ మహిళలు సైతం ఉద్యమంలో భాగస్వామ్యం కావడం మహిళ చైతన్యం పెరిగింది అన్నారు. ఆధునిక యుగంలో కూడా నేటికీ మహిళలు తక్కువ చూపుకి గురి అవుతున్నారని, మరోవైపు అత్యాచారాలు, హింస ఎదుర్కొంటూ న్యాయస్థానాల చుట్టూ న్యాయం కోసం దశాబ్దాలుగా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. మొత్తం సమాజం మహిళలపై హింసలో స్పందించాలని కోరారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ సభ్యులు బొంతు రాంబాబు, పారుపల్లి చంద్రశేఖర్ బాబు, పారుపల్లి కృష్ణారావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, వడ్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రంజాన్, నాగేశ్వరరావు
- జిల్లా కమిటీ సభ్యులుగా 119, ఆఫీస్ బేరర్లు 19మంది
- ఆడిట్ కమిటీకి ఐదుగురు ఎంపిక

**నవతెలంగాణ-సత్తుపల్లి**



తెలంగాణ స్టేట్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటయింది. శని, ఆదివారాల్లో సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘ 6వ జిల్లా మహాసభలు రెండు రోజుల పాటు జరిగాయి. ఈ మహాసభల్లో రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా షేక్ రంజాన్, ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి నాగేశ్వరరావులను సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 19 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకోగా మరో 119 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా మహాసభ నియమించింది. ఐదుగురు ఆడిట్ కమిటీకి ఎంపికయ్యారు.

**జిల్లా నూతన కార్యవర్గ బాధ్యులు వీరే...**

జిల్లా అధ్యక్షుడిగా షేక్ రంజాన్, ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బుర్రి వెంకన్న, షమీ, కోశాధికారిగా వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులుగా ఎం.నర్సయ్య, డి.నాగేశ్వరరావు, వీవీ రామారావు, నిర్మలాకుమారి, సురేశ్, రాందాస్, నాగూర్ వలీ, ఉద్దండ్ షరీఫ్, పద్మ రోజా, రామకృష్ణ, కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, సుధాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఏర్పాటులో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని పరిశీలకురాలిగా వ్యవహరించగా రాష్ట్ర కార్యదర్శి బి.రాజు ఎన్నికల అధికారి పాత్రను నిర్వహించారు.

**నూతన కార్యవర్గం ప్రభుత్వం ముందుంచనున్న డిమాండ్లలో కొన్ని ఇలా..**

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలి. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలి, తెలంగాణ రెండో పీఆర్సీని తెప్పించి మెరుగైన ఫిట్‌మెంట్లతో జులై 2023 నుంచి అమలు చేయాలి. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేలు అమలు చేస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లోని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలి. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని వెంటనే విడుదల చేయాలి. ప్రాథమిక విద్య బలోపేతానికి నర్సరీ తరగతులు, కేజీ తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టి తరగతికి ఒక టీచర్‌ను నియమించాలి. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి.



## నిధుల మంజూరు కోసం భట్టికి వినతి

**నవతెలంగాణ-ముదిగొండ**

మండలంలోని 16 గ్రామాల్లో 67 పనులు, లింకు రహదారులతో పాటు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు కలిసి వినత పత్రం అందజేశారు. సువర్ణాపురం, యడవల్లి, పాత లక్ష్మీపురం, గోకినేపల్లి, ముదిగొండ, పెద్దమండవ, బాణాపురం అయ్యగారిపల్లి, పమ్మి, మల్లారం, మల్లన్నపాలెం, గంధసిరి, వెంకటాపురం, చిరుమర్రి, వల్లాపురం, వనంవారికిష్టాపురం గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పూర్తి వివరాలతో భట్టి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేయాలని సిపిఐ(ఎం) నేతలు కోరారు. పార్టీ నేతల వినతకు స్పందించిన భట్టి వెంటనే గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేషన్ తయారు చేసి పంపించాలని సంబంధిత శాఖ అధికారులకు భట్టి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, ఎర్రుపాలెం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్, చింతకాని మండల కార్యదర్శి రాచబంటి రాము పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
మంగళవారం | డిసెంబర్ 17, 2024 | www.navatelangana.com


## జాతీయ స్థాయిలో బహుమతి అందుకున్న కొత్తపల్లి కృష్ణారావు

**నవతెలంగాణ-కామేపల్లి**



తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక ఎస్పీ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం ఆదిలాబాద్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని కళ్యాణ మండపంలో జరుగనున్నవి. ఈ సందర్భంగా నిర్వహించిన "నాగరికతా... నీ ప్రయాణం ఎటువైపు...?" అన్న అంశం పై జాతీయ స్థాయిలో కవితా పోటీలు నిర్వహించగా సుమారు 200 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా నుండి కొత్తపల్లి కృష్ణారావు రాసిన "గమ్యం లేని నావ" అన్న కవితకు జాతీయ స్థాయిలో బహుమతి దక్కింది. కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండున్నర సంవత్సరాలుగా 104 ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణా రావును కామేపల్లి మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందన, సలహా హెచ్ఓ సుధారాణి, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ రాధాక్రిష్ణ, స్టాఫ్ నర్సు పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ కల్లూరి ఉమామహేశ్వర రావు, ఫార్మా సిస్ట్ సిరాజ్, ధనంజ లు అభినందించారు.

# బీబీసీకి తగ్గించిన సాగర్ నీటి సరఫరా

- తడులందక ఇబ్బంది పడుతున్న అన్నదాతలు
- ప్రస్తుతం నిరంతర నీటి సరఫరా ఎంతో అవసరం

**నవతెలంగాణ-బోనకల్**

ముందుగా రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే బోనకల్ బ్రాంచ్ కెనాల్ కు ఒక్క సారిగా నీటి సరఫరాను అధికారులు తగ్గించారు. దీంతో ఎంతో ఆశతో మొక్కజొన్న సాగుచేసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బీబీసీకి నీటి సరఫరాను ఆదివారం నుంచి పూర్తిగా తగ్గించారు. దీంతో మొక్కజొన్న విత్తనాలు భూమిలో వేసిన రైతులు తమ పొలాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నీటిపారుదల శాఖ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరాను తగ్గించడంతో తడులకు దెబ్బ కొట్టే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోనకల్ మండలంలోని బోనకల్, చిరునోముల, రావినూతల, గోవిందాపురం ఏ, చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల, రామాపురం, గార్లపాడు, తూటికుంట్ల, పెద్ద బీరవల్లి నారాయణపురం తదితర గ్రామాలలో పత్తి పీకి మొక్కజొన్న విత్తనాల సాగు గత నెల రోజులుగా ముమ్మరంగా కొనసాగుతుంది. దీంతో నీటిపారుదుల శాఖ ఏఈ ను పలువురు రైతులు నీటి సరఫరా ఎందుకు తగ్గించారని అడగ్గా వారబందీ పెట్టారని చెబుతుండటంతో రైతుల మరింత ఆందోళన చెందుతున్నారు. దీంతో అనేకమంది రైతులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారబందీని ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా మొక్కజొన్న వేయటానికి ఇంకా 20 రోజులకు వరకు సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటివరకు నిరంతరాయంగా సాగు నీటి సరఫరా చేయకపోతే పొలాలు తడిసే అవకాశం లేదని ఆళ్లపాడు, చిరునోముల చెందిన రైతులు తోటకూర వెంకటేశ్వరరావు, అల్లిక లక్ష్మీనారాయణ, మల్లాది లింగయ్య, ముంగి వెంకన్న పరిస పుల్లయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.



**డీఈ వెంకటేశ్వర్లు వివరణ**

బీబీసీకి నీటి తగ్గింపు విషయం గురించి బోనకల్ సబ్ డివిజన్ డిఈ తమ్మారపు వెంకటేశ్వర్లను వివరణ కోరగా పాలేరులో నీటి లెవెల్ తగ్గిన కారణంగా బీబీసీకి నీటిని తగ్గించారని తెలిపారు. ఒకటి రెండు రోజులలో నీటి సరఫరా యధావిధిగా కొనసాగే అవకాశం ఉందని, రైతుల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారబంది గురించి ఇంకా జిల్లా ఉన్నతాధికారులు షెడ్యూల్ విడుదల చేయలేదని, దాని గురించి రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

# 2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

- కౌలు రైతుకు రైతు భరోసా ఇవ్వాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం డిమాండ్

**నవతెలంగాణ-చింతకాని**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టి తహసీల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను షరతులు లేకుండా అమలు చేయాలని నూటికి 100 శాతం అమలు చేసి తీరాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతుబంధు, భరోసా కింద 15 వేలు వేస్తామని నేటి వరకు అమలు చేయకపోవడం రైతుల ఖాతాలో జమ కాకపోవడం దురదృష్ట కరమన్నారు. పెట్టుబడి సాయం కింద ఎకరానికి 15వేలు ఇస్తామని చెప్పారు దానిని కూడా తక్షణమే అమలు చేసి రైతులకు పెట్టుబడి సాయం కింద అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచబంటి రాము, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు, సీఐటీయు మండల కార్యదర్శి గడ్డం రమణ, పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ కాటాబత్తిని వీరబాబు, మండల కమిటీ సభ్యులు ఆలస్యం రవి పాల్గొన్నారు.



# రైతుల శ్రమను దోచుకుంటున్న మిల్లర్లు

- క్వింటా ధాన్యానికి నాలుగు కేజీలు అదనం
- రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి

**నవతెలంగాణ-వేంసూరు**

ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం అమ్మాలంటే అడవి, కొనాలంటే కొరివిలా తయారయింది. మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం క్వింటాకు 4 కేజీలు అదనంగా తీసుకుంటూ రైతుల శ్రమను అవసరాలను ఆసరాగా తీసుకుని సీఈఓ మిల్లర్ కలిసి దోచుకుంటున్నారని జిల్లా అధికారులు విచారించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ(ఎం), రైతు సంఘం టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఇన్‌చార్జీ డిప్యూటీ తహసీల్దార్ చిరంజీవికి వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు అనువైన ప్రదేశం లేకపోవడంతో గ్రీన్ ఫీల్ రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టారు. రోడ్డు పనులకు అంతరాయం కలుగుతుండటంతో తప్పనిసరి పరిస్థితులలో ధాన్యాన్ని మరోచోటకు తరలించే క్రమంలో సీఈవో మిల్లర్ కలసి నాలుగు కిలోలు తరుగు పేరుతో అదనంగా ఇస్తే కాటాలు నిర్వహిస్తామని చెప్పి రైతుల ఇష్టపూర్వకంగానే వేస్తున్నామంటూ చెబుతూ సుమారు నాలుగు లారీల ధాన్యాన్ని తరలించారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసి మిగిలిన ధాన్యాన్ని వెంటనే కాటాలు వేసి నగదు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఎక్కడా లేని విధానాన్ని తీసుకువస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఇదే విధంగా కొనసాగితే రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కొత్త సత్యనారాయణ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్రావు, తెలుగు రైతు సంఘం నాయకులు బొంతు భాస్కరరావు, అరవపల్లి గోపాలరావు, చెన్నయ్య, కొత్త అప్పారావు, డొంకర శ్రీను, రావి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా అనుమోలు కోటేశ్వరరావు ఎన్నిక

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



సత్తుపల్లి పట్టణంలో యుటీఎఫ్ జిల్లా ఆరవ మహాసభలు 14, 15 తేదీలలో నిర్వహించారు. ఈ సభలలో ఎర్రుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల నందు ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తున్న అనుమోలు కోటేశ్వరరావుని జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల కమిటీ ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు, రత్నమ్మ, సైదారావు, జీవన్ బాబు, భారత్ మారబత్తుల నాగేశ్వరరావు, మురళి, ఖాజా మొహిద్దిన్, పుల్లారావు, సుధాకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## సభ్యత్వ నమోదుతో పార్టీ పునర్నిర్మాణం

**కామేపల్లి :** టీడీపీ సభ్యత్వ నమోదుతో పార్టీ పునర్నిర్మాణం జరుగుతుందని పార్టీ జిల్లా నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో ఆదివారం టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం తీసుకవచ్చి, బానిసత్వం పోగొట్టినటువంటి పార్టీ టీడీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుచ్చకాయల రామకృష్ణ, ఏపూరి వసంతరావు, కిన్నెర రమేష్, సంఘం వెంకన్న, నూతలపాటి నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి శ్రీను, కొండపాల శ్రీను,పాల్గొన్నారు.

## వైద్యాధికారి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**



మండల పరిధిలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో అదే గ్రామానికి చెందిన బత్తుల వెంకటనారాయణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారుడు వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం బత్తుల రాధమ్మ అనే మహిళ ఇటీవల సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇటుక పెళ్ళ కాలు మీద పడటంతో కాలి బొటనవేలు పూర్తిగా నలిగిపోయి రక్తస్రావం అవుతుండగా చికిత్స నిమిత్తం సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడ ప్రధాన వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అవహేళనగా మాట్లాడుతూ వైద్యం చేయకుండా సుమారు 30 నిమిషాలు వైద్యం అందించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. వైద్యురాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.





## రాజ్యాంగాన్ని మార్పు చేసే యత్నంను తిప్పి కొట్టండి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ

**నవతెలంగాణ-వైరాటౌన్**

వైరా మండలం విప్పలమడక గ్రామంలో భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సమావేశం మార్క్యాపురం కళావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, వైరా రూరల్ మండల అధ్యక్షురాలు బాణాల వెంకట్రావమ్మ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి మత ఆధారిత రాజ్యాంగాన్ని తీసుకొచ్చే చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మన రాజ్యాంగంలో లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వం విలువగల సూత్రాలతో రాజ్యాంగాన్ని రాసుకున్నామని, ఎవరి కులం మతం విశ్వాసాలు వారికి ఉన్నాయని, భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేకతని అన్నారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని అన్నారు.

విప్పలమడక ఐద్వా గ్రామ కమిటీ ఎన్నిక :- కార్యదర్శిగా మొత్తమాల జోత్స్న, అధ్యక్షురాలుగా గరిడేపల్లి స్వరూప, ఉపాధ్యక్షులుగా గరిడేపల్లి లక్ష్మి, సహాయ కార్యదర్శిగా గరిడేపల్లి కావేరి, కోశాధికారిగా మార్క్యాపురం కళావతి, సభ్యులుగా ఎదుళ్ల కృష్ణకుమారి, దారా మేరిసమ్మ, బూర్గు కళ్యాణి, గరిడేపల్లి మల్లేశ్వరి, ఏదుళ్ల కృష్ణకుమారి తదితరులు ఎన్నికైనారు.

## సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**నవతెలంగాణ-కల్లూరు**

సీపీఐ(ఎం) జిల్లా 22వ మహాసభలు 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ కోరారు. చింతలపూడి జగ్గయ్య భవన్లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభలకు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్ రావులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల విజయవంతం కావాలని తనవంతుగా పార్టీకి తన్నీరు తులసమ్మ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, మండల నాయకులు గంపల శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ఫౌండేషన్ సాకారంతో జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

**నవతెలంగాణ-కల్లూరు**

స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. ఈ కార్యక్రమం 60 రోజులు కొనసాగుతుంది. ఈ కళాశాలకు మారుమూల ప్రాంతాల నుండి నిరుపేద విద్యార్థులు వస్తుంటారు. ప్రతి రోజు 150 పైగా విద్యార్థులు భోజనం చేస్తున్నారు. విద్యార్థులకు మంచి పౌష్టికరమైన భోజనం ఇస్తే ఆరోగ్యంగా వుంటూ.. ఎగ్జామ్స్ నందు మంచి ఫలితాలు వస్తాయి. హాజరు శాతం పెరుగుతుంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత వ్యాల్ దాతల సహకారంతో చేస్తున్నారు. ఇంకా దాతల ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. సోమవారం భోజనంలో విద్యార్థులకు అదనంగా అరటి పండ్లు చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చావా శ్రీనివాసరావు ఇచ్చారు. ఎవరైనా దాతలు డైలీ భోజనంలో స్వీట్ గాని కోడిగుడ్డు గాని ఫ్రూట్ గాని ఇవ్వగలరని కోరుతున్నారు.

## ఇసుక ర్యాంపు ప్రారంభం

**డ్వాక్రా సంఘాల ద్వారా తోలకాలు**

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా ఇసుక రేవుల నుండి ఇసుక తోలకాలను ప్రారంభించారు. మండల పరిధిలోగల వివిధ ఇసుక ర్యాంపుల నుండి తోలుకునేందుకు కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు ఇసుకతోలకాలను తహసీల్దార్ మన్నె ఉషాశారద, మైనింగ్ ఆర్ఐ నాగరాజు ప్రారంభించారు. ఇల్లు నిర్మాణ వినియోగదారులు తదితర అవసరాలకు ఇసుక కావలసిన వారు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైకాలజిస్ట్ సంతోష్, ప్రమోదు నరసింహరావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీ శాంతకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకరరెడ్డి, బండారు నరసింహరావు, శీలం ప్రతాపరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి, బాబూరావు, రాజీవ్ గాంధీ, నాయకులు అధికారులు డ్వాక్రా సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్ 2 ప్రశాంతం

- పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

**నవతెలంగాణ-ఖమ్మం**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీ 2 రోజుల పాటు నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లాలో 28 వేల 101 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా మొత్తం 85 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో కనీస మౌళిక సదుపాయాల కల్పన చేసినట్లు, ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు సోమవారం కలెక్టర్ స్థానిక ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్ లను పబ్లిక్ సర్వీస్ కమీషన్ తయారు చేసిందని, పరీక్షలకు అభ్యర్థి రాకపోయినా సంబంధిత అభ్యర్థి బెంచ్ పై ఓఎంఆర్ షీట్ పెట్టారో లేదో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రంజాన్ ఎన్నిక

**నవతెలంగాణ-కొణిజర్ల**



యూటీఎఫ్ జిల్లా మహాసభలు సత్తుపల్లి పట్టణంలో14, 15 తేదీలలో ఘనంగా జరిగాయి. ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన రంజాన్‌ని ఉపాధ్యాయులు సమస్యలపై పోరాటాలు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి జిల్లా మహాసభలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కొణిజర్ల మండలం పెద్దగోపతి పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు షేక్ రంజాన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడు రంజాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, సిఆర్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలోని పండిట్స్, పిఈటీ పోస్టుల అప్గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు మంజూరుకు కేజీబీవీ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేలు, గిరిజన సంక్షేమ శాఖలోని సీఆర్టీలకు మినిమం టైమ్ స్కేలు, కాంట్రాక్ట్ టీచర్స్, ఏఎన్ఎం, కంప్యూటర్ ఫ్యాకల్టీలకు ప్రతినెల జీతాలు అందేలా, పిఆర్సీ, పెండింగ్ డిఏలను సాధించుకోవాల్సి వున్నదని, దశల వారి పోరాట కార్యక్రమంలో భాగస్వామి అయి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం పాటుపడతానని తెలియజేశారు.

**రంజాన్‌ని అభినందించిన యూటీఎఫ్ మండల కమిటీ...**

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రంజాన్‌ను ఈ సందర్భంగా యూటిఎఫ్ మండల కమిటీ సభ్యులు సోమవారం అభినందించారు.



## బాల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**నవతెలంగాణ-ఖమ్మం**

బాల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, దీనికి సంబంధించిన పనులను పకడ్బందీగా అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ నగరంలోని బాల సదనం భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాల సదనంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులు, పిల్లలకు ఆహ్లాదం కోసం కల్పించాల్సిన ఆట పరికరాల పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

బాల సదనంలోని స్థలంలో ఉన్న బండలను తొలగించి భూమి చదును చేయాలని అధికారులకు తెలిపారు. అక్కడ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా ఉయ్యాల, జారుడు బండ, షటిల్ కోర్ట్ వంటి వివిధ ఆటలకు ఏర్పాటు చేస్తూ మంచి ప్లే ఏరియా సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాల సదనం భవనంలో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలని, భవనం గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్స్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, బాల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా తక్షణం అమలు చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు

**నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్**

రైతు భరోసా తక్షణం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం పిలుపుమేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఖమ్మం రూరల్ అర్బన్, రఘునాథపాలెం మండలం కేంద్రాల వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న భాగం హేమంతరావు మాట్లాడుతూ రుణ మాఫీ పూర్తిగా చేయాలన్నారు. ఖమ్మం రూరల్, అర్బన్, రఘునాథపాలెం మండల రెవెన్యూ అధికారులు సమస్యలతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. ఖమ్మం రూరల్ మండల కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మహమ్మద్ మౌలానా రైతు సంఘం నాయకులు చిన్న వెంకటరెడ్డి పుచ్చకాయల సుధాకర్ రంగుల చంద్రరావు బానోత్ రామకోటి మెడికంటి పెద్ద వెంకటరెడ్డి మామిడి సుదర్శన్ రెడ్డి వెంపటి రాము పాల్గొన్నారు.



## అలుపెరిగిన ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం మడుపల్లి

- గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయికి ఎదిగిన గోపాల్‌రావు
- పాతర్లపాడు సీపీఐ(ఎం) శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**నవతెలంగాణ-చింతకాని**

విద్యార్థి దశ నుండి సిపిఎం పార్టీలో అలుపెరగని ఉద్యమాలు చేపట్టి గ్రామస్థాయి నుండి మండల స్థాయికి మండల స్థాయి నుండి డివిజన్ స్థాయికి ఎదిన వ్యక్తి మడుపల్లి గోపాల్‌రావును పాతర్లపాడు సిపిఎం పార్టీ గ్రామ శాఖ శాలువాతో ఘనంగా సన్మానించింది. అదే విధంగా కొదుమూరు గ్రామంలో సిపిఎం పార్టీని ముందుండి నడిపి చింతకాని మండల కార్యదర్శిగా ఎన్నికైన రాచ బటి రామును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సామినేని రామారావు, మండల పార్టీ నాయకులు కొండ్రు జానకి రాములు, మాజీ ఎంపీటీసీ కాట బత్తిని వీరబాబు, ఉసికల నారాయణ, గోపయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | డిసెంబర్ 17, 2024 | www.navatelangana.com



## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదు అందజేత

- ప్రజా జీవనంలో కలిసి జీవించాలి : ఎస్పీ

**నవతెలంగాణ-కొత్తగూడెం**

నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ఏడుగురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదును ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల కాలంలో జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టు సభ్యులకు చెక్కు రూపంలో రివార్డు నగదులను అందజేశారు. పోడియం మంగు అలియాస్ దేవేందర్‌కు రూ.4,00,000లు, మడకం అడిమె అలియాస్ అనూషకు రూ.4,00,000లు, కోరం సోమయ్య అలియాస్ సోమ, రూ.1,లక్ష, సొడ్డి పొజ్జి అలియాస్ చిలుక, రూ.4,00,000లు, మడివి సోమిడి అలియాస్ రమ్యకు రూ.4,00,000లు, మడకం ఇడుమయ్య అలియాస్ మహేష్‌కు రూ.1 లక్ష, లక్ష్మయ్య అలియాస్ కల్లు రూ.1 లక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ 2023-2024 సంవత్సరాల కాలంలో లొంగిపోయిన 26 మంది సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, దుమ్ముగూడెం సిఐ అశోక్, చర్ల సీఐ రాజువర్మలు పాల్గొన్నారు.

## తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మైపతి రాజేశ్వరరావు

**నవతెలంగాణ-అశ్వాపురం**



తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా అశ్వాపురం రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న మైపతి రాజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుండి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ తనపై నమ్మకంతో జిల్లా అసోసియేట్ అధ్యక్షత బాధ్యతలు అప్పగించినందుకు కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన శక్తివంచనమేరకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## దశరథం మరణం తీరని లోటు

- ఆయన సేవలు మరువలేనివి

**నవతెలంగాణ-మణుగూరు**



మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పెంట్యాల దశరథం ఆకస్మిక మృతి ఎవరూ తీర్చలేనిది పలువురు లారీ యజమానుల సంతాపం తెలిపారు. అనారోగ్యంతో ఆదివారం ఉదయం హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన దశరథం (65)కు లారీ యజమానులు సమావేశమై ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. దశరథంకి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కాగా మణుగూరు ఏరియా లారీ యజమానుల సంక్షేమానికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా లారీ యజమానులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, తూపూడి శ్రీను, ఈశ్వరరావు, ఈశ్వర్ రెడ్డి, శాంతి కుమార్, చారి, మున్నా, బాబి తదితరులు పాల్గొన్నారు.



## ఏఎన్ఎంల వేతనాలను విడుదల చేయాలి

- సీఐటీయూ కన్వీనర్ ఎం.బి.నర్సారెడ్డి
- ఐటీడీఏ ఎదుట ధర్నా

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో, ఆశ్రమ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలకు గత పది నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ పీవో ఆఫీస్ ఎదుట ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ... గత పది నెలలుగా వేతనాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాలు ఇవ్వకపోగా గిరిజన ఏఎన్ఎంలను అధికారులు 24 గంటలు పని చేయించుకుంటూ పని భారాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరిని మార్చుకొని వెంటనే వేతనాలు చెల్లించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను అవుట్సోర్సింగ్ విధానం నుండి కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి డైరెక్ట్‌గా వాళ్ళ వేతనాలు అకౌంట్లో జమ చేయాలని కోరారు. అదేవిధంగా వాళ్లని రెగ్యులర్ ఏఎన్ఎంలుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించిన ఏఎన్ఎంలు అనంతరం ఐటీడీఏ అధికారి డేవిడ్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం బి.పద్మ అధ్యక్షతన వహించగా ఏఎన్ఎం సంఘ బాధ్యులు వి.కౌసల్య, ఏ.సరిత, వి.లక్ష్మి, వై.సుధారాణి, జి.కుమారి, బి.శ్రావణి, ఎం.స్వరూప, టి.శ్రావణి, ఏ.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ రావి సీతయ్య ద్వితీయ వర్ధంతి

**నవతెలంగాణ-దమ్మపేట**

మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు, అమరజీవి, కామ్రేడ్ రావి సీతయ్య ద్వితియ వర్ధంతిని పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కొలికిపోగు శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముందుగా సీతయ్య స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ ఎగురవేయగా చిత్రపటానికి మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావులు మాట్లాడుతూ సీతయ్య ప్రపంచంలోనే మహత్తర మైన మార్కిస్ట్ సిద్ధాంతాన్ని నమ్మి ఎర్రజెండాను భుజానికి ఎత్తుకొని తన జీవితాంతం పేద ప్రజల కోసం, కష్టజీవులు కోసం, రైతుల కోసం, అణగారిన వర్గాల కోసం, కుల రహిత సమాజం కోసం, వర్గ రహిత సమాజం కోసం, ప్రజల తరఫున మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరుకుట్ల రాంప్రసాద్, కొలికిపోగు ప్రశాంత్, జగన్నాథం శ్రీనివాసరావు, చీకటి వెంకట లక్ష్మీనారాయణ, కొలికిపోగు జగపతి, కొలిగిపోగు లక్షన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

**నవతెలంగాణ-కొత్తగూడెం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంతరనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా 38 పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో 13,466 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా, మొదటి రోజు ఆదివారం రెండు సెషన్లలో పరీక్షకు 12,572 మంది హాజరయ్యారు. ఇక రెండవ రోజు సోమవారం రెండు సెషన్లలో 12,343 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో గల సెంట్ మేరీస్ గర్ల్స్ హై స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలి

- సీఎం జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్

**నవతెలంగాణ-కొత్తగూడెం**




ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎస్పీ రోహిత్ రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా మెడల్స్ సాధించడం కంటే ఆటలను ఆడుతూ ఆస్వాదించడంలో ఎంతో ఆనందం దాగి ఉంటుందన్నారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు రాణించి, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ ద్వారా బహుమతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించామని ఇందుకోసం అవసరమైన నిధులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు యువతను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడటం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు ఆటలాడడం ద్వారా మనస్సుకు ఆరోగ్యకరమైన ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులకు మంచి సలహాలు సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని సంబంధిత కోచ్‌లకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యుగంధర్ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరేష్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరందామరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు కమలారాణి, రమేష్, శ్రీధర్, ఉదయ్, కాశీ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## కాసాని లక్ష్మీ నగర్‌కు మౌలిక వసతులు కల్పించండి

- ఎంపీడీవోకి సీపీఐ(ఎం) వినతి

**నవతెలంగాణ-సుజాతనగర్**



కాసాని లక్ష్మి నగర్‌కు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీర్ల రమేష్ అన్నారు. సోమవారం ఆ కాలనీ వాసులతో కలిసి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో భారతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మీ నగర్‌కు పట్టాలిచ్చి సంవత్సరం కావస్తున్నా నేటికీ విద్యుత్, తాగునీరు, రహదారులు వంటివి ఏర్పాటు చేయలేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాట్రాల తిరుపతి రావు, బచ్చలకూర శ్రీను, గండమల్ల భాస్కర్, భూక్య శంకర్, భానోత్ వీరు, శారద, మురిపెటి నాగయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి

- రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

**నవతెలంగాణ-ములకలపల్లి**



ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రామ కమిటీలు ఇండ్ల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా జరగాలని ఇందిరమ్మ ఇండ్లు ప్రతి ఒక లబ్ధిదారుడికి మంజూరు చేసి 5 లక్షలతో నిర్మించి ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా ఎంపిక చేయాలని, రైతు పండించిన ప్రతి పంటకు బోనస్ కల్పించాలని డిమాండ్ చేశారు. మిగిలి ఉన్న రైతు రుణాలను తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజ, ఊకంటి రవికుమార్, గుగ్గల ఆదినారాయణ,నిమ్మల మధు, మంచాల సారయ్య, కుంజా రామ్మూర్తి, గుగులోతు రవీందర్, సోయం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష తగదు

- జీతాలు పెంచకుంటే సింగరేణి డేను బ్లాక్ డేగా జరుపుతాం
- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్

**నవతెలంగాణ-కొత్తగూడెం**



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా, కోల్ ఇండియా వేతనాలు ఇస్తామని హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం వల్ల సింగరేణి కార్మికులపై వివక్షత చూపడం ఎంతవరకు సమంజసం అని సింగరేణి యాజమాన్యాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పని ప్రాంతాల్లో జరిగిన సభలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఎస్సీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడారు. పర్మినెంట్ కార్మికుల వలె పనిచేస్తూ సింగరేణి అభివృద్ధిలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న లాభాల వాటలో తమ వంతు కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జీతాలు పెంచకుండా వారి జీవితాలతో చెలగాటమాడటం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం అయినప్పటికీ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా డిసెంబర్ 23న నిరసన దినాలుగా తెలుపాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఎస్సీకేఎస్ పిలుపు నిచ్చిందని ఆయన అన్నారు. ప్రతి సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు విధిగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాల్లో పాలు పంచుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు భూక్య రమేష్, వినయ్, నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్

- అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

**నవతెలంగాణ-కొత్తగూడెం**



సికింద్రాబాద్ డివిజన్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా నామినేటెడ్ అయిన వై.శ్రీనివాస్ రెడ్డి (భద్రాచలం రోడ్) కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ని సందర్శించి అధికారులతోపలు అంశాలను సమస్యలను చర్చించి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాస్ రెడ్డిని రైల్వే అధికారులు యూనియన్ నాయకులు స్వాగతించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కరోనాలో రద్దయిన కొలహపూర్ ఎక్స్ప్రెస్, కాజీపేట్, డోర్నకల్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని భద్రాచలం రైల్వే లైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని కొత్తగూడెం కేంద్రంగా కొవ్వూరు రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం నుండి తిరుపతికి ప్రత్యేక స్పెషల్ ట్రైన్ ఏర్పాటు చేయాలని, మణుగూరు నుండి డోర్నకల్ వరకు మంజూరైన డబుల్ రైల్వే ట్రాక్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఏరియా ఆఫీసర్ మీనా మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్ మీనా, ఏరియా ఇన్‌స్పెక్టర్ పాషా, స్టేషన్ సివిల్ ఇంజనీర్ జావేద్, సికింద్రాబాద్ డివిజన్ యూనియన్ ప్రెసిడెంట్ కాజాబాబా, కాంగ్రెస్ నాయకులు బాల ప్రసాద్, రాజేష్, శ్యామ్, మాజీ స్టేషన్ మాస్టర్ చలం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకానికి హంగులు

- రైన్ వాటర్, స్టూడియో పంచతంత్ర బృందాలతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**



జిల్లాలో దర్శనీయ స్థలాలను పర్యాటకంగా గుర్తించడానికే రైన్ వాటర్, స్టూడియో పంచతంత్ర బృందాలతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసి సమకూర్చవలసిన పర్యాటకానికి సంబంధించిన హంగులను తయారు చేయడానికి విస్తృతంగా బృందాలు పర్యటించడం జరుగుతుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. అందులో భాగంగానే పర్యాటక రంగానికి అనువుగా ఉన్న దుమ్ముగూడెం మండలంలోని బొజ్జుగుప్ప గ్రామంలోని టూరిస్టులు దర్శించే స్థలాలను బృందం సభ్యులతో కలిసి పరిశీలించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా ఈ గ్రామాన్ని సందర్శించేలా ప్రత్యేకంగా రెండు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేస్తామని, వచ్చే టూరిస్టులకు ప్రకృతిలో దొరికే ట్రెడిషన్ వంటకాలు, పాతకాలపు కట్టడాలు, సామాన్లు, పాత ఇండ్లు, వచ్చే టూరిస్టులకు గ్రామంకు వచ్చే బంధువుల వలే అతిథి మర్యాదలు చేసే విధంగా గిరిజనులకు సూచనలు ఇస్తున్నామని, వచ్చిన వారికి ఘటక, బొద్దుకూర, పచ్చ జొన్న, తెల్ల జొన్న ఉసలు, సీజన్‌ను బట్టి అడవిలో దొరికే పరిగి పండ్లు, తునికి పండ్లు, పాల పండ్లు, నిక్కర్ పండ్లు, ముంజలు, పాతకాలపు ఎడ్ల బండ్లు, చింత చెట్టు దగ్గర పాతకాలపు ఊయలలు, ఆర్చరీ ఆటలు, చెరువులో పడవ ప్రయాణం, రాత్రిపూట గిరిజన సాంప్రదాయమైన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. టూరిస్టులకు మైమరిపించేలా అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించి గిరిజన మ్యూజియంను పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి బృందం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ వారికి తెలిపారు.

అనంతరం కలెక్టర్, బృందం సభ్యులు గిరిజనులతో కలిసి ఆటపాటలు, ట్రెడిషన్ వంటకాలు రుచి చూసిన తర్వాత తప్పకుండా ఈ గ్రామంను ట్రైబల్ మ్యూజియంను పర్యాటక స్థలంగా గుర్తించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, వెలుగు ఏపీఎం హేమంతిని, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు పుస్తకాల వితరణ

**నవతెలంగాణ-కొత్తగూడెం**

సుజాతనగర్ మండలంలోని నిమ్మల గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ భాషా సామర్థ్యాలు, గణిత సామర్థ్యాల పెంపుదలకై ప్రత్యేకంగా రూపొందించబడిన పుస్తకాల వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.విద్యార్థులందరూ భాషా సామర్థ్యాలను, గణిత సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. ముఖ్యంగా తెలుగు భాష , ఆంగ్ల భాష, గణిత భాషలలో సామర్థ్యాలను పెంపొందించుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉన్నదని, తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహ ఉపాధ్యాయులు ఎండి.షఫీ అహ్మద్, పుస్తకాల ప్రత్యేక ప్రతినిధి జానపాటి మాణిక్యరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మణుగూరు ఓసీ వల్ల పొంచి ఉన్న ప్రమాదం

- రోగాల బారిన రాజుపేట విఠల్ రావు నగర్ ప్రజలు
- అభివృద్ధి లేక అవస్థలు

**నవతెలంగాణ-మణుగూరు**

మణుగూరు ఓసీ కారణంగా ప్రమాదం పొంచి ఉన్నదని రాజుపేట విఠల్ రావు రావు నగర్ ప్రజలు తీవ్ర అనారోగ్య పాలవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.అయోధ్య చారి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మణుగూరు ఓసీ బ్లాస్టింగ్ కారణంగా ఇల్లు కూలిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. సింగరేణి, ప్రభుత్వాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆ గ్రామాల నుండి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. విపరీతమైన బొగ్గుచూర, దుమ్ము దూలితో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ప్రజల ప్రాణాలు గాల్లో తేలి ఆడుతున్నాయని అన్నారు. తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని అయన హెచ్చరించారు. మణుగూరు మున్సిపాలిటీనీ రద్దుచేసి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, మున్నా, లక్ష్మీకుమారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూమి నిర్వాహకులకు డబుల్ ఇండ్లు ఇవ్వాలి

- నిర్వాసితులతో కలిసి తహసీల్దార్‌కు సీపీఐ(ఎం) వినతి

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



భూమి నిర్వాహకులకు డబుల్ ఇండ్లు ఇవ్వాలని నిర్వాసితులతో కలిసి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ... పట్టణంలో ఐటీడీఏ వెనుక రాజీవ్ నగర్ కాలనీలోని మనుబోతుల చెరువు నందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం సందర్భంగా అక్కడ నివాసం ఉంటున్న 14 కుటుంబాలకు చెందిన ఇండ్లను తొలగించి నిర్మాణం చేపట్టారన్నారు. తొలగించిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని ఆనాడు బాధ్యతల్లో ఉన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్‌డీఓ శివన్నారాయణ రెడ్డి, ఎంఆర్ఓ రామకృష్ణ ఐటీడీఏ ఏఈ గోపాల్‌లు ఆనాటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య సమక్షంలో చర్చించి ఇల్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తయ్యాక మొదటగా మీకే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు ప్రభుత్వ అధికారులు ఇండ్లు మొత్తం తొలగించి ఆ స్థానంలో డబుల్ బెడ్ రూమ్‌ఇండ్లు నిర్మించారని కానీ నిర్వాసితులను ఇండ్లు కేటాయించలేదన్నారు. గత తొమ్మిది ఏండ్లుగా అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు నిర్వాసితులు వినతి పత్రాలు అందించడం జరుగుతుందని అయినా వారికి ఇండ్లు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వాస్తవ వాస్తవాలను విచారించి బాధితులుగా ఉన్న నిర్వాసితులకు ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకరికంటి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు అలవాల రాజా, నిర్వాసితులు బంటు రామకృష్ణ, వెట్టి చిలకమ్మా, కళావతి, సావిత్రి, హిమాంబి, గంగమ్మ, నాగమణి, వీరమ్మ పాల్గొన్నారు.



## సర్వేలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మెన్

**నవతెలంగాణ-దమ్మపేట**

మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వాసం రాణి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే జారే ఆది నారాయణ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలికాని ప్రసాద్, రెడ్డిమల్ల చిట్టినాయన, కురం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ఐడీఓ సంస్థ ఔదార్యం

**నవతెలంగాణ-అశ్వాపల్లి**



శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఐడీఓ సంస్థ మండలంలోని మర్కోడు గ్రామం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేసి ఔదార్యాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా ఐడీఓ సంస్థ ఎడ్యుకేషన్ ఫెసిలిటేటర్ రామారావు మాట్లాడుతూ.. వెనుకబడిన ఆదివాసీ విద్యార్థులను చలి నుండి కొంత రక్షణ కల్పించాలనే సేవా దృక్పథంతో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీఓ సంస్థ డాక్టర్ నవేందర్, డైరెక్టర్ కపిల్, లక్ష్మణ్, లీలా కృష్ణ, ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈసం ముత్తయ్య, వార్డెన్ ఈసం రవీందర్, ఉపాధ్యాయులు డి.బాలకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బస్సు జాతాకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం




ఆషా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ అసెంబ్లీ సమావేశాలలో కావలసిన బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్‌లో ప్రారంభమైన బస్సు జాతాకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఆఫీసులో విడుదల చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణా ఆషావర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు దుబ్బా ధనలక్ష్మి, పూనెం ఝాన్సి, తోళ్ల జయమ్మ, మనీలా, కె.విజయ, సిఐటియూ నాయకులు ఎంవి. అప్పారావు పాల్గొన్నారు.



## జగన్మోహన్ రెడ్డికి బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డ్

నవతెలంగాణ-మణుగూరు

బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డును మణుగూరు శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్ రెడ్డి అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ వారు న్యూఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో మణుగూరుకు చెందిన శ్రీ విద్యాభ్యాస (పూర్వ బాలవెలుగు) పాఠశాల నిర్వాహకులు బండ జగన్ మోహన్ రెడ్డికి దివంగత జాతీయ నేత కాన్షీ రామ్ సోదరీమణి బీబీ స్వరణ్ కౌర్ జీ, ఢిల్లీ శాసనసభ్యులు వికేష్ రవి జీ, మునీర్ సింగ్ పచ్చ, అతిథులు ఆహ్వానితుల నడుమ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ... ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవటం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, సామాజిక కార్యకర్తలకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అవార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. అవార్డు గ్రహీత సేవలను ప్రత్యేకించి మణుగూరు సమీప గ్రామాలలోని వలస గొత్తి కోయల విద్యార్థులను, నిరుపేద గిరిజనుల, గిరిజనేతరుల విద్యార్థినీ, విద్యార్థులను, బాల కార్మికులను చేరదీసి వారికి వసతి సౌకర్యంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించి, ప్రభుత్వ ప్రవేశ పరీక్షల ద్వారా ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులను గురుకుల పాఠశాలలో చేర్పించి వారి ఉన్నతికి పాటుపడుతున్న రెడ్డి నిస్వార్థ సేవలను గుర్తించి అత్యంత ప్రతిష్టాత్మక "బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డును ప్రశంస పత్రాన్ని అందజేయడంతో పాటు అతిథుల చేత సత్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత బి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ అవార్డు తనలో ఆత్మస్థైర్యాన్ని, బాధ్యతలను మరింత పెంచిందని, ఈ ప్రోత్సాహంతో చదువుకు దూరమైన మరి ఎంతోమంది పేద విద్యార్థులకు మరింత చేరువయ్యే విధంగా తన సేవలను మరింత విస్తృతపరిచే విధంగా వారి ఉన్నతికి శ్రీ విద్యాభ్యాస బృందం మరింత కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అవార్డును ప్రకటించి తను ఎంతగానో ప్రోత్సహించిన బహుజన సాహిత్య అకాడెమీ సంస్థకు జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, సిఫారసు చేసిన జిల్లా అధ్యక్షురాలు నల్లా జ్యోతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవార్డును తన అమ్మానాన్నలకు అంకితం ఇస్తున్నట్లుగా జగన్మోహన్ రెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రమణియన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎం.గౌతమ్, సిద్ధార్థ సుమన్, ఏ.ప్రవీణ్, రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి నల్లా జ్యోతి, రెడ్డి బంధువు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీతారామచంద్ర స్వామి దేవస్థాన నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఖమ్మం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. గత కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన దేవాలయ పాలక వర్గం నూతన కమిటీ చైర్మన్ బొర్రా కృష్ణారావు, సభ్యులు తుమ్మా ఉపేందరావు, నెల్లూరి రంగనాయకమ్మ, జిల్లా ఉపేందర్, గుండు వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో నూతన పాలకవర్గం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నెల్లూరి భద్రయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, మామిడి వెంకన్న, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జెరిపోతుల అంజని, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిన వేణు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, కొమరగిరి హనుమంతురావు, షేక్ హుస్సేన్ బీ, నెల్లూరి అప్పారావు, యర్రపు బాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఉమాశంకర్‌ను విడుదల చేయాలి

- పాలేరు డివిజన్ నాయకులు ఆర్.నిశాంత్ డిమాండ్

నవతెలంగాణ-ముదిగొండ

నిరుద్యోగం, వైద్యం డ్రగ్స్ గంజాయి తదితర సమస్యల పరిష్కారానికి పివైఎల్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి చేసిన పివైఎల్ శ్రేణులతోపాటు,ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్షులు మాదారపు ఉమాశంకర్‌ను హైదరాబాద్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటాన్ని పివైఎల్ పాలేరు డివిజన్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. అరెస్టు చేసిన పివైఎల్ శ్రేణులతోపాటు, ఉమాశంకర్‌ను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని పివైఎల్ పాలేరు డివిజన్ నాయకులు రాయబారపు నిశాంత్ డిమాండ్ చేశారు. పోలీసులు ప్రగతిశీల యువజన సంఘం శ్రేణులు, ఉమాశంకర్‌ను విడుదల చేయని యెడల ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## విద్యుత్ స్తంభానికి మంటలు

నవతెలంగాణ ఖమ్మం




ఖమ్మం నగరంలోని ఇందిరానగర్లో విద్యుత్ స్తంభానికి మంటలు అంటుకున్నాయి. చెత్తను తగలబెడుతుండగా పైన ఉన్న నెట్ కేబుల్ వైర్లకు మంటలు వ్యాపించాయి. పక్కనే పలు షాపింగ్ మాల్స్ ఉండటంతో స్థానికులు, నిర్వహకులు భయాందోళనలకు గురయ్యారు. సకాలంలో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అర్పివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా విజయకుమార్

నవతెలంగాణ కల్లూరు



కల్లూరు మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కొడిసాని విజయకుమార్ జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. గత ఆరు సంవత్సరాల నుండి యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ మండలాల్లో యూటీఎఫ్ సంఘాన్ని బలోపేతం చేసేందుకు విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి సత్తుపల్లి లో జరిగిన జిల్లా మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా పదోన్నతి పొందారు. జిల్లా కార్యదర్శి పొందిన విజయ్ కుమార్ ను యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రికి ముక్కోటి ఉత్సవాల ఆహ్వానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవపేతంగా నిర్వహించే ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజకి దేవాదాయ కమిషనర్ శ్రీధర్‌కు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర ఆలయ ఈవో ఎల్.రమాదేవి నేతృత్వంలో ఆహ్వాన పత్రికలను సోమవారం అందించారు. ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రత్యేకతను తెలియజేస్తూ ఉత్సవాలకు హాజరవాలని కోరారు. అనంతరం ఉత్సవాల ప్రచార గోడపత్రికలను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ప్రసాదాన్ని సైతం మంత్రికి తదితరులకు ఈవో రమాదేవి అందించి ఆలయ అర్చకులచే మంత్రికి ఆశీర్వాదొచ్చినం ఇప్పించారు.

# ఆర్టీసీలో అంతా ఆయన ఇష్టం..!

### ఎమ్మెల్యే ప్రారంభించారు డీఎం ఎత్తేశారు

- భద్రాచలం డిపో చరిత్రకు కళంకం తెస్తున్న డీఎం వైఖరి
- సామాన్య ప్రయాణికులకు దూరమవుతున్న ఆర్టీసీ రథచక్రాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్







నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతం. దక్షిణ భారతంలోనే ప్రసిద్ధిగాంచిన దివ్య క్షేత్రం భద్రాచలం.... ఇది ఒక భాగమైతే మరోపక్క తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఆదివాసి గిరిజనులు అత్యధికంగా నివసించే ఏజెన్సీ ప్రాంతం. ఇంతటి ప్రాధాన్యత గల భద్రాచలానికి ప్రతిరోజు దేశ నలుమూలల నుండి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం అదేవిధంగా ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు రైల్వే సర్వీస్ ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని దశాబ్ద కాలం నుండి రాజకీయ పక్షాలతో పాటు ప్రజా సంఘాలు అభ్యుదయభావాదులు ఓ పక్క ఉద్యమిస్తుంటే ఉన్న ఆర్టీసీ సౌకర్యాలను కూడా ఓ అధికారి తన ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ ఈ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ ప్రగతి రథచక్రాలను దూరం చేస్తున్నారు. భద్రాచలం నియోజకవర్గానికి ముగ్గురు ప్రజాప్రతినిధులు, అదేవిధంగా ముగ్గురు మంత్రుల ఆశీస్సులు ఉన్న ఆ అధికారి నియంతృత్వ వైఖరిని నియంత్రించలేని ఫలితంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ సేవలు దూరమవుతున్నాయని స్పష్టమవుతుంది. ఎంతో చరిత్ర గల భద్రాచలం ఆర్టీసీ డిపోకి గతంలో ఎంతోమంది డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రశంసలు పొందారు. రామయ్య ఇలాకలో కొలువులు చేయటం మహాభాగ్యంగా భావించి ఈ ప్రాంతం నుండి తరలి వెళ్లాలంటే భారమైన హృదయాలతో ఈ ప్రాంత ప్రజలతో మలేసుకున్న బంధాలను వదులుకోలేక తప్పని పరిస్థితులలో వెళ్లిన అధికారులు ఎంతోమందిని చూసిన ఈ ప్రాంత ప్రజలు ప్రస్తుత డిపో మేనేజర్ తిరుపతి వైఖరితో ఆర్టీసీ ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. గతంలో భద్రాచలం నుండి బిహెచ్ఈఎల్ కూకట్ పల్లికి నడిచే సర్వీస్‌లను డ్రైవర్లకు మూడు డ్యూటీలు ఇవ్వాల్సివస్తుందన్న నేపంతో భద్రాచలం నుండి ఎంజీబీఎస్ వరకే సర్వీస్‌లను కుదించిన ఫలితంగా ఈ ప్రాంతం నుండి నిమ్స్ ఆస్పత్రికి వెళ్లే రోగులకు అదేవిధంగా మాదాపూర్, మైత్రివనం, హైటెక్ సిటీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలకు భద్రాచలం నుండి వెళ్లే విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతూ తప్పని పరిస్థితులలో ఆర్టీసీకి నమస్కారం పెట్టి ప్రైవేట్ ట్రావెల్స్‌ని నమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మరోపక్క భద్రాచలం నుండి చెన్నైకి వెళ్లే సర్వీస్ను కూడా రద్దు చేసి ఆర్టీసీకి తగ్గిన కిలోమీటర్ల దూరాన్ని ఎయిర్ బస్ సర్వీసులతో టార్గెట్లను పూర్తిచేసే ప్రయత్నాలను అడ్డదారిలో కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. జిల్లాలో మణుగూరు డిపో కొత్తగూడెం డిపో సర్వీసులు కూకట్పల్లి బిహెచ్ఎల్ వరకు నడుస్తుంటే ఎప్పటినుండో భద్రాచలం డిపో నుండి వెళ్లే సర్వీసులు రద్దు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో పేరూరు నుండి కుకట్ పల్లి వరకు సర్వీస్ నడిపిన చరిత్ర గల భద్రాచలం ఆర్టీసీ డిపో ప్రస్తుత డిఎం వైఖరితో తిరోగమనములో పయనిస్తున్నారటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

### ఎమ్మెల్యే ప్రారంభించిన సర్వీస్‌ని రద్దు చేసిన డిపో మేనేజర్

భద్రాచలం దివ్య క్షేత్రానికి సుదీర్ఘ ప్రాంతాల నుండి తరలివస్తున్న భక్తులకు తోడు ఈ ప్రాంత ప్రజల సౌకర్యాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు భద్రాచలం నుండి బిహెచ్ఈఎల్ ఏసీ స్లిపర్స్ సర్వీస్‌ని ప్రారంచారు. ఎమ్మెల్యే ప్రారంభించారన్న కనీస గౌరవం కూడా లేకుండా పట్టుమని పది రోజులు కూడా గడవకముందే ఆ సర్వీస్లను కుదించి భద్రాచలం నుండి మహాత్మా గాంధీ బస్టాండ్ వరకే పరిమితం చేయటమే కాకుండా దాదాపు రెండుసార్లు బీహెచ్ఈఎల్ సర్వీసులను పునర్దించాలని ప్రత్యక్షంగా ఎమ్మెల్యేనే ఆదేశించినప్పటికీ ఆ అధికారి పెడచెవిన పెట్టి ఆ సర్వీసులను పునరుదించకపోగా ఎమ్మెల్యే ప్రారంభించిన ఏసి స్లీపర్ సర్వీసులు కూడా కుదించి తన నియంతృత్వ వైఖరిని డిపో మేనేజర్ తిరుపతి చాటుకున్నారంటే ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులపై డిపో మేనేజర్ వైఖరి స్పష్టం అవుతుంది. ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం నుండి ప్రతిరోజు ఎంతోమంది వివిధ ఆరోగ్య సమస్యలతో నిమ్స్ ఆసుపత్రికి తరలి వెళ్లాలంటే ప్రైవేట్ భారం మోయలేక ఆర్టీసీను నమ్ముకునే ప్రణీకులతో పాటు మాదాపూర్ కూకట్పల్లిలో విద్యను అభ్యసించే విద్యార్థులు హైటెక్ సిటీలో కొలువులు చేసే సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఆర్టీసీకి దూరమవుతున్న పరిస్థితి పై పలు ప్రజా సంఘాలు పలు రాజకీయ పార్టీలు డిఎం దృష్టికి తీసుకొచ్చినప్పటికీ ఆ అధికారి ఏమాత్రం స్పందించడం లేదని తెలుస్తుంది.

ఏజెన్సీ ప్రాంత రాజకీయ పార్టీలపై ఉన్న చులకన భావంతో డిపో మేనేజర్ వహిస్తున్న నిర్లక్ష్య వైఖరిని పలు రాజకీయ పార్టీలు బహిరంగనే విమర్శిస్తున్నాయి. జిల్లాకు ముగ్గురు మంత్రులతో పాటు భద్రాచలం నియోజకవర్గానికి అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్, ముగ్గురు ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ఓ అధికారి తన నియంతృత వైఖరితో సామాన్య ప్రజలను ప్రత్యేకించి ప్రభుత్వ రంగ సంస్థలనే నమ్ముకునే సామాన్య ప్రయాణికులను ఆర్టీసీకి దూరం చేస్తున్న ఆ అధికారిని ఇక్కడ అక్కడ అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు నియంత్రించలేకపోతున్నారన్న ఆవేదనలో ఈ ప్రాంత ప్రజలు విస్మరాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్
- ఏడు రోజుల నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు

నవతెలంగాణ-పాల్వంచ



రాష్ట్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సీఐటీయూ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సమగ్ర శిక్షాకార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రతి సంవత్సరం రింగేజ్ చేసుకునే పద్ధతిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మార్పు అంటే టీఎస్‌ను టీజీగా, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చటం కాదని మార్చాల్సింది కార్మికులు, ఉద్యోగుల జీవితాలను, అందుకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాట తప్పితే కార్మికులు ఉద్యోగులు పోరాట బాట పడతారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన కార్మికులకు, ఉద్యోగులకు ఏ ప్రయోజనాలు కల్పించలేదని విమర్శించారు. ఏమి సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ తరపున సంఘీభావం తెలియజేసిన వారిలో జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి కోశాధికారి జి.పద్మ ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్, సహాయ కార్యదర్శి కె.సత్య జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ సత్ర పల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనం అమలుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి డిమాండ్
- మధ్యాహ్న భోజన కార్మికుల 48 గంటల ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ





తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకునెలకు పదివేల రూపాయల వేతనం అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో రూ.10 వేల వేతనం అమలుపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో 48 గంటల కలెక్టరేట్ ఎదుట ధర్నాను ప్రారంభించి కె.బ్రహ్మాచారి మాట్లాడారు. కార్మికులకు ఏం ప్రయోజనాలు కల్పించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారో ముఖ్యమంత్రి, మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరల విపరీతంగా పెరుగుతుంటే మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు ఎందుకు పెంచటం లేదని నిలదీశారు. పదివేల రూపాయల వేతనాన్ని తక్షణం అమలు చేయాలని, ప్రతి కార్మికురాలికి పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం రెండు జతల కాటన్ చీరలు యూనిఫాంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కోత పెడుతుందని విద్యార్థుల సంఖ్యకుతగినవిధంగా నాణ్యమైన పోషకాహారం అందించేందుకు వీలుగా నిధులు కేటాయింపును పెంచాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది. రెండు రోజుల ధర్నాలో పాల్గొనేందుకు ప్రతి మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు దోసెడు, బియ్యం పిడికెడు కందిపప్పు, మంచి నూనె ఇతర నిత్యావసర సరుకులు తీసుకొచ్చి వంట వార్పు నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు 48 గంటల ధర్నాకు 500 మందికి పైగా కార్మికులు హాజరయ్యారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జె.రమేష్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పద్మ, సుల్తానా, జిల్లా ఆఫీస్ బేరర్స్ పిట్టల అర్జున్, దొడ్డ రవికుమార్, కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, సత్రపల్లి సాంబశివరావు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ నాయకురాలు రామలక్ష్మి, వెంకట నరసమ్మ, సమ్మక్క, నిరోష, తిరుపతమ్మ, శివమ్మ, రమ, నాగమణి అనసూయ, శైలజ, కళావతి లక్ష్మి, నన్ని కుమారి తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీలకు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వండి

- దశల వారి పోరాటాలకు వెనకాడబోము
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా

నవతెలంగాణ-చర్ల



మండల వ్యాప్తంగా ఉన్న 22 ఆదివాసీ గ్రామాల గిరిజనులకు షెడ్యూల్ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలని, లేకపోతే దశల వారి పోరాటాలకు వెనకాడబోమని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్‌కు 22 గ్రామాల ఆదివాసులతో కలిసి మెమోరండం అందించి ఆయన మాట్లాడారు. ఆదివాసీ గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీలకు ఓటు హక్కు కల్పించి తమ ఓట్లను సద్వినియోగపరుచుకునే రాజకీయ నాయకులకు, విద్యా వైద్యం తాగు సాగునీరు అందించే అధికారులు ఆదివాసీల బతుకు భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలు తీసుకోవట్లేదని ఆయన విమర్శించారు.

అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్య వరకు చదువుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ సదువుల కోసం వెళ్లేందుకు అవసరమైన షెడ్యూల్ తెగ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో అటు ప్రభుత్వం ఇటు ప్రభుత్వ అధికారులు, పాలకులు ఇష్టానికి ప్రవర్తిస్తున్నారన్నారు. దీని వల్ల ఆదివాసీల భవితవ్యం అగమ్యగోచరంగా ఉందదన్నారు. ఇప్పటికే ఉన్నత చదువులు చదివి ఉద్యోగరీత్యా స్థిరపడాల్సిన సమయంలో షెడ్యూల్ తెగ కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడం వలన ఆదివాసీ యువత నిరుద్యోగులుగా మారుతున్నారని మచ్చా మండిపడ్డారు. 50 ఏండ్లకు పై పడి జీవనం సాగిస్తున్న ఈ గిరిజనులను వలసవాదులని ఎక్కడి నుంచో వచ్చారని వీరి వలన రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని గతంలో పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీలకు షెడ్యూల్ తెగ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా నిలుపుదల చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పారని, మునుముందు అదే కోణంలో ఆలోచిస్తే ఏ ప్రభుత్వానికైనా ఈ ఆదివాసీలు బుద్ధి చెప్పక తప్పదని ఆయన జోష్యం చెప్పారు. ఇకనైనా కలెక్టర్ స్థాయి అధికారులు ఆదివాసీలపై దృష్టి సారించి షెడ్యూల్ తెగ కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే 22 గ్రామాల ప్రజలను సమీకరించి ఆందోళన చేయడం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పొడుపుకంటి సమ్మక్క, దొడ్డి హరినాగ వర్మ, పామారు బాలాజీ, ఊడుగుల సరోని, వరదాల వరలక్ష్మి, ఆదివాసీ యువత మడకం చందు, ఉంగయ్య, జోగయ్య, గంగయ్య, రవ్వ సురేందర్, కారం రాజు, మడకం సోను, పద్దం జోగయ్య, తెల్లం దాడయ్య, మడకం లక్ష్మయ్య, పోడియం బన్నీ, కట్టం లక్ష్మయ్య, మడవి సత్యం రావు, పోడియం బాబురావు, దేవయ్య, కుంజం మంగయ్య, తోపాటు పెద్ద ఎత్తున ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను ప్రభుత్వం ఏర్పడ్డాక పక్కన పెట్టిందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.కె ఉమర్ ఆరోపించారు. సోమవారం స్థానికంగా జరిగిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ 50 శాతం మంది రైతులు రుణమాఫీకి నోచుకో లేదన్నారు. పాత రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి వరికూటి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సీపీఐ పక్ష నేతగా జమలయ్య

- ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిల్ సిపిఐ పక్ష నాయకుడిగా రామవరం ఏరియా, పంజాబ్ గడ్డ, 8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు జమలయ్యను సిపిఐ పక్ష నాయకుడిగా నియమిస్తూ సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా జారీచేసిన ఆమోద లేఖను సిపిఐ పక్ష కౌన్సిలర్ బృందం సోమావారం కొత్తగూడెం మున్సిపల్ కమిషనరుకు అందించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ తనను సిపిఐ పక్షాన నేతగా ఎంపిక చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషాకు ధన్యవాదాలు తెలిపారు. కూనంనేని సహకారంతో కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సహా కౌన్సిలర్ల సహకారంతో ప్రజా సమస్యలను సేకరించి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి పరిస్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రమాదవశాత్తు వైరా నదిలో పడి వలస కూలి మృతి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో వైరా నదిలో ఓ వలస కూలి పడి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు. ఎస్ఐ తలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ లోనే దిండోరి జిల్లాలోనే గోకల్ దులహరి, మహాద్వాని బ్లాక్‌కు చెందిన బిర్సింగ్ (55) అనే వలస కూలి ఈనెల 14వ తేదీన బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోనే వైరా నదిలోకి వెళ్లాడు. వైరా నదిలోకి వెళ్లిన బిర్సింగ్ ప్రమాదవశాత్తు నదిలోని కొట్టుకుపోయాడు. సహచర వలస కూలీలు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం మధ్యాహ్నం వైరా నదిలోకి వెళ్లిన సమీపంలోనే బిర్సింగ్ మృతదేహం లభ్యమయింది. మృతుని తండ్రి సుఖిల్ సింగ్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వైరా నది నుంచి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# నవతెలంగాణ

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

9

మంగళవారం | డిసెంబర్ 17, 2024 | www.navatelangana.com


## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నవతెలంగాణ-అశ్వాపురం**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరులోని శేషగిరి నగర్ గ్రామానికి చెందిన కేధం లింగమూర్తి (49) తన ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం నుండి ఇంటికి వెళ్తుండగా సరిగ్గా మొండికుంట సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే అశ్వాపురం సీఐ జి.అశోక్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల రెండు ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలి

**- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**

**నవతెలంగాణ-పాల్వంచ**

పాల్వంచ కేటీపీఎస్‌లో రెండు 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను వెంటనే మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాల్వంచలో ఉన్న కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం తెలంగాణకే తలమానికంగా వుండేదని, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కేటీపీఎస్ ప్రధాన పాత్ర పోషించిదని అటువంటి కేటీపిఎస్‌లో పాత ప్లాంట్‌ను దశల వారీగా తొలగించడంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. కొత్త ప్లాంట్ల నిర్మాణం కోసం అవసరమైన సుమారు 500 ఎకరాల భూమి కేటీపిఎస్‌లో అందుబాటులో ఉందని, అదేవిదంగా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులో ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి కేటీపీఎస్‌కు రెండు 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను మంజూరు చేయాలని లేనియెడల కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని ప్రజా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, తాటిపాముల హరికృష్ణ, ఈసం మురళి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## లచ్చిగూడెంలో వైద్యశాలను ఏర్పాటు చేయాలి

**- టీడీపీ మండల అధ్యక్షులు కొమరం దామోదర్ రావు**

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య శాఖలపై ప్రత్యేక దృష్టి సారించినందున మండలంలోని పూర్తి ఆదివాసీ గ్రామమైన లచ్చి గూడెంలో వైద్యశాలను ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు కొమరం దామోదర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మారాయి గూడెం, చెరుపల్లి, కొమ్మనాపల్లి, తిత్తిగుప్ప, అడవి రామవరం, పత్తిపాక, ఎర్రబోరు, తదితర 21గ్రామాలతో పాటు, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని అత్యంత చేరువలో ఉన్న బస్తరుమారాయిగూడెం, పాలవంక, చంద్రి గూడెం గ్రామాలు ప్రతీ 2 సంవత్సరాలకు ఒకసారి మారాయిగూడెంలో జరిగే సమ్మక్క సారలక్క జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులతో పాటు రామచంద్రునిపేట, కొత్తపల్లి, ఆశ్రమ పాఠశాల్లోని విద్యార్థినీ, విద్యార్థులు, సుమారు 15 వేల జనభా కలిగి ఉన్న ఈ గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యం అందుబాటులో లేకపోగా వైద్య సేవల కోసం ఈ ప్రాంత ప్రజలు ఏపీలోని లక్ష్మీపురం వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వెళ్లాల్సి వస్తుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రాథమిక ఆస్పత్రుల్లో ఈ పై 21 గ్రామాలకు మధ్యస్థంగా ఉన్న లచ్చిగూడెంలో ప్రాథమిక వైద్యశాలను మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కెల్లా వేణు, సోందె వీరాస్వామి, కల్లూరి ప్రసాద్, లక్ష్మయ్య, అపకా శ్రీరాములు, రేసు సుజాత, కళ్యాణి, తదితరులు ఉన్నారు.

## మహాసభల విజయవంతానికి కమిటీలు జయప్రదానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఏజె రమేష్**

**నవతెలంగాణ-ఇల్లందు**

డిసెంబర్ 20, 21 తేదీల్లో ఇల్లందులో జరిగే సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభల విజయవంతానికి కమిటీలు వేశామని, జయప్రదానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాలంటీర్లు కీలక బాధ్యత వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఏజె రమేష్ పిలుపునిచ్చారు. ఏలూరి లక్ష్మి నారాయణ భవన్‌లో మంగళవారం మహాసభల నిర్వహణకు వాలంటీర్ల శిక్షణతో పాటు వివిధ నిర్వహణ కమిటీలని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు జిల్లా లోని అన్ని మండలాల నుండి ప్రతినిధులు హాజరైవుతారని వారికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు తమ వంతు పాత్ర వహించాలని అన్నారు. ఇల్లందు పట్టణంలో ఎర్ర తోరణాలతో, జెండాలతో అలంకరణ చేయాలనీ అన్నారు. వసతుల కల్పనకు వివిధ కన్వీనింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీలో బోనకల్ నుంచి నలుగురికి స్థానం



**జిల్లా కార్యదర్శిగా గుగులోతు రామకృష్ణ**

**నవతెలంగాణ - బోనకల్**

టీఎస్ యుటిఎఫ్ జిల్లా మహాసభలు సత్తుపల్లిలో రెండు రోజులపాటు జరిగాయి. ఈ మహాసభలలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలోకి బోనకల్ మండలం నుంచి నలుగురికి స్థానం దక్కింది. మండల పరిధిలోని రావినూతల గ్రామ నివాసి, పెద్ద బీరవల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా బోనకల్ స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గార్లపాటి చిన్న రంగారావుని, చిరునోముల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కే.సౌభాగ్యలక్ష్మిని, బోనకల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సద్దా బాబుని జిల్లా కమిటీ సభ్యులుగా స్థానం దక్కించుకున్నారు. జిల్లా కమిటీలోకి ఎన్నికైన నలుగురికి టీఎస్ యుటిఎఫ్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి

**సబ్ కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి**

**నవతెలంగాణ-కారేపల్లి**



డోర్నకల్ – భద్రాచలం రోడ్ వరకు డబ్లింగ్ రైల్వే స్పెషల్ ప్రాజెక్టు కోరకు భూ సేకరణ చట్టబద్ధంగా జరగటం లేదని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మంలో కలెక్టరేట్‌లో భూ సేకరణ ఉప కలెక్టర్ రాజేశ్వరిని కలిసిన బాధితులు తమ గోడు వినిపించారు. భూ సేకరణకు రైల్వే, రెవిన్యూ శాఖలు నిర్వాసితులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సేకరణకు ఏకపక్షంగా పేపరు ప్రకటన ఇచ్చి నిర్వాసితులను అందోళనకు గురిచేసిందన్నారు. సింగరేణి మండలంలో సింగరేణి రెవిన్యూ గ్రామంలో బహిరంగ మార్కెట్‌లో ఎకర భూమి రూ.కోటి పలుకుతుందని, ఇంటి స్థలం గజం రూ.15 వేలు పలుకుతుందని అధికారులకు వివరించారు. అధిక విలువ, రెండు పంటలు పండే భూములు కోల్పోవటం వలన తమ జీవనాధారం కోల్పోతామని ఆవేదన వెలిబుచ్చారు. భూములు కోల్పోతున్న తమకు ఉద్యోగ, ఉపాధీ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రైతులు కోటి అప్పారావు, ముక్కా వెంకటేశ్వర్లు, ముండ్ల ఏకాంబరం, తొగరు శ్రీను, ఇస్లావత్ వీరమ్మ సోమందుల వెంకటేశ్వర్లు, హుస్సెన్, కొమ్మూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీలు ఇందిరమ్మ మహిళా శక్తి పథకానికి దరఖాస్తు చేసుకోండి

- ఈ నెల 31 వరకు గడువు
- మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా

**నవతెలంగాణ-పాల్వంచ**

రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ పేద మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్లు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే 18 నుండి 55 సంవత్సరాల వయస్సు కలిగి, ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ కార్డుతో పాటు కనీస విద్యార్హత 5వ తరగతి కలిగి ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఇవి రెండూ లేని వారు గ్రామీణ ప్రాంతాలలోని వారైతే రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షల లోపు ఆదాయ ధృవీకరణ పత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి పొంది ఉండాలన్నారు. అర్హత కలిగిన మహిళలు తమ పాస్ పోర్టు ఫొటోతో డిసెంబర్ 31లోపు tgobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకై 85208 60785 నంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

# సింగరేణి దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

**నవతెలంగాణ-కొత్తగూడెం**



సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఆధ్వర్యంలో ఈనెల 23న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో 'అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే సింగరేణి దినోత్సవ ప్రధాన వేడుకలకు సింగరేణి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ హాజరైతారని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కన్వీనర్ కె.శ్రీనివాస రావు తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి ప్రకాశం స్టేడియం వరకు జరిగే సింగరేణి రన్, అనంతరం ప్రకాశం స్టేడియం నందు సింగరేణి సేవా సమితి సభ్యులచే ఏర్పాటు చేసే స్టాల్స్‌లో సేవా సభ్యులు తయారుచేసే వస్తువుల ప్రదర్శనలో సింగరేణి సేవా మహిళలు చురుగ్గా పాల్గొనాలని, అదేవిధంగా సేవా మహిళల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయనున్నామన్నారు. సోమవారం హెడ్డాఫీస్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు డి.హరిణి సత్యనారాయణ, జి.సునీతా వేంకటేశ్వర రెడ్డిలతో సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించే వృత్తి శిక్షణా కోర్సుల వివరాల గురించి, 1జనవరి 2025 నుండి హైదరాబాద్ నాంపల్లి గ్రౌండ్ నందు 45 రోజులపాటు నిర్వహించే ఎగ్జిబిషన్ నందు సింగరేణి సేవా సమితి ద్వారా ఏర్పాటు చేసే స్టాల్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, వెల్ఫేర్ పిఏ కే.వర ప్రసాద రావు, సేవా కో-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్,సేవా సెక్రెటరీ కె.సుజాత, సేవా సభ్యులు పాల్గొన్నారు.

**జీఎం ఆఫీస్ మహిళా ఉద్యోగులకు దీపాలంకరణ పోటీలు**

సింగరేణి డే పురస్కరించుకుని కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, గౌతంపూర్ సేవ సభ్యులకు జీఎం ఆఫీస్ మహిళా ఉద్యోగులకు సింగరేణి దినోత్సవ వేడుకలు-2024 పురస్కరించుకొని సోమవారం రుద్రంపూర్ ప్రగతి వనంలో దీపాలంకరణ (ముగ్గుల) పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ జి. మధురవాణి షాలేం రాజు హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. రుద్రంపూర్, గౌతమ్ పూర్, త్రీ ఇంక్లైన్ లోని బెస్ట్ ఎన్విరాన్మెంట్ హౌస్ కొరకు రిజిస్ట్రేషన్ ఎంచుకున్న హౌస్లను బెస్ట్ ఎన్విరాన్మెంట్ హౌస్ కమిటీ మెంబర్ డిజిఎం (ఐఈడి) ఎన్.మోహన్, సీనియర్ పిఓ ఎం.మురళి, సివిల్ ఇంజనీర్ రాజారామ్ సందర్శించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందిన వారికి 23వ తేదీ సింగరేణి డే సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సేవా ప్రెసిడెంట్ జి.మధురవాణి షాలేం రాజు, పద్మజా రాణి కోటి రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) కె.హన సమలత, ఎం.హేమలత మురళి, డిజిఎం (ఐఈడి) ఎన్.మోహన్, సీనియర్ పిఓలు, ఎం.మురళి, జి.సంఘ మిత్ర, సివిల్ ఇంజనీర్ రాజారాం, సేవ సెక్రటరీలు అనిత, సేవ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.





## రూరల్ నుంచి సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కమిటీలోకి ఎనిమిది మంది

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**

మండలంలోని ఏదులాపురం గ్రామంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించిన సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ మహాసభలో ఖమ్మం రూరల్ మండలం నుంచి ఎనిమిది మందికి చోటు దక్కింది. మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన పార్టీ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి, ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన జిల్లా కమిటీ సభ్యుడు నండ్ర ప్రసాద్, ఆరేంపుల గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ పెరుమళ్ళపల్లి మోహన్‌రావు, కామంచికల్లు గ్రామానికి చెందిన ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పెద్దతండా పంచాయతీ పరిధిలోని నాయుడుపేటకు చెందిన నందిగామ కృష్ణ, ఎం. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన వడ్లమూడి నాగేశ్వరరావు, తెల్దారుపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల సుమతి, కస్నాతండా గ్రామానికి చెందిన భూక్య నాగేశ్వరరావులను డివిజన్ కమిటీ సభ్యులుగా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**మహాసభ విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు..**

ఏదులాపురంలో నిర్వహించిన పార్టీ పాలేరు డివిజన్ ఎనిమిదవ మహాసభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పార్టీ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన వారికి, సీపీఎం నాయకులకు, కార్యకర్తలకు పార్టీ మండల కమిటీ తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

# మావోయిస్టు ఇలాకాలో హెూం మంత్రి అమిత్ షా

- బీజాపూర్ జిల్లా గుండం బేస్ క్యాంపు సందర్శన
- గ్రామస్తుల సమస్యలు విని, అధికారులకు సూచనలు

**నవతెలంగాణ-చర్ల**



భారతదేశ హోం శాఖ మంత్రి అమిత్ షా అత్యంత దండకారణ్య ప్రాంతం మావోయిస్టు ఇలాకాలో కలియతిరిగారు. సోమవారం సరిహద్దు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న సుక్మా సరిహద్దులో ఉన్న 153 సిఆర్‌పిఎఫ్ క్యాంపును దేశ హెూం మంత్రి అమిత్ షా సందర్శించారు. ఈ సందర్భంగా అమిత్ షా సైనికులతో కలిసి భోజనం చేశారు. "ఏక్ పెడ్ మా కే నామ్"( అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక గ్రామస్తులతో చౌపల్ ఏర్పాటు చేసి వారి సమస్యలను విన్న.. షా కేంద్ర ప్రభుత్వ పథకాలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. సౌకర్యాలు, కానీ ఇప్పుడు మన జవాన్లు వారి పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ప్రజల కోసం భద్రతా శిబిరం తెరవబడింది, ఇప్పుడు ఇక్కడ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. మావోయిస్టుల కమాండర్ హిడ్మా సొంత గ్రామం పువర్తి మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న గుండం క్యాంపుకు తూర్పున 7 కి.మీ. దూరంలో ఉంది. హిడ్మా అదే అపఖ్యాతి పాలైన మావోయిస్టుల కమాండర్, అతనిపై కోటి రూపాయల కంటే ఎక్కువ రివార్డు ప్రకటించబడింది, అనేక మంది సైనికులు వీరమరణం పొందిన అనేక ప్రధాన మావోయిస్టులు దాడులలో హిడ్మా పాల్గొన్నారని అమిత్ షా పేర్కొన్నారు. ఇక ఈ దండకారణ్య ప్రాంతమైన పామేడ్లో శివరాజ్ పార్టీ హెూమ్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఓ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. మళ్లీ పామేడు సమీపంలో ఇప్పుడు హెూం మంత్రిగా అమిత్ షా పాల్గొనడం విశేషం. గ్రామంలో ఉన్న చిన్నారులతో అమిత్ షా ముచ్చటించడం పలువురిని ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవరాయ్ బీజేపీ నాయకత్వం, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్‌ఓ

**నవతెలంగాణ-ముదిగొండ**

మండల కేంద్రమైన ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్సి)ను జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ సైదులు సోమవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి రికార్డులతో పాటు, ఫార్మసీ, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజల అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మధుసూదన్‌రావు, ఫార్మసిస్ట్ సత్యవతి, స్టాఫ్ నర్స్ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు పాల్గొన్నారు.

## వంగూరి మోషయ్య ధన్యజీవి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

**నవతెలంగాణ- తల్లాడ**



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వంగూరి మోషయ్య సంతాప సభ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం వంగూరి మోషయ్య ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం నాయకులు కళ్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, సత్తెనపల్లి నరేష్ పాల్గొన్నారు.



## క్రీస్తు ఆలయ ప్రతిష్ఠ మహెూత్సవం

- ప్రతిష్టించిన డోర్నకల్ బిషప్ విజయ పద్మారావు

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



దక్షిణ ఇండియా క్రీస్తు సంఘం డోర్నకల్ అధ్యక్ష మండలం ఎన్ఎస్పి గ్రూప్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీస్తు ఆలయ ప్రతిష్ఠ మహెూత్సవాన్ని డోర్నకల్ బిషప్ కే విజయ పద్మారావు రిబ్బన్ కట్ చేసి సోమవారం ఘనంగా ప్రతిష్టించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో నిర్మించిన ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమంలో పలువురు క్రైస్తవ మత పెద్ద లు, గ్రామస్తులు పాల్గొన్నారు. క్రైస్తవ ప్రార్థనల మధ్య రేవ డాక్టర్ కే పద్మారావు, విజయ పద్మారావులు దక్షణ భారత క్రైస్తవ సాంప్రదాయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీస్తు సంఘ సభ్యులు, గ్రామస్తులు, దాతల సహకారంతో దేవుని ఆశీస్సులతో సుమారు 50లక్షల రూపాయల వ్యయంతో వైభవంగా క్రైస్తవ మందిర నిర్మాణానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నీతి గల వ్యక్తిత్వంతో, సమాజంలో సోదర భావంతో క్రైస్తవులు మె లగాలని సూచించారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు అద్భుతమైన చర్చి నిర్మాణం జరిగిందని, నూతన సంవత్సరంలో దయగల దేవుని కృపతో అందరి జీవితాల్లో మార్పులు రావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దాత ఖమ్మం కెఎస్ఆర్ గ్రానైట్స్ అధిపతి జమలాపురం గ్రామానికి చెందిన తుళ్ళూరి కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతులు, పాస్ట్రేట్ చైర్మన్ క్లెమెంట్ శాంతరాజు, ఇంచార్జ్ రవిరత్నరాజు, సభ్యులు ముల్లంగి గాబ్రియేలు, గద్దల రాబర్ట్, బూసిపోగు జీవరత్నం, పాముల లక్ష్మణ్‌రావు, జమలయ్య, బుజ్జిబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకా నగర్‌లో ప్రతిరోజు పంపునీళ్లు ఇవ్వాలి

**నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్**

ద్వారకా నగర్‌లో 53, 56 డివిజన్లో 6 నెలల నుండి రోజు విడిచి రోజు పంపు నీళ్ల వస్తున్నాయని, దీనివల్ల బోరు లేని వాళ్ళు... ఉన్నా నీళ్ల సరిగా రానివారు ఇబ్బంది పడుతున్నారని సోమవారం 53వ డివిజన్ సిపిఎం నాయకులు ప్రజా పాలన కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి కందాల వికాస్ రెడ్డి, వాసిరెడ్డి మల్లికార్జున రావు, జనార్ధన స్వామి తదితరులు పాల్గొన్నారు

## జవాన్‌గా ఎంపికైన వేంసూరు యువకుడు

**అభినందించిన పాఠశాల సిబ్బంది, యువకులు**

**నవతెలంగాణ-వేంసూరు**

భారత్ జవాన్‌గా ఎంపికైన యువకుడు షేక్ సాదిక్‌ను సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం యూత్ నాయకులు ఎండి ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన సాదిక్ వేంసూరు పాఠశాలలో చదువుకుని పట్టుదలతో శిక్షణ తీసుకొని ఎంపిక కావటం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు నరసింహారావుతో పాటు సిబ్బంది, గ్రామస్తులు నరసింహ స్వామి తిరుపతిరావు ఉన్నారు

## రైతు సమస్యలపై సీపీఐ ధర్నా

**నవతెలంగాణ-కారేపల్లి**

రైతు సమస్యలపై సీపీఐ సోమవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. రైతు రుణమాఫీ, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా నుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులందరికి రుణమాఫీ అంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత షరతుల పేరుతో కొర్రీలు పెడుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు తాత వెంకటేశ్వర్లు, ఉంగరాల సుధాకర్, మండల నాయకులు ముత్తినేని మోహన్‌రావు, బట్టు సంగయ్య పండగ వెంకటేశ్వర్లు, గుగులోత్ మంగు, ఇస్లావత్ బావుసింగ్, హర్సింగ్ పాల్గొన్నారు.

## వర్గీకరణపై సీఎంమాట నిలబెట్టుకోవాలి

**నవతెలంగాణ-కారేపల్లి**

ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ పై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన నిలబెట్టుకోవాలని వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఏబిసిడి వర్గీకరణ చేసి మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు టూరుగంటి అంజయ్య మాదిగ లు డిమాండ్ చేశారు. కారేపల్లి అంబేద్కర్‌నగర్‌లో ఎస్సీ వర్గీకరణ పరిణమాలపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదెర్ల అంజయ్య, ఆదెర్ల రామారావు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్దిదారుల ఎదురుచూపులు

**నవతెలంగాణ-కొణిజర్ల**

అదిగో ఇల్లు... ఇదిగో ఇల్లు అంటూ కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఇంతవరకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్దిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు ఇస్తానని నమ్మబలికి పదిసంవత్సరాల కాలంలో ఒక్క ఇళ్లు ఇవ్వకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం అప్పగించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే వ్యవహరిస్తోందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సొంత ఇంటి కల ఇంకా నెరవేరేది ఎన్నడని ఇళ్ల కోసం నిరుపేదలు ఆశగా వేచిచూస్తున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ఆరు గ్యారంటీల కోసం నిర్వహించిన ప్రజాపాలనలో కేవలం ఇందిరమ్మ ఇళ్ల కోసం మండలం నుంచి సుమారు పదివేల పైచిలుకు ప్రజాపాలన దరఖాస్తులో లబ్దిదారులు కోరినట్లు సమాచారం. ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 మాత్రమే ఇస్తానని ప్రకటిస్తుంది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులలో ఆందోళన వ్యక్తమౌతుంది.



ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీని పలు గ్రామాల్లో ప్రజలకు వ్యతిరేకించిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఎవరికి నచ్చినట్లు వాళ్ళు కమిటీలు వేసుకుంటే తామేందుకని కాంగ్రెస్ పార్టీలోనే వర్గవిభేదాలు వచ్చాయి. ఇది ఇలా ఉండగా అక్కడక్కడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో మిలాఖాత్ అయి ఇంటికి యాభై నుంచి లక్ష వసూలు చేయాలని ధర నిర్ణయిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ప్రతి సంక్షేమ పథకానికి లబ్దిదారుల మధ్య పోటిపెట్టి విచ్చలవిడిగా లక్షల్లో డబ్బులు వసూలు చేశామని చెప్పుకుంటున్నట్లు వినికిడి.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు**

ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్దిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ని ఇటీవలే గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అట్టహాసంగా ప్రారంభించిన విషయం విదితమే. ఈ సర్వే బాధ్యత స్థానిక పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించడంతో ఫోన్‌లో ఉన్న యాప్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ పంచాయతీ కార్యదర్శులు సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వే పంచాయతీ కార్యదర్శులకు కత్తిమీద సాములా మారింది. నిజమైన అర్హులకే మాత్రమే ఇందిరమ్మ ఇళ్ళ ఎంపికలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని లబ్దిదారుల ఎంపికలో రాజకీయాలకుతీతంగా చేస్తున్నామని పలువురు పంచాయతీ కార్యదర్శులు నవతెలంగాణతో తెలిపారు.

## ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులు
# డిసెంబర్‌లోగా చెల్లించాలి

- అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రత్యేక ప్రస్తావన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిసెంబర్‌లోగా ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించే విధంగా మంత్రివర్గం నిర్ణయించి, చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. సోమవారం శాసనమండలిలో ఈ అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ ఈ-కుబేర్ పెండింగ్స్ 2022 ఆగస్టు నుంచి ఉన్నాయని తెలిపారు. 2022 జనవరిలో ప్రకటించిచన డీఏ ఎరియర్స్ కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 2023 డిసెంబర్ వరకు సగానికి పైగా బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోయయని పేర్కొన్నారు.

జీపీఎఫ్ లోను/పార్ట్ ఫైనల్స్, సరెండర్ బిల్లులు, మెడికల్ రీ-యింబర్స్ మెంట్ బిల్లులు, డీఏ ఎరియర్స్‌తో పాటు 2024 మార్చి నుంచి రిటైర్ అయిన వారి పెన్షనరీ బెనిఫిట్స్ బకాయిలోనే ఉన్నాయన్నారు. ఈ పెండింగ్ బిల్లులన్నింటిని 2024 డిసెంబర్ లోగా చెల్లిస్తామని గతంలో జేఏసీకి చెప్పారని గుర్తుచేశారు.

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు
### 010 ద్వారా జీతాలివ్వాలి

మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు చెల్లించాలనీ, హెల్త్ కార్డులు జారీ చేయాలని రెండో బ్యాచ్‌లో నియమించబడిన వారికి నోషనల్ సర్వీసు వర్తింపజేయాలనీ, ప్రిన్సిపల్, పీజీటీ పోస్టుల్లో పదోన్నతులు ఇవ్వాలని అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు శాసనమండలి చైర్మెన్ ద్వారా పిటీషన్ సమర్పించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ పే ప్రకారం జీతాలు చెల్లించాలనీ, నైట్ డ్యూటీల కొరకు కేర్ టేకర్లను నియమించాలనీ, హెల్త్ కార్డులు జారీ చేయాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు.

# 21వరకే అసెంబ్లీ!

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్, సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరయ్యారు.15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలంటూ బీఆర్ఎస్, బీజేపీ పట్టుపట్టాయి. ప్రభుత్వం మాత్రం శుక్రవారం వరకే సమావేశాలు జరుగుతాయని చెప్పినట్టు తెలిసింది. దీంతో బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. టీ షర్ట్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీశ్‌రావు ప్రశ్నించారు.బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ గంటసేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్టు తెలిపారు. సభను ముఖ్యమంత్ర నాలుగైదు రోజులే నడిపే మూడ్‌లో ఉన్నారు. మమ్మల్ని అడ్వయిజ్ మాత్రమే ఇవ్వాలని కోరారని తెలిపారు. అయితే బీఏసీ నుంచి బీఆర్ఎస్, ఎమ్ఐఎం వాకౌట్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీ, గత పదేండ్లలో అందరి ఆలోచనల ప్రకారమే బీఏసీలో చర్చ జరుగుతుందన్నారు. సభ ఎన్ని రోజులు జరపాలనేది అనేది స్పీకర్ నిర్ణయమన్నారు. గత పదేండ్లలో వట్టి చాయ్ బిస్కెట్ తాగి వచ్చారా? ఈ వారం రోజులు సభ జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. స్పీకర్‌ను బీఆర్ఎస్, ఎంఐఎం అవమానించిందని విమర్శించారు.

# ఆశా వర్కర్లకు స్థిర వేతనం చెల్లించాలి

## సంఘం రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి .. ఆసిఫాబాద్, మంచిర్యాలలో బస్సు జాత



నవతెలంగాణ-ఆసిఫాబాద్, మంచిర్యాల

రానున్న ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థిర వేతనం రూ.18వేలు నిర్ణయించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై నిర్వహిస్తున్న బస్సు జాత సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కొనసాగింది. ఉదయం జాత ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరిన సందర్భంగా స్థానిక ఆరే సంక్షేమ సంఘ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. ఆశాలకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే వారి సమస్యలపై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు నిరంతరం వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అయినా, కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఆశా వర్కర్లందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు పనిలో ఉండాలని, లేకపోతే పారితోషికాలు తగ్గించి రాస్తామని అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవాల సందర్భంగానైతే 2, 3 రోజులు కుటుంబాన్ని వదిలి హాస్పిటల్ వద్ద ఆశాలు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితులన్నింటి నుంచి వారికి పరిష్కారం చూపాలని, వేతనం పెచాలని కోరుతూ ఈనెల 15న ప్రారంభమైన బస్సు జాత 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని చెప్పారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్సు జాత బృందం సభ్యులు ఎం.బాలమణి, ఎస్.పద్మ, ఆర్.సాధన, పి.గంగామణి, ఆర్.నీలాదేవి, కె.సునీత, యూనియన్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, మంచిర్యాల జిల్లా ఆశా యూనియన్ నాయకులు సమ్మక్క, దాసరి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకె రవి, రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షులు గూమాస ప్రకాష్ పాల్గొన్నారు.

# ఫెడరల్ వ్యవస్థకు జమిలీ వ్యతిరేకం

(మొదటిపేజీ తరువాయి)



సరిదిద్దుకోవాలన్నారు. ఒకేసారి ఐదేండ్లలో జరగాల్సిన అభివృద్ధి గురించి మాట్లాడటం లేదని, ఇచ్చిన హామీల్లో ఈ ఏడాదికి ఐదోవంతు అయినా పూర్తి అయిందా అని ప్రశ్నించారు. రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు సహాయం, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500 లాంటి అనేక హామీల ఊసే లేదన్నారు. ప్రజాస్వామ్య రక్షణగా ఏడో గ్యారంటీ ఇచ్చారని అది ఎక్కడా అమలు కావడం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేసేవారని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పద్ధతుల్లో తమ నాయకులను అరెస్టు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించేది సీపీఐ(ఎం) అన్నారు. ప్రజల పార్టీగా గుర్తించినందుకు సీఎంను కలిసినప్పుడు ధన్యవాదాలు చెప్పానని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి అంశంపైనా ప్రతిపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న ముఖ్య మంత్రి.. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల తదితర విషయాలపై ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీలతో మాట్లా డాలన్నారు. మూసీ పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) అగ్రభాగాన ఉండి పోరాటం చేస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న ప్రక్షాళనను స్వాగతిస్తున్నామని తెలిపారు.

అయితే ప్రభుత్వం ప్రక్షాళన చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయకుం డా హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మూసీ కాలుష్యానికి కారణమైన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, నీటిని కాలుష్యం కాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, కట్ట నర్సింహ, పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పండు, దోనూరు నర్సిరెడ్డి, ఎండి.పాషా పాల్గొన్నారు.

## ఉద్దేశపూర్వక దాడి




(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా న్యాయం లభించినప్పుడే రాజ్యాంగం సక్రమంగా అమలవుతుందని స్పష్టం చేశారు. 1970 నాటి జాతీయీకరణ ప్రక్రియ దేశ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఒక ముఖ్యమైన అడుగని తెలిపారు.

దేశ రాజ్యాంగాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే వాళ్లే ఆర్ఎస్ఎస్‌ను నిర్వహిస్తారని ఆయన విమర్శించారు. జాతీయ జెండాను, అశోకచక్రాన్ని వ్యతిరేకించిన వారు ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని గ్రూపు అని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి అండగా నిలిచారని తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందితే దానిని తగలబెట్టింది ఆర్ఎస్ఎస్ అని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగంపై తన వ్యతిరేకతను బాహాటంగానే వ్యక్తం చేసిందన్నారు. భారత రాజ్యాంగం మనుస్మృతిపై ఆధారపడి లేదన్నది ఆర్ఎస్ఎస్ అభ్యంతరమని వివరించారు. రాజ్యాంగంలో మహిళలకు ఓటు హక్కు కల్పించడాన్ని కూడా ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. గతంలో ఆర్ఎస్ఎస్ నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నారనీ, రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల్లో స్పష్టమైందని తెలిపారు. లోక్‌సభలో నెహ్రూ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను ప్రధాని విమర్శించారనీ, తొలి క్యాబినెట్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ, వల్లభ్‌భాయ్ పటేల్, అంబేద్కర్‌లు ఉన్నారనే విషయాన్ని మోడీ మర్చిపోయారని అన్నారు. ఈ చర్చలో రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ, రణదీప్ సూర్జేవాలా, హర్దీప్ సింగ్ పూరి, వైకో, విజయసాయి రెడ్డి తదితరులు మాట్లాడారు.

## సంక్రాంతి నుంచి రైతు భరోసా?

- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానించారు. అసెంబ్లీ వాయిదాపడిన అనంతరం సోమవారం సాయంత్రం భేటీ అయిన క్యాబినెట్ ఐదు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది.

ఈ సందర్భంగా ఐదు ఆర్డినెన్సులను మంత్రివర్గం ఆమోదించినట్టు సమాచారం. ఆర్వోఆర్ చట్టంతోపాటు ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేసే తీర్మానాన్ని కూడా క్యాబినెట్ ఆమోదించింది.

# జీవో 21ను సవరించాలి

- కనీస వేతన సలహా మండలిలో అన్ని కార్మిక సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలి : సీఐటీయూ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- కలిసి ముందుకెళ్లాలని నిర్ణయం




నవ తెలంగాణ - ముషీరాబాద్

వివక్షాపూరితంగా రెండు కార్మిక సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతన సలహా మండలి జీవో 21ని తక్షణమే సవరించి అన్ని కార్మిక సంఘాలకూ భాగస్వామ్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. జీవో 21పై కార్మిక సంఘాల అభిప్రాయాలను కూడగట్టేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్.రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం..సాయిబాబు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం కోలిండియాలోని జేబీసీసీఐలోను, ఈపీఎఫ్, ఈఎస్ఐ కమిటీలలో ఐఎన్‌టీయూసీ వంటి సంఘాలకు స్థానం కల్పించనప్పుడు సీఐటీయూ చొరవతో అన్ని సంఘాలూ ఐక్యంగా ప్రభుత్వ వైఖరిని ఖండించాయని, రాష్ట్రంలో ఐఎన్‌టీయూసీ ఈ ఆందోళనలో కలిసి వచ్చిందని గుర్తు చేశారు. కనీస వేతన సలహా మండలిలో కూడా అన్ని సంఘాలకూ ప్రాతినిధ్యం కోసం పోరాడాలన్నారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మాట్లాడారు. కనీస వేతన చట్టం - 1948 ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ట్రేడ్ యూనియన్ల నుంచి కనీస వేతన సలహా మండలి కోసం పేర్లను తీసుకున్నదని తెలిపారు. కానీ సలహా మండలిలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీకి మాత్రమే ప్రాతినిధ్యం కల్పించారని, స్వతంత్ర సంఘాల పేరుతో కొందరినే కార్మిక ప్రతినిధులుగా నియమించడం సరైన చర్య కాదన్నారు. తక్షణం ఆ జీఓను సవరించి కోటి మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సంఘాలన్నింటికీ స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకూ అన్ని కార్మిక సంఘాలూ ఈ సమస్యలపై ఐక్యంగా కృషి చేయాలని, ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని కోరారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు మాట్లాడుతూ.. కనీస వేతనాల సలహా మండలిలో ఏఐటీయూసీకి ప్రాతినిధ్యం కల్పించినా ఆ మండలిలో అన్ని సంఘాల ప్రాతినిధ్యం, సహకారం లేకుండా ఏమీ సాధించలేమని ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ అభిప్రాయపడ్డారని చెప్పారు. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నామని, ఉమ్మడి కార్యాచరణలో భాగస్వాములవుతామని తెలిపారు. ప్రభుత్వ ఏకపక్ష చర్యను ఖండిస్తున్నానని, అన్ని యూనియన్లకూ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు ఆందోళనలు చెయ్యాలని ప్రతిపాదిస్తున్నామన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ.. సీఐటీయూ సరైన సమయంలో స్పందించి ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినందున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. విశేష అనుభవం కలిగిన కార్మిక సంఘాల ప్రాతినిధ్యం లేకుండా కోటి మంది కార్మికుల ప్రయోజనాలు ఎలా కాపాడతారో ప్రభుత్వం చెప్పాలని, సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీయూసీఐ నాయకులు ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూ అధ్యక్షులు ఐ.కృష్ణ, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ ఎ.నాగేశ్వరరావు పాల్గొని తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు.

చర్చల అనంతరం ఏ యూనియన్‌లకు ఆ యూనియన్‌లు డిసెంబర్ 21 వరకు వినతిపత్రాలు ఇవ్వాలని, డిసెంబర్ 23న హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఉమ్మడి వినతి పత్రాలు అధికారులకు అందజేయాలని తీర్మానించారు. ధర్నా అనంతరం తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని ప్రకటించారు.

ఆటలు

# కష్టాల్లో టీమిండియా

## భారత్-54/5, వర్షం అడ్డంకి
## ఆస్ట్రేలియా : 445ఆలౌట్




బ్రిస్బేన్: మూడో టెస్టులో టీమిండియా కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 445పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 54పరుగులు చేసింది. మూడోరోజు ఆటకు పలుమార్లు వర్షం అంతరాయంగా నిలిచింది. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి ఇండియా నాలుగు వికెట్లు కోల్పోయి 51 రన్స్ చేసింది. ఆసీస్ పేస్ అటాక్ ముందు.. భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. జైస్వాల్ 4, గిల్ 1, కోహ్లి 3, పంత్ 9 రన్స్ చేశారు. అంతకముందు ఆస్ట్రేలియా ఇవాళ ఉదయం 40 రన్స్ జోడించి 445 రన్స్‌కు ఆల్ అవుట్ అయ్యింది. భారత బౌలర్లలో బుమ్రా అద్భుతంగా బౌల్ చేశాడు. 76 రన్స్ ఇచ్చి అతను ఆరు వికెట్లు తీసుకున్నాడు. ఆసీస్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 88 బంతుల్లో 70 రన్స్ చేశాడు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్.. సెంచరీలు చేసిన విషయం తెలిసిందే. రెండో సెషన్‌లో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. మళ్లీ టీ బ్రేక్ తర్వాత కేవలం 17 బంతులే ఆడిన తర్వాత వర్షం వచ్చింది. లైట్ కూడా డిమ్‌గా ఉండడంతో.. ఆటను రద్దు చేశారు. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ ఒక్కడే స్థిరంగా ఆడాడు. ఆస్ట్రేలియా పేస్ అటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. మిగితా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఎవరూ క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వేగం ముందు భారత బ్యాటర్లు తేలిపోయారు. మేటి బ్యాటర్ కోహ్లీ కూడా ఈజీగా చిక్కేశాడు. భారత్ ఇంకా 394 పరుగులు వెనుకబడి ఉన్నది.

### వరుణుడు అడ్డంకి...

ఆదివారం మ్యాచ్ ముగిసిన తర్వాత బ్రిస్బేన్‌లో వర్షం పడింది. దీంతో సోమవారం ఉదయం మైదానం చిత్తడిగా మారడంతో తొలి సెషన్ ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. ఓవర్ నైట్‌స్కోర్ 7 వికెట్ల నష్టానికి 405పరుగులతో మూడో రోజు ఆట ప్రారంభించిన ఆసీస్ మరో 40 పరుగులు జోడించింది. మిచెల్ స్టార్క్ (18), అలెక్స్ కేరీ దూకుడుగా ఆడారు. అయితే బుమ్రా చక్కటి బంతితో స్టార్క్‌ను ఔట్ చేశాడు. మళ్లీ వరుణుడు ఆటంకపరిచాడు. నాథన్ లైయన్(2) ఐదు ఓవర్లపాటు కాచుకున్నాడు. అతడిని సిరాజ్ బౌల్డ్ చేశాడు. ఇక చివర్లో వేగంగా ఆడేందుకు ప్రయత్నించిన కేరీని ఆకాశ్ దీప్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 445పరుగుల వద్ద ముగిసింది. జస్‌ప్రీత్ బుమ్రాకు ఆరు, సిరాజ్‌కు రెండు, నితీశ్ రెడ్డి, ఆకాశ్ దీప్ తలో వికెట్ తీశారు.

### బుమ్రా ఖాతాలో రెండు రికార్డులు..

ఆస్ట్రేలియాపై అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. ఉమేశ్ యాదవ్ (17 మ్యాచుల్లో 53 వికెట్లు) ముందున్నాడు. మాజీ దిగ్గజ క్రికెటర్ కపిల్ 51 వికెట్లతో ఉన్నాడు. అయితే, బుమ్రా కేవలం 10 టెస్టుల్లోనే 50కు పైగా వికెట్ల మార్కును దాటాడు. గబ్బా వేదికపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన భారత బౌలర్‌గా మారాడు. ఎర్రాపల్లి ప్రసన్న (6/104)ను బుమ్రా అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో బుమ్రా 78 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు.

### స్కోర్‌బోర్డు...

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 445ఆలౌట్

**ఇండియా తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి)మిచెల్ మార్ష్ (బి)స్టార్క్ 4, కెఎల్ రాహుల్ (బ్యాటింగ్) 33, గిల్ (సి)మిచెల్ మార్ష్ (బి)స్టార్క్ 1, కోహ్లి (సి)క్యారీ (బి)హేజిల్‌వుడ్ 3, పంత్ (సి)క్యారీ (బి)కమిన్స్ 9, రోహిత్ శర్మ (బ్యాటింగ్) 0, అదనం 1. (17 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 51పరుగులు.

**వికెట్ల పతనం:** 1/4, 2/6, 3/22, 4/44

**బౌలింగ్:** స్టార్క్ 8-1-25-2, హేజిల్‌వుడ్ 5-2-17-1, కమిన్స్ 2-0-7-1, లియాన్ 1-0-1-0, హెడ్ 1-0-1-0

# పెండింగ్ బకాయిలు చెల్లించాలి



రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పితే పోరాటాలను ఉధృతం చేస్తాం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా

నవతెలంగాణ-విలేకరులు

మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 48 గంటల నిరసన దీక్షలను సోమవారం కలెక్టరేట్ల ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, విద్యార్థులకు వంట చేసి పెడుతున్నామని తెలిపారు. దాంతో కార్మికులు అప్పులపాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో కార్మికులు ధర్నా చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కలెక్టరేట్ ఎదుట దీక్షను ప్రారంబించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో రూ.10 వేల వేతనం అమలుపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

# అభిషేక్, ప్రణీత్ అగ్రస్థానం

## జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ: జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అభిషేక్ వర్మ-ప్రణీత్ కౌర్ సత్తా చాటారు. కాంపౌడ్ పురుషుల, మహిళల ర్యాంకింగ్స్ రౌండ్‌లో వీరు అగ్రస్థానంలో నిలిచారు. ఈ క్రమంలో అభిషేక్ వర్మ 714పాయింట్లతో జాతీయ రికార్డును సమం చేయగా.. మహిళల విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ(709) పేర ఉన్న రికార్డు పదిలంగా ఉంది. మహిళల విభాగంలో ప్రణీత్ కౌర్, మధుర 355పాయింట్లతో సమంగా ఉన్న క్రమంలో.. ఫలితం కోసం పర్ఫెక్ట్ టెన్‌ను నిర్దేశించగా.. ప్రణీత్ 59పాయింట్లతో విజయం సాధించగా... మధుర 2వ స్థానానికి పరిమితమైంది. తొలిరోజు పోటీలు ముగిసేసరికి పురుషుల వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ(ఢిల్లీ) 714 అగ్రస్థానంలోఉండగా.. కుందేరు వెంకటాద్రి(సర్వీసెస్(710 పాయింట్లు), ప్రథమేశ్(707పాయింట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మహిళల విభాగంలో ప్రణీత్(పంజాబ్) 707పాయింట్లు అగ్రస్థానంలో నిలువగా.. మధుర(మహారాష్ట్ర) 707పాయింట్లు, జస్వీర్ కౌర్(రైల్వేస్) 703పాయింట్లు రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.



# అట్టడుగు ప్రజల ఆశాజ్యోతి

**డాక్టర్ మంజు కుమారి... ఓ విద్యా శాఖ అధికారి. అందరు ప్రభుత్వ ఉద్యోగుల్లా ఎలాంటి కష్టం లేకుడా హాయిగా జీవితాన్ని గడపొచ్చు. కానీ ఆమె ఆలోచనలు వేరే ఉన్నాయి. సమాజానికి తన వంతుగా ఏదో చేయాలని తపించారు. తన తండ్రి నుండే ప్రేరణ పొంది ఆర్థికంగా వెనకబడిన పిల్లలకు విద్యా అవకాశాలు అందించాలని అడుగులు ముందుకేశారు. వారి జీవితాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు. తన అధికారిక విధులకు మించి వారికి సేవ చేస్తున్నారు. సామాజిక సేవ పట్ల ఆమెకున్న అంకితభావమే ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ఎంతో శ్రమిస్తున్న ఆమె పరిచయం...**

తన పరిసర ప్రాంతాలను సాధ్యమైంత వరకు మెరుగుపరచడమే మంజు కుమారి లక్ష్యం. ఆ సామాజిక బాధ్యతతోనే బీహార్ విద్యా శాఖ అధికారిగా ఉన్న ఆమె రోహ్తాస్ జిల్లాలో, ముఖ్యంగా నక్సల్ ప్రభావిత తిలౌతు బ్లాక్‌లో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారు. బ్లాక్ రిసోర్స్ సెంటర్ (BRC) ఇన్‌చార్జ్‌గా ఆమె తన అధికారిక విధులకు మించి, ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన పిల్లలను ప్రేరేపించడానికి, వారిని విద్యావంతులను చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నారు.

### సొంత నిధులతోనే...

సాధారణంగా చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు తమ పని తాము చేసుకొని సమయానికి ఇంటికి వెళ్లిపోతారు. కానీ మంజు కుమారి అలా కాదు. ఆఫీసు పనివేళల తర్వాత ఇంటికి వెళ్లరు. ఆఫీస్ పని ముగించుకున్న తర్వాత సాయంత్రాలు గ్రామాలను సందర్శించడానికి వెళతారు. పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలతో పాటు ఇతర స్టడీ మెటీరియల్ లేని పిల్లలను గుర్తించి వారికి పంపిణీ చేస్తారు. దీని కోసం ఆమె తన జీతం నుండే నిధులు సమకూర్చు కుంటారు. ఇలా ఆమె కనీసం ప్రాథమిక విద్య కూడా అభ్యసించలేని నిరుపేద విద్యార్థుల కోసం అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. అయితే తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు అవసరమ్యే నిధుల కోసం ఎన్‌జీవోలపై ఆధారపడరు.

### తండ్రి నుండి ప్రేరణ

సామాజిక సేవ పట్ల నిబద్ధత ఆమెకు చిన్ననాటి నుండే ఉంది. ఆమె తండ్రి శివ శంకర్ షా జీవించి ఉన్నప్పుడు రోహ్తాస్‌లోని చందన్‌పురా మాజీ ముఖియా (పంచాయత్ హెడ్)గా చేసేవారు. ఆయన నుండే ఈమె ప్రేరణ పొందారు. 'మా నాన్న సమాజానికి సేవ చేయడం, కొత్త పాఠశాలను స్థాపించడానికి భూమి, వనరులను అందించడం వంటివి బాగా చేసేవారు. నాలో సామాజిక బాధ్యతను నింపింది ఆయన ఆలోచనలు, పనులే. మా నాన్న స్థాపించిన పాఠశాల ఇప్పటికీ పనిచేస్తోంది' అని మంజు గుర్తుచేసుకున్నారు. తన తండ్రి నుండి పొందిన స్ఫూర్తితో ఆమె సమాజం కోసం, పేదల కోసం అంకిత భావంతో పని చేస్తున్నారు.

### వ్యక్తిగత జీవితంలో...

ఎంతో మంది పేద పిల్లలకు మంచి భవిష్యత్ చూపుతున్న మంజు కుమారికి చిన్నతనంలోనే వివాహం జరిగింది. అయితే ఆ వివాహ బంధం ఎక్కువ కాలం నిలబడలేదు. వ్యక్తిగత జీవితంలో అనేక పోరాటాలు చేశారు. ఆ పోరాటల నుండే ఆమె తన లక్ష్యంపై దృష్టి పెట్టారు. హింసాయుతమైనా బంధం నుండి విడిపోయి తిరిగి వివాహం చేసుకున్నారు. ఇప్పుడు తన భర్త నుండి ఆమె పూర్తి మద్దతు పొందుతున్నారు. తన ఇద్దరు పిల్లలను పెంచి పెద్దచేశారు. వారిద్దరూ ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు.

### విధులకు మించి

డిగ్రీ, పోస్ట్-గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన తర్వాత ఆమె రాంచీ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత తన వృత్తిపరమైన ప్రయాణం మొదలుపెట్టారు. డెహ్రీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (+2)లో ఒక దశాబ్దానికి పైగా హిందీ పాఠాలు బోధించారు. 2023లో BRC ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. ఈ కొత్త బాధ్యత సేవ చేయాలని నిత్యం తపించే మంజు కుమారికి మరింత స్వేచ్ఛను ఇచ్చింది. అడ్మినిస్ట్రేటివ్ విధులకు మించి ఆమె స్థానిక పాఠశాలలను తనిఖీ చేస్తారు. పాఠశాలల్లో సరైన పారిశుధ్యం కల్పించడంలో తన వంతు సహకరిస్తున్నారు. చదువు విషయంలో విద్యార్థులను ప్రేరేపిస్తున్నారు. తన పరిమిత వనరులలోనే పిల్లలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 'ఇప్పుడు నిజమైన వైవిధ్యం తీసుకువచ్చేందుకు నాకు సమయంతో పాటు ఓ వేదిక కూడా ఉంది' అంటూ ఆమె పంచుకున్నారు.

### మంచి ఫలితాలిచ్చాయి

మంజు కుమారికి చదువు పట్ల ఉన్న మక్కువ కేవలం బీహార్‌కే పరిమితం కాలేదు. రాంచీలో నివసిస్తున్నప్పుడు ఆమె కొంతకాలం పాటు ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. అక్కడ ఆమె గిరిజన కాలనీలను సందర్శించారు. ఆ పిల్లలు ఎప్పుడూ పాఠశాలకు వచ్చే వారు కాదు. అలాంటి పిల్లలను గుర్తించి వారందరినీ ఓ దగ్గరకు చేర్చి పాఠాలు చెప్పేవారు. ఆమె ప్రయత్నాలు ఆ సంఘాల్లో మంచి ఫలితాలను ఇచ్చాయి. 'వారి వద్దకే వెళ్లి నేను పాఠాలు చెప్పడం మొదలుపెట్టిన తర్వాత తల్లిదండ్రులు చివరికి తమ పిల్లలను పాఠశాలకు పంపడం ప్రారంభించారు, ఇది నేను సాధించిన గొప్ప విజయంగా నేను భావించాను' అని ఆమె అన్నారు.

### అడ్డంకులు తప్పలేదు

సేవా దృక్పథంతో ఆమె ప్రారంభించిన ఈ ప్రయాణానికి అడ్డంకులు తప్పలేదు. ప్రారంభంలో ఆమె ప్రయత్నాలకు అత్తమామలు, మొదటి భర్త నుండి ప్రతిఘటన ఎదురైంది. ఆమె తన సామాజిక సేవను కొనసాగించకుండా నిరుత్సాహ పరిచారు. అయితే వారి నుండి ఎంత వ్యతిరేకత వచ్చినా ఆమె పట్టుదలతో ఉన్నారు. 'సేవా కార్యక్రమాల్లో నా ప్రయాణం అంత సులభం కాదు. కానీ నేను ఆగిపోవడానికి ఒప్పుకోలేదు. కచ్చితంగా నా ప్రయత్నం కొనసాగించాలని బలంగా నిర్ణయించుకున్నాను' అని ఆమె పంచుకున్నారు. ప్రజల్లో తగ్గిపోతున్న సామాజిక బాధ్యత, నైతిక విలువల క్షీణతపై ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మారుతున్న పరిస్థితుల వల్ల ప్రజలు వ్యక్తిగత లాభాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. సమాజానికి తమ వంతు సాయం చేయాలనే ఆలోచన పెద్దగా ఉండడం లేదు. అందుకే మా కమ్యూనిటీలలో సేవా స్ఫూర్తిని, సామాజిక నిబద్ధతను పునరుద్ధరించాలని నేను భావిస్తున్నాను' అంటూ ఆమె తన మాటలు ముగించారు. ■



## ప్రతి ఏడాదీ హెల్త్ చెకప్

క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. కనీసం ఏడాదికి ఒక్కసారైనా ఫుల్ బాడీ చెకప్ చేసుకోవాలని సిఫారసు చేస్తున్నారు. ముందుగానే పరీక్షలు చేయించుకుంటే ఏవైనా సంభావ్య అనారోగ్య సమస్యలను ప్రారంభంలోనే గుర్తించవచ్చు, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవచ్చు. అయితే మన ఆరోగ్యానికి సంబంధించి అనేక రకాల పరీక్షలు ఉంటాయి. వీటన్నింటినీ ఒక్కొక్కటిగా చేసుకునే బదులు, ఒకేసారి ఫుల్ బాడీ చెకప్ చేయించుకుంటే చాలా ప్రయోజనం. అవేంటో ఎందుకో ఒకసారి చూద్దాం.

ఫుల్ బాడీ చెకప్ అనేది మీ శరీరంలోని వ్యవస్థలన్నింటి ఆరోగ్యాన్ని అంచనా వేసే ఒక సమగ్రమైన పరీక్ష. ఇందులో భాగంగా రక్త పరీక్ష, మూత్ర పరీక్ష, మల పరీక్ష, మధుమేహం పరీక్ష, థైరాయిడ్ పరీక్ష, శారీరక పరీక్షలు సహా ఇతర రోగనిర్ధారణ పరీక్షలు అన్నీ చేస్తారు. దీంతో మీ శరీరంలో ఏ చిన్న సమస్యనైనా గుర్తించే వీలు ఉంటుంది, తద్వారా ఏవైనా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు, సమర్ధవంతంగా చికిత్స చేయడం సాధ్యపడుతుంది. తద్వారా మీరు మీ ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది.

### వ్యాధులను ముందస్తుగా గుర్తిందానికి

ఫుల్ బాడీ స్కాన్ ద్వారా వ్యాధులను వాటి ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు, ఇది మీకు చికిత్స విజయవంతం కావడానికి, మీరు వేగంగా కోలుకోవడానికి అవకాశాలను మెరుగుపరుస్తుంది.

### తీవ్రమైన అనారోగ్య సమస్యల నివారణ

రెగ్యులర్ చెకప్‌లు గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.

### మీ ఆరోగ్యంపై సమగ్ర అంచనా

పూర్తి బాడీ చెకప్ ద్వారా మీ శారీరక , మానసిక ఆరోగ్యంతో సహా మీ సంపూర్ణ ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర అంచనాను అందిస్తుంది.

### దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నియంత్రణ

హైపర్‌టెన్షన్, డయాబెటీస్ వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న వారికి, ఈ రెగ్యులర్ చెక్-అప్‌లు వారి పరిస్థితిని నియంత్రించడానికి, అనారోగ్యం నుంచి కోలుకోవడానికి సహాయపడతాయి.

### క్యాన్సర్‌ను సైతం జయించవచ్చు

క్యాన్సర్‌ను దాని ప్రారంభ దశలోనే గుర్తించడం వలన ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు, రెగ్యులర్ చెక్-అప్‌ల ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి, అది మరింత అభివృద్ధి చెందకుండా విజయవంతమైన చికిత్స తీసుకోవడానికి, క్యాన్సర్ వ్యాధిని జయించటానికి అవకాశం ఉంటుంది. ■

---

## పార్లమెంట్‌కు పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంక గాంధీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మరోసారి పార్లమెంటు వద్ద అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే అదే సమయంలో వివాదం కూడా చోటు చేసుకుంది. సోమవారం పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఓ ప్రత్యేక బ్యాగ్‌తో ప్రియాంక అక్కడికి వచ్చారు. దానిపై 'పాలస్తీనా ' అనే రాతలు ఉండటం, ఆ ఫొటోను కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ షామ మహమ్మద్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేయడం వివాదానికి దారితీసింది. దయ, న్యాయనిబద్ధత, మానవత్వానికి ఇది సంకేతమని, జెనీవా కన్వెన్షన్‌ను ఎవరూ ఉల్లంఘించరాదనే సందేశం ఇందులో ఉందని ఆయన అన్నారు. కాగా, ఇది ముస్లింలను బుజ్జగించే చర్యగా బీజేపీ సర్వసాధారణంగా చేసే విమర్శలే చేసింది. ప్రియాంక గాంధీ ఒక ప్రత్యేక బ్యాగ్‌తో పాలస్తీనాకు తన సంఘీభావం తెలిపినట్టు ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు. తూర్పు పాకిస్థాన్‌పై మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్ శక్తులను ఓడించిన 'విజయ్ దివస్' రోజు హమాస్ వంటి సంస్థలకు ప్రియాంక మద్దతు చెప్పడం మంచి అభిరుచి కాదని మరొకరు విమర్శించారు. పాక్‌పై భారత్ విజయాన్ని ప్రతిబింబించే అంశంతో ప్రియాంక వచ్చి ఉంటే బాగుండేదని ఇంకొకరు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఇందిరా గాంధీ మనుమరాలైన ప్రియాంక గతంలో కూడా గాజాపై ఇజ్రాయిల్ చర్యను వ్యతిరేకిస్తూ పాలస్తీనీయులకు సంఘీభావం ప్రకటించారు. కేరళలోని వాయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలుపును ఢిల్లీలోని పాలస్తీనా కార్యాలయ ప్రతినిధి అబెడ్ ఎల్రాజెగ్ అబు జజెర్ ఇటీవల అభినందించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై గత జులైలో ప్రియాంక విమర్శలు గుప్పిస్తూ, గాజాలో ఇజ్రాయిల్ ప్రభుత్వం నరమేధం సాగిస్తోందని తప్పుపట్టారు. యుఎస్ కాంగ్రెస్‌లో ఇజ్రాయిల్ చర్యను సమర్థించుకుంటూ నెతన్యాహు ఉపన్యసించిన వెంటనే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో జరుగుతున్న ఊచకోతలకు పౌరులు, తల్లులు, తండ్రులు, వైద్యులు, నర్సులు, సహాయక వర్కర్లు, పాత్రికేయులు, టీచర్లు, రచయితలు, సీనియర్ సిటిజన్లు, వేలాది మంది అమాయక పిల్లలు ప్రతిరోజూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. విద్వేషం, హింసను ఇష్టపడని ఇజ్రాయిల్ పౌరులతో సహా, ప్రతి ఒక్కరికీ ఈ నరమేధాన్ని ఖండించాల్సిన నైతిక బాధ్యత ఉందని ఒక ట్వీట్‌లో ఆమె పేర్కొన్నారు. నాగరికత, నైతికతకు కట్టుబడే ప్రపంచంలో ఇజ్రాయిల్ చర్యలు ఆమోదయోగ్యం కావని అన్నారు.

## రైతుల ట్రాక్టర్ మార్చ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. పంజాబ్-హర్యానా మధ్యనున్న శంభూ సరిహద్దులో రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా భద్రతా బలగాలు అడ్డుకుంటుండటంతో వారు అక్కడే మకాం వేసి ఆందోళన చేస్తున్నారు. సోమవారం పంజాబ్ నుంచి రైతులు ర్యాలీగా ట్రాక్టర్లపై శంభూ బార్డర్‌కు బయలుదేరారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు శంభూ బార్డర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశాయి. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లను మరింత పెంచారు. పంటకు కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్ల పరిష్కారం కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్నారు. కానీ కేంద్ర సర్కారు మాత్రం వారి ఆందోళనను పట్టించుకోవడం లేదు. పైగా పోలీసులతో వారిపై దాడి చేయిస్తోంది. కాగా, కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 18న పంజాబ్‌లో రైల్‌రోకో నిర్వహించనున్నట్టు రైతులు ఇప్పటికే హెచ్చరించారు.హర్యానాలో నిరసనలు తెలుపుతున్న రైతులు సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో అంబాలాలో ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఖనౌరి, శంభు సరిహద్దుల వద్ద రైతులు క్రమశిక్షణతో పట్టుదలతో ఆందోళన చేస్తున్నారు. రైతులు తమ ట్రాక్టర్లపై జాతీయ త్రివర్ణ పతాకాలను, తమ సంఘాల జెండాలతో కట్టి ముందుకు సాగారు. అంబాలా రోడ్లకు ఒకవైపున ప్రజలు రాకపోకలు సాగించడంతో రెండు మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంది.

**పంజాబ్‌కు మద్దతుగా హర్యానాలో రైతుల ట్రాక్టర్ మార్చ్**

ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న పంజాబ్ రైతులకు సంఘీభావం తెలుపుతూ కైతాల్, హిసార్, పానిపట్ సహా పలు జిల్లాల్లో రైతులు ట్రాక్టర్ మార్చ్ చేపట్టారు. వివిధ గ్రామాల రైతులు కలయత్ పట్టణంలోని కిసాన్ చౌక్ వద్దకు చేరుకున్నారు. సోమవారం ఉదయం కైతాల్‌లో ఎస్‌డీఎం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించారు. మార్చ్ అనంతరం, గత 11 నెలలుగా రెండు సరిహద్దుల్లో కొనసాగుతున్న నిరసనపై ప్రధాని మోడీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అంబాలాలో రైతులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎంఎస్పీకి చట్టపరమైన హామీతో సహా 13 డిమాండ్లను లేవనెత్తుతూ దల్లేవాల్ స్వయంగా ప్రధానికి బహిరంగ లేఖ రాశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ధ్వజమెత్తారు.

## నేడు జమిలీపై బిల్లు..!

### బీజేపీ ఎంపీలకు విప్ జారీ

### గతంలో మాదిరిగా మూజువాణి ఓటింగా..లేక జేపీసీకి సిఫారసా..?

**న్యూఢిల్లీ:** పార్లమెంటు సమావేశాలు ముగిసేలోపు జమిలీపై బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్రంలోని బీజేపీ యత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

ఓవైపు ఇప్పుడు కాదని సంకేతాలిస్తూనే.. మరోవైపు బీజేపీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశిస్తూ లోక్‌సభలో తమ ఎంపీలందరికీ విప్ జారీ చేసింది. మంగళవారం (డిసెంబర్ 17న) ప్రతి ఒక్కరూ లోక్‌సభకు హాజరు కావాలని సూచించింది. లోక్‌సభలో కీలక అంశాలపై చర్చ జరగనున్నందున గైర్హాజరు కావొద్దంటూ మూడు లైన్ల విప్‌ను జారీ చేస్తూ లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డా సంజయ్ జైస్వాల్ ఓ లేఖను విడుదల చేశారు. ఈ నేపథ్యంలోంచి చూస్తే.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లును పార్లమెంటు ముందుకు మంగళవారం తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లు ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో మంగళవారం మధ్యాహ్నం ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. అయితే జమిలీ ఎన్నికలనిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించేలా స్పీకర్‌ను కోరే అవకాశం ఉండవచ్చని ప్రతిపక్షాలు అనుకుంటున్నాయి.

## నేలకొరిగిన వీరపుత్రుడు

(మొదటిపేజీ తరువాయి)

నాయక్ తమ్మునిగా సాయుధ పోరాటంలో అన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ విరోచిత పోరాటాలు నిర్వహించారంటూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్ ఆయన మృతికి సంతాపం తెలిపారు.

## ఫార్ములా వన్ కేసుపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

చర్చించామని అన్నారు. కేటీఆర్ అరెస్టు గురించి తానేమీ చెప్పలేననీ, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. అరెస్టులకు సంబంధించి తాను పేల్చిన బాంబు తుస్సుమందంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారనీ, అలాంటప్పుడు వారు ఢిల్లీ చుట్టూ ఎందుకు చక్కర్లు కొట్టారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో మాట్లాడేందుకు ఏమీ లేనందువల్లే ఆ పార్టీ ఎమ్మెల్యేలు గుండాల్లా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'మెజారిటీ' వ్యాఖ్యపై చర్య

### వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వండి : అలహాబాద్ జడ్జికి సుప్రీం కొలీజియం సమన్లు

**న్యూఢిల్లీ :** వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు సుప్రీంకోర్టు కొలీజియం సమన్లు జారీ చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఓ కార్యక్రమంలో శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగిస్తూ 'మెజారిటీ అభీష్టం' మేరకే దేశం పని చేస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు కొలీజియం ఆయనకు సమన్లు జారీ చేస్తూ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం మంగళవారం సమావేశమై ఈ అంశంపై చర్చిస్తుందని తెలిసింది.

ఈ నెల 8న ప్రయాగరాజ్‌లో వీహెచ్‌పీ కార్యక్రమం జరిగింది. అందులో జస్టిస్ యాదవ్ ప్రసంగిస్తూ ఉమ్మడి పౌరస్మృతిని సమర్థించారు. 'ఇది చట్టం. ఈ చట్టం మెజారిటీకి అనుగుణంగా పనిచేస్తుంది. కుటుంబం లేదా సమాజం కోణంలో దీనిని చూడండి. మెజారిటీ ప్రజల సంక్షేమానికి, సంతోషానికి ఏది ప్రయోజనకరమో దానినే అంగీకరించడం జరుగుతుంది' అని ఆయన చెప్పారు. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. న్యాయమూర్తి వ్యాఖ్యలు విభజనకు దారితీస్తాయని, అవి రాజ్యాంగ విరుద్ధమైనవని ప్రతిపక్షాలు మండిపడ్డాయి.యాదవ్ వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలకు సుప్రీంకోర్టు స్పందిస్తూ అలహాబాద్ హైకోర్ట్ నుండి నివేదికను కోరింది. 'జస్టిస్ యాదవ్ ప్రసంగానికి సంబంధించి పత్రికలలో వచ్చిన వార్తలను సుప్రీంకోర్టు గమనంలోకి తీసుకుంది. దీనిపై హైకోర్టు నుండి వివరాలు కోరాము. ఈ అంశాన్ని పరిశీలిస్తున్నాము' అని సుప్రీంకోర్టు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు రాజకీయ, న్యాయ వర్గాలలో కలకలం రేపాయి. అవి న్యాయ వ్యవస్థ నిష్పాక్షికతను ఉల్లంఘిస్తున్నాయని విమర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తిగా చేసిన ప్రమాణాన్ని యాదవ్ వ్యాఖ్యలు ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంటూ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సీపీఐ (ఎం) నేత బృందా కరత్ ప్రధాన న్యాయమూర్తి ఖన్నాకు లేఖ రాశారు. జడ్జి వ్యాఖ్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కూడా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ యాదవ్ అభిశంసన కోసం రాజ్యసభలో 55 మంది ప్రతిపక్ష సభ్యులు నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## గురుకుల హాస్టల్లో ఎలుకల బెడద

నవతెలంగాణ-కీసర

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి విద్యార్థులు నిద్రించే సమయంలో ఐదుగురిని ఎలుకలు కరిచాయి. హాస్టల్ సిబ్బంది, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి కలిసి విద్యార్థులను కీసర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం బయటకు పొక్కకుండా విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని సమాచారం. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, విద్యార్థులకు దద్దుర్లు, దురదలు వచ్చాయని, అందుకే ఆస్పత్రి తీసుకొచ్చామని చెప్పారు. ఎలుకలు కరిశాయనేది తప్పుడు ప్రచారం అన్నారు. అయితే, గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచాయని, వారికి చికిత్స అందించినట్టు కీసర ప్రభుత్వాస్పత్రి వైద్యులు తెలపడం గమనార్హం.

## రాజ్యసభ ఎంపీల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి చెందిన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రం నుంచి ఇటీవలి ఎన్నికైన ఎంపీలు సానా సతీష్, బీదా మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య చేత చైర్మెన్ జగదీప్ ధన్కర్ రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ తరపున సానా సతీష్, బీదా మస్తాన్ రావు, బీజేపీ తరపున ఆర్.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో బీదా మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజ్యసభ సభ్యులుగా రాజీనామా చేసి, టీడీపీ, బీజేపీలో చేరారు.

## అమిత్ షా పెద్ద వాషింగ్ మెషిన్ కొన్నారు

(మొదటిపేజీ తరువాయి)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పెద్ద వాషింగ్ మెషిన్ కొన్నారని, ఆ వాషింగ్ మెషిన్‌లోకి ఎవరు వెళ్లినా పరిశుద్ధం అయిపోతారని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సెటైర్ వేశారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజ్యసభలో ప్రత్యేక చర్చ ప్రారంభమైంది. ఈ చర్చలో ఖర్గే మాట్లాడుతూ బీజేపీ తీరును, ఆ పార్టీ ముఖ్య నేతల తీరును తప్పుపట్టారు. ప్రతిపక్ష పార్టీల్లో ఉన్న నాయకులపై అవినీతి ముద్రవేసి, వాళ్లు బీజేపీలో చేరగానే నీతిమంతులుగా బీజేపీ చెబుతుండటంపై ఖర్గే ఎద్దేవా చేశారు. బీజేపీలో చేరగానే అవినీతిపరులు నీతిమంతులుగా మారుతారని ధ్వజమెత్తారు. 'అమిత్ షా ఒక పెద్ద వాషింగ్ మెషిన్ కొన్నారు. ఆ వాషింగ్ మెషిన్‌లోకి ఎవరు వెళ్లినా పూర్తిగా పరిశుద్ధమై బయటికి వస్తారు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. 'మీకు కేవలం ఒక రాష్ట్రమో, ప్రాంతమో ఓటేయలేదు. మీరు ఇతర ప్రాంతాలపై ప్రతీకారం తీర్చుకోవడం తగదు' అని హితవు పలికారు. ప్రధాని మోడీ ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికే వెళ్తారు. కానీ మణిపూర్‌కు వెళ్లేందుకు మాత్రం ఇష్టపడటం లేదు' అని విమర్శించారు. రాహుల్ గాంధీ మణిపూర్‌కు వెళ్లారని, అక్కడ యాత్ర చేశారని మల్లికార్జున్ ఖర్గే గుర్తు చేశారు. ప్రధానికి కావాల్సినంత భద్రత ఉన్నా ప్రధాని మాత్రం మణిపూర్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులవుతున్నా మణిపూర్‌లో పరిస్థితిని మీరు ఎందుకు చక్కదిద్దడం లేదని ఖర్గే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) నుంచి గ్రాడ్యుయేట్ పట్టా తీసుకున్నారని ఖర్గే గుర్తు చేశారు. ఆమె జేఎన్‌యూలో చదువును అభ్యసించారని, తాను మాత్రం మున్సిపాల్టీ స్కూల్లోనే చదువుకున్నానని గుర్తు చేశారు. అయితే ఆమె ఇంగ్లీష్, హిందీలో మాట్లాడే విధానం చాలా బాగుందని ఆయన ప్రశంసించారు. కానీ.. ఆమె చర్యలు ఏ మాత్రం బాగోలేవన్నారు. త్రివర్ణ పతాకం, అశోక చక్రం, రాజ్యాంగాన్ని ద్వేషించిన వాళ్లు.. నేడు రాజ్యాంగం గురించి పాఠాలు చెబుతున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు.. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో గాంధీ, నెహ్రూ, బీఆర్ అంబేద్కర్ దిష్టి బొమ్మలను ఇదే వ్యక్తులు తలగబెట్టారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంతో పాటు త్రివర్ణ పతాకాన్ని సైతం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యతిరేకించిందన్నారు. ఎందుకంటే.. మనుస్మృతి ఆధారంగా లేదని వారు ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకించారని వివరించారు. కానీ 2002 జనవరి 26 వరకు జాతీయ జెండానే ఆర్ఎస్ఎస్ ఎగురవేయలేదని విమర్శించారు. అప్పుడు 2022లో తొలిసారిగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో బలవంతంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని మల్లికార్జున్ ఖర్గే గుర్తు చేశారు.నెహ్రూ, ఇందిరాగాంధీలను బీజేపీ కించపరుస్తోన్నదని, బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఖర్గే అన్నారు. బీజేపీ విభజన సూత్రాన్ని నమ్ముతున్నదని, కానీ ప్రజలకు కావాల్సింది మాత్రం స్వేచ్ఛ, సమానత్వమని చెప్పారు. దేశం కోసం బీజేపీ నేతలు ఎప్పుడూ పోరాటం చేయలేదని, అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శలు గుప్పించారు. బీజేపీ రాజ్యాంగానికి అనుకూలమా.. వ్యతిరేకమా..? అని ప్రశ్నించారు. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని బీజేపీ ఏనాడూ గౌరవించలేదని, అలాంటి వాళ్లు ఇప్పుడు రాజ్యాంగం గురించి మాకు పాఠాలు చెబుతుం డటం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం బలోపేతానికి గత 11 ఏండ్లలో ప్రధాని మోడీ ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీజేపీ నేతలు అబద్ధాలతో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

**రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అగౌరవ పరిచింది : నిర్మలా సీతారామన్**

పదవుల కోసం కాంగ్రెస్ రాజ్యాంగాన్ని అగౌరవ పరిచిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. సోమవారం రాజ్యసభలో రాజ్యాంగపై చర్చను మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. దీన్ని కూడా ఆమె కాంగ్రెస్ విమర్శలకే ఉపయోగించుకున్నారు. కేవలం కుటుంబ లబ్ది కోసమే రాజ్యాంగ సవరణలు చేసిందన్నారు. ముస్లిం మహిళలకు భరణాన్ని సైతం ఇవ్వకుండా చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో పలు రాజకీయ పార్టీల నాయకులు జైళ్లో మగ్గారని అన్నారు. అందుకోసం సవరణలు చేసిన నాయకులను జైల్లో పెట్టిన సందర్భాలూ ఉన్నాయని ఆరోపించారు. చివరకు ప్రముఖ నవలా రచయిత సల్మాన్ రష్దీ రచించిన పుస్తకంపై నిషేధం విధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆమె పేర్కొన్నారు. దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో వాక్ స్వాతంత్ర్యం కారణంగా చోటు చేసుకున్న పరిణామాలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు.

నవతెలంగాణ





విశ్వక్‌సేన్

## 'లైలా' రిలీజ్ ఎప్పుడంటే?


విశ్వక్‌సేన్ 'లైలా'లో అందరినీ ఆశ్చర్యపరచడానికి రెడీ అవుతున్నారు. అబ్బాయి, అమ్మాయిగా రెండింటినీ పోషించి వెర్సటాలిటీ చూపించబోతున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. మేకర్స్ గతంలో 'లైలా' ఐ లుక్‌ని రిలీజ్ చేయగా విశ్వక్‌సేన్ క్యారెక్టర్ అందరినీ మెస్మరైజ్ చేసింది.

తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజున ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రొమాంటిక్ జోనర్‌లో వస్తున్న సినిమాకి లవ్ సీజన్ రిలీజ్‌కి పర్ఫెక్ట్ టైంగా మేకర్స్ భావిస్తున్నారు.

రిలీజ్ డేట్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ స్టైలిష్ అవతార్, స్పోర్టింగ్ ట్రెండీ ఎటైర్, సన్ గ్లాసెస్‌తో కనిపించారు. న్యూ ఇయర్ రోజున లైలా ఫస్ట్ రోజ్ (ఫస్ట్ లుక్)ని రిలీజ్ చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో అమ్మాయి పాత్రను పోషించడానికి విశ్వక్‌షేన్ బ్యూటీఫుల్‌గా మేక్ఓవర్ అయ్యారు. ఆకాంక్ష శర్మ కథానాయికగా అరంగేట్రం చేస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.

# నవచిత్రం

## కిరాటగా మోహన్‌లాల్



మోహన్‌లాల్

విష్ణు మంచు నటిస్తూ, నిర్మిస్తున్న ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి స్టార్లు భిన్న పాత్రల్లో ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. తాజాగా మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో ఆయన కనిపించబోతున్నట్లు తెలుపుతూ ఈ పోస్టర్ రిలీజ్ చేశారు. గంభీరమైన మోహన్ లాల్ లుక్ చూస్తుంటే చిత్ర మేజర్ హైలైట్స్‌లో ఈయన క్యారెక్టర్ కూడా ఒకటని స్పష్టమవుతోంది. విడుదల చేసిన కాసేపట్లోనే ఈ పోస్టర్ వైరల్‌గా మారింది. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో కనిపించనున్న ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రాబోతోంది. ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తోంది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 25న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. 'కన్నప్ప' మూవీ ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుందని.. భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించనున్నాం. ఎంతో వ్యయప్రయాసలతో భారత దేశంలోని నాలుగు మూలల ఉన్న మహానటుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. ఈ సినిమాతో విష్ణు మంచు తనయుడు అవ్రామ్ భక్త మంచు ఆరంగేట్రం చేస్తుండటం సంతోషంగా ఉంది' అని మోహన్‌బాబు చెప్పారు.



## సినిమా ఓపెనింగ్ నుంచే షాక్ అవుతారు..

హీరో ఉపేంద్ర 'యు అండ్ ఐ ది మూవీ'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. లహరి ఫిల్మ్స్ జి మనోహరన్, వీనస్ ఎంటర్‌టైనర్స్ కెపి శ్రీకాంత్ ఈ చిత్రాన్ని హై బడ్జెట్‌తో నిర్మించారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రం ఈనెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. డైరెక్టర్ బుచ్చిబాబు సాన, నిర్మాత ఎస్‌కేఎన్ అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

హీరో ఉపేంద్ర మాట్లాడుతూ, 'తెలుగు ఇండస్ట్రీకి కృతజ్ఞతలు. ఇండియానే కాదు.. ప్రపంచాన్నే షేక్ చేస్తుంది టాలీవుడ్. 1000 కోట్లు, 2000 కోట్లు సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ కొడుతున్నారు. నిర్మాత కె.పి శ్రీకాంత్‌కి ఈ సినిమా ఐడియా చెప్పాను. ఆయన లహరి లాంటి గొప్ప సంస్థని తీసుకొచ్చారు. ఇది రెగ్యులర్ ఫిల్మ్‌లాగా ఉండదు. ఒక కొత్త సినిమాని ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. ఇది ఒక ఇమేజినరీ వరల్డ్‌లా ఉంటుంది. మ్యూజిక్ డైరెక్టర్ అజినీస్, ఆర్ట్ డైరెక్టర్ శివకుమార్, కెమెరామెన్ వేణు, ప్రజ్వల్, ఫైట్ మాస్టర్స్ రవివర్మ, థ్రిల్లర్ మంజు ఇలా అందరూ వచ్చి నా విజన్‌కి హెల్ప్ చేశారు. రేష్మ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. రాంబాబు అన్ని సాంగ్స్ బ్రహ్మాండంగా రాశారు. పార్థసారథి ఈ సినిమాని ఒక తెలుగు సినిమాలాగే ప్రజెంట్ చేశారు. నాకు చిరంజీవి ఫ్యామిలీతో 30 ఏళ్లుగా అనుబంధం ఉంది. ఆయనతో ఒక సినిమా చేయాలని వన్ ఇయర్ ట్రావెలయ్యాను. అల్లు అరవింద్ ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. అది మాకు చాలా స్పెషల్. సినిమా ఓపెనింగ్ నుంచే షాక్ అవుతారు' అని తెలిపారు.

## థియేటర్లలో చూడాల్సిన చిత్రం : విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, వెట్రిమారన్ కలయికలో రూపొందిన 'విడుదల -1' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నిర్మాత, శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు.

సినిమా విడుదల సందర్భంగా హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించడం ఎంతో గర్వంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు ఇచ్చే సపోర్ట్ ఎంతో గొప్పగా ఉంటుంది. ఇటీవల నా 'మహారాజా' చిత్రాన్ని సూపర్‌హిట్ చేశారు. ఆ కోవలోనే ఈ చిత్రం కూడా మిమ్మల్ని ఎంతగానో అలరిస్తుందనే నమ్మకం ఉంది. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి బాగా ప్లస్ అవుతుంది. అందరూ ఈ చిత్రాన్ని థియేటర్లలోనే అనుభూతి చెందాలి. అందరిని ఎంతో సంతృప్తి పరిచే చిత్రమిది' అని అన్నారు. హీరోలందరూ వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని కోరుకుంటారు. అలాంటి దర్శకుడు, విజయ్ సేతుపతి కలయికలో రాబోతున్న ఈ సినిమా ఎలా ఉంటుందో?, మిమ్మల్ని ఎలాంటి ప్రపంచంలోకి తీసుకెళ్తుందో ఈనెల 20న థియేటర్స్‌లో చూడబోతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో సంచలన విజయం సాధిస్తుంది' అని నిర్మాత రామారావు చెప్పారు.

## బీచ్‌లో వరుస హత్యలు..?



వెన్నెలకిశోర్

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సోమవారం ఈచిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారడంతో బీచ్‌లో జరిగే వరుస హత్యల చుట్టూ కథ తిరుగుతుంది. కేసును ఛేదించలేక, పోలీసులు క్రియేటివ్, కాలిక్యులేటివ్ ఎప్రోచ్‌తో పాపులరైన ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమిస్తారు. డిటెక్టివ్ గ్రామంలోని ప్రేమజంటతో సహా అనుమానితులను ఏడుగురిని గుర్తిస్తాడు. రైటర్ మోహన్ కథను ఎంగేజింగ్, సస్పెన్స్‌గా ప్రజెంట్ చేశారు. వెన్నెల కిషోర్ టైటిల్ క్యారెక్టర్‌కు జీవం పోశాడు. ఈ చిత్రం ఈనెల 25న థియేటర్లలో విడుదల కానుంది. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

## 'ఫియర్'కు విశేష ప్రేక్షకాదరణ




హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన సినిమా 'ఫియర్'. ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఫియర్ మూవీని రూపొందించారు. ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన ఈ సినిమా రిలీజైన అన్ని సెంటర్స్‌లో సూపర్ హిట్ టాక్‌తో రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ డా. హరిత గోగినేని మాట్లాడుతూ, 'మా సినిమాకు ప్రేక్షకులు, మీడియా నుంచి వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఇంటర్నేషనల్ జ్యూరీ ఉండే అవార్డ్సులో 70కి పైగా అవార్డ్స్ గెల్చుకోవడం మామూలు విషయం కాదు. అలాగే యూనిక్ కలర్ ప్యాటర్న్‌లో ఇంత వరకు ఏ సినిమా రాలేదు. సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్ విత్ హర్రర్ కాన్సెప్ట్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది' అని అన్నారు.

## అరుదైన బయోపిక్



స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా రూపొందుతున్న సినిమా 'బాబు జగజ్జీవన్ రామ్'.

ఈ చిత్రాన్ని పెదరావూరు ఫిలిం స్టూడియోస్, తెనాలి బ్యానర్ పై దర్శకుడు దిలీప్ రాజా రూపొంది స్తున్నారు. బాబు జగజ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా షూటింగ్ విశేషాలను ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్రబృందం వివరించింది.

దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ, 'బాబూ జగజ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాను. జగజ్జీవన్ రామ్ వర్ధంతి అయిన జూలై 6న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. 40 ఏళ్ల కేంద్రమంత్రిగా, 50 ఏళ్ల పార్లమెంటేరియన్‌గా దేశానికి సేవలు అందించి చరిత్ర సృష్టించారు జగజ్జీవన్ రామ్. గాంధీజీ, నేతాజీ, లాల్ బహదూర్ శాస్త్రి, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రలు ఉంటాయి. జగజ్జీవన్ రామ్ కుమార్తె లోక్ సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పాత్రలో తాళ్లూరి రామేశ్వరి నటిస్తున్నారు. తెలుగుతో పాటు పాన్ ఇండియా భాషల్లో ఈ అరుదైన బయోపిక్‌ని రిలీజ్‌కు తీసుకొస్తాం' అని చెప్పారు.

# సర్పంచులకు రూ.691 కోట్లు ఇవ్వడానికి మనసొప్పట్లేదా?

### నవంబర్‌లోనే బడా కాంట్రాక్టర్లకు రూ.1200 కోట్లు చెల్లింపు

- ప్రశ్నోత్తరాల్లో పెండింగ్ బిల్లులపై బీఆర్ఎస్ సభ్యులు టి.హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదిగా సర్పంచుల పెండింగ్ బిల్లులు రూ.691 కోట్లు ఇవ్వడానికి మనసొప్పట్లేదా?' అని బీఆర్ఎస్ సభ్యులు టి. హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒక్క నవంబర్ నెలలోనే బడా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.1200 కోట్లు చెల్లించిందన్నారు. కానీ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీల పట్ల పగబట్టి, కక్షగట్టి వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు అనే అంశంపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు అరిగోస దీస్తున్నారన్నారు. ఎక్కడ చలో అసెంబ్లీకి వస్తారోననే భయంతో మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని వాపోయారు. తమ ప్రభుత్వ హయాంలో సర్పంచులకు ఈ పరిస్థితి లేదని చెప్పారు. ప్రతినెలా పల్లెప్రగతికి రూ.275 కోట్లు, పట్టణ ప్రగతికి రూ.150 కోట్లు విడుదల చేశామన్నారు. కేంద్రం ప్రకటించే అవార్డుల్లో టాప్-20లో 19 తెలంగాణ పల్లెలకే దక్కాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జీపీలకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదనీ, రెగ్యులర్ నిధులను కూడా ఇవ్వడం లేదని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. తెలంగాణకు పోతే చికున్‌గున్యా వ్యాధి వస్తుందని అమెరికా దేశం తమ పౌరులను హెచ్చరించే దాకా పరిస్థితి దిగజారిందన్నారు. ఎంపీటీసీలకు మూడు నెలల గౌరవ వేతనాలను రాష్ట్ర సర్కారు పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. జెడ్పీటీసీలకు పెన్షన్ హామీ ఇంకెక్కడ నెరవేరుతుందని ప్రశ్నించారు. వారికి గౌరవేతనాలు, పెండింగ్ బిల్లులు ఎప్పటిలోగా క్లియర్ చేస్తారు? పెన్షన్ ఎప్పటి నుంచి ఇస్తారనే దానిపై స్పష్టతివ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ సర్కార్ జీపీలకు, పట్టణాలకు ప్రతి నెలా నిధులు విడుదల చేస్తే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. పంచాయతీలకు ఎస్‌డీఎఫ్ ఫండ్ ఇవ్వట్లేదనీ, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను దారిమళ్లిస్తున్నదని విమర్శించారు. హస్తం పార్టీ హామీ స్థానిక ప్రజా ప్రతినిధుల పట్ల భస్మాసుర అస్త్రంగా మారిందన్నారు.

మాజీ సర్పంచులు, ఎంపీటీసీల పట్ల కక్షగట్టిన సర్కారు

ఇదే ప్రశ్నపై బీఆర్ఎస్ సభ్యులు పల్లారాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కోవా లక్ష్మి బీజేపీ సభ్యులు కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..తమ నియోజకవర్గంలోని పలు మండలాల్లోని మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, వారు పడుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. బడా కాంట్రాక్టర్లకు రూ.1200 కోట్లు విడుదల చేసి..రూ.5 లక్షలు, రూ.10 లక్షలున్న చిన్న కాంట్రాక్టర్లకు, సర్పంచులకు బిల్లులు క్లియర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్టు హరీశ్‌రావు ప్రకటించి వెళ్లిపోయారు. మళ్లీ బీఆర్ఎస్ సభ్యులంతా ఒక నిమిషం తర్వాతనే సభలోకి వచ్చారు. ఇదే అంశంపై కాంగ్రెస్ సభ్యులు రాజేందర్‌రెడ్డి కూడా మాట్లాడారు.

# హరీశ్‌రావు సంతకం పెడితే ఆనాడే విడుదలయ్యేవి

### సర్పంచుల బిల్లులపై ఇంత బాధపడే పరిస్థితి వచ్చేదికాదు

### మేం ఇవ్వబోమని చెప్పట్లేదు.. కాస్త టైం అడుగుతున్నాం

బీఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'హరీశ్‌రావు ఇప్పుడు ఇంత బాధపడుతున్నారు. సర్పంచుల బిల్లుల విషయంలో మేం ఏదో తప్పుచేసినట్టు మాట్లాడుతున్నారు? ఆనాడు ఆర్థిక మంత్రిగా ఆయనే ఉన్నారు. అంతా ఆయన చేతిలోనే ఉండే. ఒక్క సంతకం పెడితే బిల్లులన్నీ క్లియర్ అయ్యేవి. అప్పుడు ఒక్క సంతకం పెట్టలేకపోయారా? ' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.తమ ప్రభుత్వం వచ్చాక ఫిబ్రవరి నెలలోనే సర్పంచుల పదవీ కాలం అయిపోయిందన్నారు. కులగణన చేసి కొత్త రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో సర్పంచులకు పెండింగ్ బిల్లులు లేవని చెప్పారు. 2014 నుంచి సర్పంచులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తమ దగ్గర లెక్కలున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు వారసత్వంగా పెండింగ్ బిల్లులను ఇచ్చిందన్నారు. అయినా, గత ప్రభుత్వ హయాంలో సర్పంచులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఆపొద్దనే ఆలోచనతో ఇప్పటిదాకా తమ ప్రభుత్వం రూ.741 కోట్లు విడుదల చేసిందనీ, ఉపాధి హామీ కింద కూడా రూ.450 కోట్లు రిలీజ్ చేసిందని వివరించారు.

ఇంకా కొంత మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమని చెప్పారు. ఎన్నికలు జరగకపోవడం, 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు రాకపోవడం వంటి కారణాలతో విడుదల చేయలేకపోయామన్నారు. మన ఊరు మన బడి పథకం కింద రూ.1100 కోట్ల పనులు గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయనీ, బిల్లులు మాత్రం రూ.800 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తమ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పనులు చేస్తున్నదని తెలిపారు. తాము పెండింగ్ బిల్లులు చెల్లించబోమని చెప్పట్లేదనీ, కచ్చితంగా చెల్లించి తీరుతామని హామీనిచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిపోయినటువంటి వారసత్వ పెండింగ్ బిల్లులు, అప్పులు విపరీతంగా ఉన్నాయనీ, ఆర్థిక వ్యవస్థ బాగాలేకపోవడంతో సర్దుబాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కాస్త టైం అడుగుతున్నామనీ, తప్పనిసరిగా వారి బిల్లులను క్లియర్ చేస్తామని భరోసానిచ్చారు. అయినా, ఆనాడు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక్కసంతకం పెడితే ఆనాడే బిల్లులు విడుదలయ్యేవనీ, ఇప్పుడు ఈ బాధే ఉండేది కాదని చెప్పారు. బీఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితిగా మారిందని విమర్శించారు.

# రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌కు పట్టదు

### పెద్దల సభ ఔన్నత్యాన్ని తగ్గించడం సరికాదు

- మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- బీఆర్ఎస్ సభ్యుల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఇది పెద్దల సభ. సభ్యులు సభా సంప్రదాయాలను పాటించాలి. గౌరవాన్ని కాపాడాలి. కానీ బీఆర్ఎస్ సభ్యులు సభా మర్యాదను పాటించడం లేదు. ఫ్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం నిషేధం. అందుకు సంబంధించిన నిబంధనలను స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలోనే రూపొందించారు. ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరికాదు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌కు పట్టడం లేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం, ఆదాయం పెరగడం, అభివృద్ధి కావడం ఆ పార్టీకి ఇష్టం లేదు. రాష్ట్రం ఏమైనా పోయినా ఫరవాలేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నది.'అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం శాసనమండలిలో 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం'అనే అంశంపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. మధ్యాహ్నం 3.20 గంటలకు సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు ఫ్లకార్డులు ప్రదర్శించారు. కొందరు సభ్యులు తాత మధు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శంభీపూర్‌రాజు, నవీన్‌రెడ్డి ఫ్లకార్డులతో చైర్మెన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన చేపట్టారు. మిగిలిన సభ్యులు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రైతుకు బేడీలు సిగ్గు సిగ్గు, లగచర్ల రైతులపై కేసులు ఎత్తేయాలి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పలుమార్లు సభ్యులను వారి సీట్లలో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశం బీఏసీలో చర్చకు వచ్చిందనీ, మంగళవారం చర్చిద్దామని చెప్పారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు వినకుండా నిరసనను కొనసాగించారు. నిరసన మధ్యలోనే భట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ సభ్యులు సభా గౌరవాన్ని దెబ్బతీయడం దురదృష్టకరమని అన్నారు. సభ మర్యాదలను పాటించాలనీ, ఔన్నత్యాన్ని కాపాడాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాల గురించి పట్టించుకోవాలని కోరారు. కానీ బీఆర్ఎస్ సభ్యుల తీరు అందుకు విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్రా భివృద్ధి జరగొద్దనీ, ఆదాయం సమకూరొద్దనీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రావొద్దన్నట్టుగా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా, రూ.7.50 లక్షల కోట్ల అప్పులు చేసి ఇప్పుడు సభను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. అనంతరం సభను మంగళవారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

#### లగచర్ల బాధితులను విడుదల చేయాలి : మధుసూదనాచారి

లగచర్ల ఘటన పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు శాసనమండలిలో మీడియా పాయింట్ వద్దకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నదని అన్నారు. పట్నం నరేందర్‌రెడ్డిని ఇంకా విడుదల చేయకపోవడం సరైంది కాదన్నారు. లగచర్ల బాధితులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా ఎత్తేయాలని డిమాండ్ చేశారు. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లినందుకు రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కోరారు. ఆ బాధితులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు.

#### 28 మంది చేనేత కార్మికుల ఆత్మహత్య : ఎల్ రమణ

రాష్ట్రంలో 28 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని బీఆర్ఎస్ సభ్యుడు ఎల్ రమణ అన్నారు. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కొనసాగిన పథకాలను కొనసాగిం చాలని సూచించారు. నూలు, రసాయనాలపై జీఎస్టీని ఎత్తేయాలని కోరారు. చేనేత కార్మికులకు సంబంధించిన రూ.30 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాలేడు

### అందుకే అసెంబ్లీకి వస్తలేడు : అసెంబ్లీ లాబీలో కోమటిరెడ్డి వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేదనీ, అందుకే ఆయన అసెంబ్లీకి వస్తలేడని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఐదుగురు ఉన్నపుడు భట్టి విక్రమార్క వచ్చారు. 30 మంది ఎమ్మెల్యేలు ఉన్న కేసీఆర్ ఎందుకు వస్తలేడు..? సోమవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో ముచ్చటించారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమనీ, కేటీఆర్, హరీశ్‌రావుకు అవి లేవని వ్యాఖ్యానించారు. వాళ్లు పబ్లిక్ జోకర్లుగా మారిపోయారని చెప్పారు. డీలిమిటేషన్‌లో తెలంగాణకు 34 అసెంబ్లీ సీట్లు, ఏడు ఎంపీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. జమిలీ ఎన్నికల డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణలో ఎవరికి పదవులు వస్తాయోననేది ఎవరు చెప్ప లేరని వివరించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమనీ, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ సైతం ఓడిపోయారని చెప్పారు. నాపై కోట్లు ఖర్చు పెట్టినా బూరా నర్సయ్య ఎంపీగా గెలవలేకపోయారన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసు కొచ్చానని గుర్తు చేశారు. వెంకన్న నాకు చోటా బాయ్ అని సీఎం రేవంత్‌కు గడ్కరీ చెప్పారని వివరించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష నేత పాత్ర పోషించాలనీ, మంత్రిగా ఏ ప్రశ్నకైనా నేను జవాబిస్తానని అన్నారు. ప్రజల్లో పరపతిలేని కేటీఆర్, హరీశ్ గురించి మాట్లాడొద్దని సీఎం గారికి సూచించాననీ, అందుకే పాలమూరు, నల్లగొండలో మాట్లాడలేదన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886